

سویرا

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

129 మాస పత్రిక జులై 1982

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా రు. 20 ఈ సంచిక రు. 2

కాగితం మీది అక్షరానికి బలి అయిపోయిన కలంయోధుడు చెరబండరాజు

"నన్నెక్కనివ్వండి బోను" అంటూ ఈ మన "వందేమాతరం" వాస్తవ పరిస్థితులను దిక్కులు పిక్కటిల్లేలా ప్రకటించిననాడు గానీ "కాలిమంటుకున్నాది తిత్తినిండా గాలి పొత్తంగ వున్నాది. నిప్పారిపోనీకు" అని చెప్పిన నాడు గానీ సమస్త వృత్తుల సహస్ర చిహ్నాల్ ఉత్పత్తిలో పాల్గొని సంపదలు సృష్టించడమే కాదు, చైతన్య వంతమయి పోరాడిన నాడు "చావు మీదిరో-గెలుపు మాదిరో" అని స్పష్టం చేసిన నాడు గానీ "అమర జీవి పాణిగ్రాహి అన్నయ్యకు తమ్ములం ప్రజా యుద్ధ పల్లవిని పాడుతున్న రచయితలం" అని చెప్పుకున్ననాడు గానీ ఎదుటి వానికి చెప్పినట్టు కన్పించిన చోట, నలుగురి తరపున తాను చెప్తున్నట్టు కనిపించిన చోట కూడా చెరబండరాజు చేసింది కేవలం రచన కాదు. అల్లిక పని కాదు. కలం పని, గళం పనికాదు. అది ఆయన అనుభవం, ఆగ్రహం, ఆలోచన, అనుభూతి, ఆవేశం, ఆచరణ రంగరించి కన్నీళ్లు- చిరునవ్వు, ఓటమి-గెలుపు, ద్వేషం-ప్రేమ, భవిష్యత్తుపై విశ్వాసాలతో మేళవించి చేసిన బాస, ఆయన నోట్లోంచి కాదు ఆయన బొడ్డు దగ్గర నుంచి వచ్చిన మాట, పాట, ఆయన నాలుక చివరనుంచి కాదు. ఆయన అంతరాంతరాల్లోంచి వెల్లుబికి వచ్చిన ఆరాటమూ, ఆశ్వాసమూ.

తన కవితా వ్యక్తిని గురించి "బొట్లు బొట్లుగా నా నెత్తురు ఈ నేల మీద విప్లవం కోసం విత్తనాలుగా చల్లుతాను" అని ఆయన రాసింది ఇవాళ కేవలం కవితా వాక్యమే కాదు. చెర జీవితమూ, పోరాటమూ, మృత్యువుపై కూడా ఎత్తిన ధ్వజం-సన్నిహితంగా చూసి తెలిసిన వాళ్ళకు అది ఆయన తన గురించి కూడా చెప్పుకున్నట్లే కన్పిస్తుంది. ఇంక అప్పుడు ఆయన ఎట్లా ఉంటే ఏం?-ఆయన ఏం రాశాడు? అన్నది మనకు ముఖ్యం, అనిగానీ, అది కవిత్వం లే అనిగానీ, అది కవి సమయమనిగానీ, సరిపెట్టుకొనే సర్దుబాటుకు గానీ, రాజీకిగానీ, కన్సెషన్‌కి గానీ, చివరకు హిపోక్రసీకి గాని చోటు లేదు. అది ఆయన అనుకున్నాడు, అన్నాడు, చేసి చూపాడు. ఈ అన్నది చేసి చూపడానికి దోపిడీ వ్యవస్థతో, మృత్యు వ్యవస్థతో రాజీ లేని పోరాటం చేశాడు. పోరాటంలో నిర్బంధానికి గురి అయ్యాడు. మృత్యువుకు ఎర అయ్యాడు, కానీ ఆయన స్వేచ్ఛను కోల్పోలేదు. చచ్చి పోలేదు. చెరసాలలు రూపు మాసి, ఉరికొయ్యలు విరిగిపోయి మానవుడు

చెరబండరాజు కు చావులేదు

కే. శాంమోహన్ రాజు

వాస్తవం ఇంత భయంకరంగా— నిర్దయగా వుంటుందా? అనిపించే క్షణం ఇది. అంకుశాపురంలో ముప్ఫయ్యెనిమిదేళ్ళకింద పుట్టిన రైతుబిడ్డ భాస్కరరెడ్డి— ఇవాళ విప్లవకవులలో అగ్రగణ్యుడు చెరబండరాజుగా చరిత్రలో స్థానం ఆక్రమించాడు.

తెలుగుదేశంలో రాజకీయ ఉద్యమాలు, సాహిత్య ఉద్యమాలు లేనికాలంలో చెరబండరాజు కవిత్వాన్ని కేవలం సాధన చేశాడు. కానీ వ్యవస్థమీద జన్మించిన ఆగ్రహం దిగంబర కవిత్వంగా రూపుదాల్చేసరికి తానూ అధిక్కార స్వరాలలో ఒకటయాడు. చెరబండరాజుది దిగంబరసాహిత్యంలోనే కాదు విప్లవ కవిత్వంలో గూడా శిఖరస్థానమే.

వచన కవిత్వంకన్నా పాట ప్రజలకి దగ్గరి కళారూపమనీ, దానిలోనే జనం గుండెలసప్పుడు శక్తివంతంగా రికార్డు చేయవచ్చుననీ ఆయన భావించాడు. నిజానికి విప్లవ కవులలో అప్పుడు చాలామంది ఆలోచిస్తున్న విషయం అదేఐనా ఆచరణలో పెట్టింది చెరబండరాజే.

నిజమైన స్వేచ్ఛను అనుభవించే దాకా ప్రజాస్వేచ్ఛా కామనలో చెర ఊపిరి పోస్తూ ఊపిరి పీలుస్తూ ఉంటాడు.

మృత్యువు వచ్చి తలుపు తట్టి పిలిచిన వేళ కూడా "కలం, గళం ప్రాణప్రదం'గా "పోరాటం డైరెక్షన్‌లో" పాట ఆక్సిజన్‌గా ప్రజకి ఆయన అంకితమయి బతికాడు. అనారోగ్య బాధితుడుగానే కాదు అమరుడయి కూడా ఆయన యోధుడే.

రచన అంటే ఆచరణ అని, ఆచరణ ప్రజా జీవిత పోరాటాల ప్రతిఫలన మని ఆచరణ నుంచి నేర్చుకున్న జ్ఞానంతో చెప్పి కాగితం మీద పెట్టిన ప్రతి అక్షరానికి కట్టుబడి, కంఠోక్తిగా వచ్చిన ప్రతి ప్రతినకూ నిలబడి ప్రజా యుద్ధరంగంలో యోధునిగా నేరకొరిగిన కామ్రేడ్ చెరబండరాజు కోసం ప్రజా సాంస్కృతిక సైనిక వందనం చేద్దాం ఆయన వదలి వెళ్ళిన ఆశయాన్ని అందుకొని ప్రజల అంతిమ విజయం దాకా ముందుకే సాగుదాం. అదే మనం ఆయనకు అర్పించ వలసిన విప్లవ జోహార్!

—'సాహితీ మిత్రులు'

'నరుడో భాస్కరుడా' కావచ్చు 'చెల్లీ చెంద్రమ్మ' కావచ్చు విప్లవ కవిత్వానికి పాట అవసరాన్ని నొక్కిచెప్పితే దాన్ని అందరికన్నా ముందు గుర్తించి- ఆకృషిలో శ్రమించి 'కొండలు పగిలేసిన' విజయాన్ని సాధించిన వాడాయన. 'విప్లవాలయుగం మనది' అని నినాదాన్ని కవిత్వ స్థాయికి తీసుకుపోయిన అక్షరశిల్పి చెరబండరాజు. ఆయనలో ఉన్నది ఉత్త కవితావేశంకాదు. ఆ ఆవేశం ఆచరణతో ముడి పెట్టబడినది. విప్లవ ప్రజానీకం మీద, సహచర రచయితలమీద ఆయన ప్రభావం సాహిత్యపరంగా ఎంతవుందో విప్లవాచరణ పరంగా కూడ అంత ఉంది. అందుకే చెరబండరాజు ఆచరణవాది. ఆయన ఆచరణ వాదిత్వం కవిత్వంలో గూడా ప్రస్ఫుటమవుతుంది.

ఏదైనా సభలోనో, కవిసమ్మేళనంలోనో ఆయన ఉన్నాడంటే పండగే. కవిత్వాన్ని పుస్తకాల్లోంచి జనం మధ్యకు ప్రవహింపచేసినవాడు ఆయన,ఉపన్యాసాలు ఇస్తూగూడ చేత్తో చిటికెలువేస్తూ ఆయన పాటలు పాడుతూ వుంటే చూడటం అపూర్వమైన అనుభవం. ఆ దృశ్యం ఆయనలోని విప్లవదీక్షనూ తాదాత్మ్యతను కళ్ళకు కట్టేది. మనసుకు పట్టించేది. ప్రతీ సంవత్సరం ఆయనది ఒక పుస్తకం రావలసిందే. రాయడం పట్ల ఎంత శ్రద్ధచూపేవాడు వాటిని జనంలోకి తీసుకువెళ్ళటం పట్ల గూడా అంత శ్రద్ధ చూపేవాడు. ఆయన లేని సభను ఊహించటం— ఇప్పుడు చూడడం కష్టంగా వుంది.

చెరబండరాజును ఈవాళమనం విప్లవకవిగా గౌరవిస్తున్నాం. కానీ దిగంబర కవిగా ఉన్నప్పుడు గూడా ఆయన ఈ గౌరవానికి అర్హమైన రచనలు చేశాడు. 'వందేమాతరం' కవితలో భారతదేశాన్ని అంతర్జాతీయ విపణిలో తాకట్టు పెట్టారని అంటాడు.

విధ్వంసన, నిరసన, తిరుగుబాటు మాత్రమే లక్ష్యంగా సాగిన దిగంబర సాంప్రదాయంలోని వాడికి ఇంత స్పష్టమైన మార్క్సిస్టు అవగాహన రావటంచూస్తే ఆయన ఎటు చూస్తున్నాడో ఏం ఆలోచిస్తున్నాడో అర్థమవుతుంది. ఐతే ఇది యాదృచ్ఛికం కాదు- అప్పటికే భారతదేశంలో నక్సల్‌బరీ పోరాటం ప్రజ్వలిస్తూ వుండి శ్రీకాకుళాన్ని మేల్కొల్పుతోంది. చెరబండరాజు దిగంబర కవిత్వానికి గూడా ఈ నేపథ్యం వుంది. స్పష్టాస్పష్టమైన ఆలోచన ఆయనలో అప్పటికే పాదుకొంటోంది.

దీనర్థం ఏమిటంటే చెరబండరాజు పరిణామాత్మకంగా అభివృద్ధి చెందాడు. ఆయన దేశాన్నీ, దాని పరిస్థితినీ పోకడనీ చూశాడు. జనం పడుతున్న బాధలు గ్రహించాడు, ఎందుకంటే తానూ జనంలో భాగమే కనుక. ప్రజల కష్టసుఖా... స

కష్టసుఖాలకంటె వేరైనవి కాదు గనుక. వాటిని నివారించేమార్గం ఆయనకు స్పష్టమైంది. ఆ మార్గం ఎన్నో కష్టనష్టాలతో కూడి వుంది. దీర్ఘ కాలికమైనది. ఐనా అది తప్ప మార్గంలేదు. అందుకోసం కలాన్ని జెండాగా కత్తిగా పట్టుకొని నడిచాడు. చెరబండరాజు. ప్రజా సాహిత్యానికిఅర్థం చెప్పాడు. ముందు తాను రాసి చూపెట్టాడు.

అది తర్వాత వాళ్ళకి ఒరవడి అయింది. అతననుసరించిన గేయ మార్గాన్నే మిగతా కవులు చాలా వరకు నడిచారు. విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపకులలో ఒకడైనా, అప్పటికే సుప్రసిద్ధుడైనా వర్ధమాన రచయితలు, కవులతో ఆయన భేషజాలు లేకుండా ప్రవర్తించాడు. అశేషప్రజానీకంతో తానూ ఒకడిననే వారికి కాని ప్రత్యేక వ్యక్తిత్వమేదీ తనకు లేదనీ ఆయన గుర్తించాడంటే ప్రజలతో వారి జీవన విధానంతో ఆయనకు ఎంత సాన్నిహిత్యం వుందో వారి పట్ల ఆయన ఎంత బాధ్యతతో ప్రవర్తించాడో గ్రహించవచ్చు.

చెరబండరాజు విముక్తికై పోతున్న సామూహిక శక్తిలో భాగం. ఈ భావమే ఆయన్ను ప్రజలకు దగ్గర చేసింది.

విప్లవ రచయితలలో ఎవరికీ లేని ప్రత్యేక లక్షణం ఆయనలో వుంది. కవులు తాము రాసిన పాటలను తామే పాడి జనాల్లోకి తీసుకుపోవాలనేది ఆయన ఎప్పుడూ అంటూ వుండేమాట. అందువల్ల కవి తన భావాన్నీ ఉద్వేగాన్ని సూటిగా జనంలోకి తీసుకు వెళ్ళగలడు. అందుకే చెరబండ రాజుతనపాటలకు తానే బాణీలుకట్టి పాడేవాడు. ఆయనలో ఇతర్లకి చెప్పేముందు తానే ఆచరించి చూపే గుణం వుంది.

ఈ గుణమే ఆయనను విప్లవోద్యమానికి సన్నిహితం చేసింది. ప్రజలకి దగ్గర చేసింది. ప్రజాకవిగా చేసింది.

ప్రజలని చైతన్య వంతం చేయాలన్న తీవ్ర కాంక్షతోనే ఆయన పాటలు, కథా గేయాలు రచించాడు. వాటనన్నిటినీ ఆయన స్వయంగాపాడి ప్రజల్లోకి తీసుకు వెళ్ళాడు. వాటిలో ఉన్న భావతీవ్రత విప్లవ వాస్తవికతల వల్ల ఆ గేయాలు ప్రజాపోరాటాల్లో పదునైన ఆయుధాలుగా ఉపయోగ పడ్డాయి.

పెటీ బూర్జువా వాతావరణంలో జీవించవలసి వచ్చినా- రైతుకుటుంబం నుంచి వచ్చినవాడు గనుక ఆయన తన వర్గ స్వభావాన్ని కోల్పోకుండా తన చైతన్యాన్ని నిరంతరం ఆచరణ ద్వారా సాన పెట్టుకుంటూనే వున్నాడు.

రైతుకుటుంబపు గ్రామీణ నేపథ్యం ఉంది గనుకే కూలీల బాధలు గాథలు 'కొండలు పగలేసినం' అని విన్పించగలిగాడు. 'కొండలు పగలేశారు' అనిగాక 'పగలేసినం' అనటంవల్ల ఆ శ్రామికుల్లో తానూ ఒకడవుతున్నాడు.

ఈ గుణంవల్లనే చెరబండరాజు ప్రజలలో తన స్థానాన్ని ప్రతిష్ఠించుకున్నాడు. ఆయన కథ రాసినా, నవల రాసినా, పాట రాసినా, గేయం రాసినా గ్రామీణ నేపథ్యం ఉండకుండాపోదు. ఆయన అక్షరాలా రైతుబిడ్డ- రైతుల, రైతుకూలీల కవి- ప్రజా కవి-

భారతీయ సాహిత్యంలో ప్రేమ్‌చంద్‌తో పోల్చదగ్గవాడు చెరబండరాజు. ఇద్దరూ రైతుల-రైతుకూలీల జీవితాలని చిత్రించిన వారే. వారి బాధల్ని గాథలుగా మలిచినవారే- కానీ చెరబండరాజు మరో అడుగు ముందుకు వెళ్ళి వాళ్ళ జీవితాలలో మార్పుకోసం ఏం చెయ్యవలసి ఉంటుందో గ్రహించాడు. వారికి నేర్పాడు. వారికి నేర్పటం ద్వారా తాను నేర్చుకున్నాడు.

ఈ క్రమంలో ఎన్ని నిర్బంధాలు ఎదురైనా ఆయన మనోధైర్యాన్ని విశ్వయాన్నీ దెబ్బతీయలేకపోయాయి. దోపిడీ దళారీ ప్రభుత్వపు హింస మాత్రమేకాదు- భయంకరమైన మృత్యువు కూడా ఆయన్ని జయించలేకపోయింది. శరీరం అచేతనంగా పడివున్నా మానసిక చైతన్యంతో క్షణక్షణం మృత్యువుతో పోరాడిన సాహిత్య యోధుడు చెరబండరాజు.

ఆయన మొదటినుంచి గూడా సామాజిక ప్రయోజనాన్నీ అందించే కవిత్వం రాశాడు. ప్రజలపట్ల తనకున్న నైతిక బాధ్యతని గుర్తించి ఆ అవసరాలకోసం కవిత్వం రాశాడు.

అందుకోసం ఆయనకు లభించిన ప్రతిఫలం జైళ్ళు, ఉద్యోగం నుంచి ఉద్వాసన. ఐనా ప్రభుత్వ దమన నీతిని ప్రజలు గుర్తించారు. చెరబండరాజు ప్రజల కవి అని అతన్ని తామే రక్షించుకోవడానికి ముందుకొచ్చారు.

చెరబండరాజు ఈ విషయంలో గూడా అపూర్వుడే. మన సాహిత్య చరిత్రలోనే ప్రజా కవిని ప్రజలు రక్షించుకోవడానికి ముందుకు రావటం ఇదే ప్రథమం. దీనివల్ల చెరబండరాజుకు ప్రజల్లో ఉన్న ఆదరణా, ఆత్మీయతా తెలుస్తున్నాయి. **అలాంటి చెరబండరాజు మన మధ్య లేడనీ, మరణించాడనీ అనగలవారెవ్వరు?**

'కొలిమంటుకున్నాది' అనే ఆయన పాటని బెంగాలీ విప్లవకవి విద్యుత్ భౌమిక్ హిందీలోకి అనువదించి తానే స్వయంగా తన నిప్పుల కంఠంతో పాడి ప్రజల్లోకి తీసుకు వెళ్ళాడు. చెరబండరాజులో వున్న విప్లవ దీక్ష భాషా భేదాలు లేకుండా ప్రాచుర్యంపొందిందంటే దానికి ఆయన కవిత్వంలో వున్న శక్తి, చిత్త శుద్ధీ, నమ్మిన దాన్ని ఎంత కష్టమైనా సరే ఆచరించే గుణమే కారణం.

ఇవాళ ఆయన పాటలు బెంగాలీలో హిందీలో విప్లవావసరాన్ని ప్రబోధిస్తూ మారుమోగుతున్నాయి.

తెలుగు నేలన పుట్టిన రైతుబిడ్డ కవిత్వాన్ని గండ్ర గొడ్డలిగా ధరించి ప్రాంతీయతలతో పనిలేకుండా సీమల మధ్య సరిహద్దుల్ని ఖండిస్తున్నాడు. పీడిత జనాల విముక్తి కోసం'అగ్ జలేలో'హ శాలామే' అంటున్నాడు. తిత్తినిండాగాలి పొత్తంగ ఉందంటున్నాడు. చెరబండరాజు ఇవన్నీ చేశాడు అనేకాదు ఇంకా చేస్తున్నాడు అని చెప్పుకోవాలి. ఇంకా ఇంకా-భారత దేశంలో వ్యవసాయిక విప్లవం విజయ వంతమయ్యేంత వరకు ఆయన సృష్టించిన సాహిత్యం ఈ కార్యక్రమాన్ని కొన సాగిస్తూనే వుంటుంది. జనం నాలుకల మీద ఆయన సాహిత్యం ఆడుతున్నంత వరకు చెరబండరాజుకు చావులేదు.

(కరీంనగర్ 'స్టడీసర్కిల్' జులై 5 న ఏర్పాటు చేసిన చెరబండరాజు సంస్మరణ సభలో చేసిన ప్రసంగసారం)

ప్రజా సాహిత్య, సాంస్కృతిక యోధుడు చెరబండరాజు—

వ్యక్తిత్వ, సాహిత్య సమాలోచన సృజన సమగ్రంగా తలపెట్టింది. ఆయనతో, ఆయన సాహిత్య ప్రక్రియలతో పరిచయం, సాన్నిహిత్యం వున్న వారందరూ ఎంత త్వరలో తమకు ఇష్టమైన ఆయా అంశాలను ఎంచుకొని వ్రాస్తే అంత త్వరలో ఆ సంచిక వెలువడుతుంది. సృజన ఆసుగా ఎంచుకుని కోరుతున్న రచయితలూ వున్నారు. తాముగా రాయదల్చుకున్న వాళ్ళు కూడా ఆగస్టు 15 లోగా తమరచనలు పంపించవలసిందిగా కోరుతున్నాం.

— సాహితీమిత్రులు

కవులు జెండాలైనవేళ

లక్నారెడ్డి

మొన్న—
అంకుశాపురంలో పుట్టి
పోరాటపు అలుచిప్పల్లో పెరిగి

నిన్న—
మా తరం శిరస్సుమీద ఊరేగిన కవికిరీటం
శ్మశానంలో దగ్ధమైనపుడు
మా మౌనం తారాస్థాయిలో బ్రద్దలైంది
మేమెప్పుడూ ఏడ్వలేదు-
ప్లేటు తీసుక పోయినపుడూ
కలం విరుచుక పోయినపుడూ
గళం మలుచుక పోయినప్పుడూ
ఎప్పుడూ ఏడ్వలేదు—
మా నెత్తురు మానుంచి దూరమవుతున్నపుడే
ఏడ్చాం—
కత్తి విరిగిపోయినపుడూ
కత్తి అరిగిపోయినపుడూ ఏడ్వలేదు.
కత్తి కనపడకుండా కరిగిపోతున్నపుడే
ఏడ్చాం-
భావాలు శరీరాలై
యువకులు నినాదాలై
కవులు జెండాలై
వ్యవసాయిక విప్లవరోడ్డుమీద
కుటుంబం కుటుంబమంతా కదిలొస్తున్న వేళ

విప్లవ మాత సర్వాంగాలు ఐక్యంగా పనిచేస్తున్న ఈవేళ
ఏడ్వడం మానేయాలి-
ప్రళయ ప్రభంజనాలు సృష్టించడానికి
గుండె గుప్పిట్లో దుఃఖాన్ని బిగపట్టి
మహాజన సముద్రంలోకి కన్నీళ్ళు పంపించాలి—
కామ్రేడ్స్!
విప్లవ కుటుంబ సభ్యులారా!!
అంతిమ యాత్రతోనే ఆగిపోవొద్దు
దీర్ఘ యాత్రలో తొలగి పోవొద్దు
కాళ్ళూ, చేతులూ దాచుకొని
పత్రికల్లోనే మాట్లాడు కోవొద్దు
ప్లాస్టిక్ అతుకుల్ని పెట్టుకోవొద్దు
మన సంబంధం రక్త సంబంధం
మన సంబంధం కష్ట సంబంధం
మన సంబంధం కన్నీళ్ళ సంబంధం
శత్రు పరదాలమధ్య-
మనం దాగుడు మూతలాడు కోవొద్దు—
దారీ, లక్ష్యం రెండూ ఒకటే
ముందు వెనుకలు చూస్తూ
మనకు మనమే బోర్లా పడిపోవొద్దు—
చెర అంతిమయాత్ర
శత్రువు శవయాత్రయ్యే వరకూ
దీర్ఘ యాత్రలో కలిసే నడుద్దాం
దీర్ఘ యాత్రలో కలిసే నడుద్దాం—

(చెరబండరాజు కోసం)

వీర తెలంగాణ వారసత్వం

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రారంభమయి ఈ జులై 4కు 36 ఏండ్లు నిండుతాయి. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో రైతాంగం ఈ నిర్ణయం తీసుకోవడానికి అనివార్యం చేసింది దొడ్డి కొమురయ్య మరణం.

అంతకు పూర్వమే 1939-40 ప్రాంతం నుంచి ఆంధ్ర మహాసభలోని కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో గ్రామీణ ప్రజల మౌలిక సమస్యలపై పోరాటాలు వెల్లువికాయి. రెండు సామ్రాజ్య వాదాల కూటముల మధ్య యుద్ధంగా ప్రారంభమయిన రెండవ ప్రపంచ యుద్ధం సోషలిస్టు రష్యా ప్రవేశంతో ఫాసిస్టు వ్యతిరేక ప్రజాయుద్ధ స్వభావాన్ని చరిత్రగతిలో సంతరించుకున్నది. స్పెయిన్ అంతర్యుద్ధం మొదలుకొని రెండవ ప్రపంచ యుద్ధకాలమంతా ప్రపంచ వ్యాప్తంగా యుద్ధం ప్రజల్లో ఫాసిస్టు వ్యతిరేకతనూ ప్రజాస్వామ్య విజయాకాంక్షనూ ప్రపంచ శాంతి కామననూ రేకెత్తించింది. భారతదేశంలో క్విట్ ఇండియా ఉద్యమంలోగానీ నావికా తిరుగుబాటులో గానీ బట్టల మిల్లుల కార్మిక సమ్మెలలోగానీ రగుల్కొన్న చైతన్యం ఈ ప్రజాస్వామిక ఆకాంక్షనుండి వచ్చిందే.

1920 ప్రాంతాల్లో ఒక సాంఘిక సాంస్కృతిక సంస్కరణోద్యమంగా ప్రారంభమయిన ఆంధ్ర మహాసభ నాలుగో దశాబ్దం నాటికి నైజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా మాత్రమే కాకుండా ఆ ఫ్యూడల్ నిరంకుశత్వానికి వేర్లయిన జమీందారీ, జాగీర్దారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడే రాజకీయ చైతన్యాన్ని ఈ ప్రపంచ పరిణామాల ప్రభావంలోనే జీర్ణించుకున్నది. 1930 ప్రాంతాల్లోనే తన భూమిమీద హక్కును కాపాడు కోవడానికి విస్నూరు దేశముఖుతో అతని గూండాలతో పోరాడి బందగీ అమరుడయ్యాడు. బందగీ చిందిన రక్తం నేలతల్లి ఒడిలో దున్నేవానికే భూమి నినాదాన్ని అస్పష్టంగా విత్తిపోయింది. ఆంధ్ర మహాసభలో కమ్యూనిస్టు పార్టీ ప్రాబల్యం ఎట్లా పెరుగుతుంటే అది సంఘంగా గ్రామాల్లో ఎట్లా విస్తరిస్తూ వుంటే అట్లా బందగీ భూమికి సంకేతమయిపోయాడు. 1944 భువనగిరి సభలో ఆంధ్ర మహాసభ ప్రజా రాజకీయాల వేదికగా రూపొంది రెండవ ప్రపంచ యుద్ధంలో సోషలిస్టు శక్తుల విజయాన్ని మననేలలో ప్రతిఫలించింది.

వెట్టి చాకిరికి జమీందారీ, జాగీర్దారీ విధానానికి వ్యతిరేకంగా నిద్రాణమైన స్థితి నుండి మేల్కొని దానిపై తిరుగుబాటు ప్రారంభం కావడంతో దేశముఖ్‌లు, భూస్వాములు బెదిరిపోయారు. రైతాంగంపై తీవ్రమైన అణచివేతను అమలుచేశారు. పోలీసుల రజాకార్ల సహాయం తెచ్చుకున్నారు. రైతాంగాన్ని చీల్చేవాళ్ళ ప్రయత్నాలేవీ ఫలించకపోగా పెత్తందార్లు మాత్రం ఏకాకులయ్యారు. కౌలుదార్లు తమ భూములను స్వాధీనం చేసుకుంటారనే భయంతో భూములనుండి కౌలుదార్లను బేదఖల్ చేయించే పనులకెగబడ్డారు.

జనగామ తాలూకా మొండ్రాయి గ్రామంలో కౌలుదార్లయిన 80 రైతు కుటుంబాలను భూమినుంచి బేదఖల్ చేస్తే వాళ్ళు నిరాశ్రయులై పోయారు. భూమి తిరిగి తమకే కౌలుకివ్వాలని హక్కుకై పోరాడినా విజయం సాధించలేకపోయారు. ఈ అనుభవంతో కౌలుదార్లకు భూమిని దక్కించాలని కార్యక్రమం తీసుకొని కమ్యూనిస్టు పార్టీ వాలంటీర్లను తయారుచేసింది. పాలకుర్తి గ్రామంలో కౌలుదార్లయిన రైతుల భూముల్ని, పంటల్ని స్వాధీనం చేసుకోవడానికి కుట్రచేశారు. గ్రామంలో ఉన్న పురుషుల నందర్ని అరెస్ట్ చేశారు. సంఘం అక్కడ సభ పెడితే సభను భగ్నం చేయడానికి ముసుగు వీరుల్ని పంపారు. కమ్యూనిస్టుపార్టీ వాలంటీర్లు వాళ్ళను పసిగట్టి దేహశుద్ధి చేశారు. చాకలి ఐలమ్మ భర్తనూ, కొడుకునూ అరెస్ట్‌చేసి ఆమె పొలంలో పంటను కాజేయడానికి దేశముఖ్ పథకం వేశాడు. దొడ్డికొమురయ్య వంటి సంఘం వాలంటీర్లు తాము నిలబడి ఐలమ్మ మొదలయిన రైతాంగం పంటను వాళ్ళ ఇంటికిచేర్చారు.

ఈ నేపథ్యంలో దేశముఖ్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కౌలుదారీ రైతుల హక్కుల పరిరక్షణ కోసం వ్యవసాయ కూలీలు సమ్మె చేస్తున్నప్పుడు విసునూరు దేశముఖ్ ఏజంట్ మిస్కిన్ దొడ్డికొమురయ్యను కాల్చి చంపాడు. అది జులై 4, 1946. చికాగో నగరంలో చిందిన కార్మిక రక్తంలో తడిసిన చొక్కా ఎర్రజెండాలా ఎగిరినట్లు దొడ్డికొమురయ్య చిందించిన రక్తంలో తడిసిన పంచెముంచి తెలంగాణ రైతాంగం సాయుధ పోరాట జండాను ఎగురవేసింది.

బందగీ, మొండ్రాయి రైతాంగం. పాలకుర్తి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య ఏ ఆశయం కొరకు పోరాడారో అది ఇంకా నెరవేరలేదు. మొండ్రాయి రైతాంగం ఏ భూమి కోసం పోరాడాల్సి వచ్చిందో 1967లో శ్రీకాకుళంలోని మొండెంఖల్లులో కూడా రైతాంగం ఆ భూమికోసమే తిరిగి సాయుధం కావాల్సి వచ్చింది. దొడ్డికొమురయ్య ఏ ఆశయం కోసం అస్వతంత్ర భారతంలో ప్రాణాలు బలిపెట్టాడో ఆ ఆశయం కోసమే "స్వతంత్ర" భారతంలో కోరన్న,మంగన్నలు, పోట్టి లక్ష్మీరాజ్యాలు ప్రాణాలు బలిపెట్టాల్సి వచ్చింది. ఏ ఆశయంకోసం తెలంగాణా రైతాంగం నైజాం నిరంకుశపాలనలో సాయుధం కావాల్సి వచ్చిందో ఆ ఆశయంకోసమే నక్సల్బరీ, శ్రీకాకుళం కరీంనగర్ రైతాంగం ఇందిరా "ప్రజాసామ్య" పాలనలో సాయుధం కావాల్సి వచ్చింది.

ఆ ఆశయం దున్నేవారికే భూమి. ఆ ఆశయం వ్యవసాయ విప్లవం ఇరుసుగా గల నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కాకుండా నెరవేరేదికాదు. ప్రజాస్వామిక విప్లవం రైతాంగం సమీకరింపబడి సంఘటితమై, చైతన్యవంతమయి సాయుధంగా ప్రజాయుద్ధ పంథాలో విప్లవిస్తే తప్ప సాధ్యమయ్యేదికాదు. దీనికి సులభోపాయాలు, అడ్డదార్లులేవు. ఇది సూరేళ్ళపంట, దీర్ఘకాలికపోరాటం. అందుకే ఐదేళ్ళకే

అలసిపోయి కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం సాయుధ పోరాటాన్ని విరమింపజేసిన నష్టం నుంచి నిద్రమంచి తేరుకోవడానికి పదహారు సంవత్సరాలు పట్టింది. ఆ నష్టాన్ని పూడ్చుకోవడానికి ఎన్నేళ్ళు పడ్తుందో చరిత్రతీర్పు చెప్పాలి. జాతీయ విముక్తి పోరాటాలు కార్మికవర్గ నాయకత్వంలో దీర్ఘకాలికంగా సాగినపుడు అవి నూతన ప్రజాస్వామిక విప్లవ ఫలితాలనిస్తాయనేది మనకు చైనా అనుభవంలో స్పష్టమవుతున్నది. తెలుగుజాతి ఫ్యూడల్, వలస బానిస సంకెళ్ళను తెంచుకొని ఏకం కావడానికి చేసిన పోరాటం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక పోరాటంగా విప్లవ భూసంస్కరణలు వంటి మౌలిక సమస్యలు చేపట్టి కూడా నాయకత్వ విద్రోహం వల్ల అసంపూర్తిగానే మిగిలిపోయింది. చైనా మార్గమే మన మార్గమని స్థూల సారూప్యాన్ని అనాడే గ్రహించి నప్పటికీ వ్యవసాయిక దేశాల విప్లవానికి మావో ఆలోచన కరదీపిక అనే అంశం ఆనాటి కింకా స్పష్టాస్పష్టంగా ఉన్నప్పటికీ చైనా అనుభవంనుంచి శత్రువు నేర్చుకున్నంతగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం నేర్చుకోలేదు. అందుకే నైజాంతో రక్షణ, విదేశాంగ విధానం వంటి ఒకటి రెండు అంశాలు తమకు వదిలితే నైజాంకు స్వతంత్ర ప్రతిపత్తి కూడా ఇస్తామని బేరమాడిన నెహ్రూ, పటేల్ లు సెప్టెంబరు 13, 1948న మెరుపుదాడిలో పోలీసు చర్య పేరుతో యూనియన్ సైన్యాలను ప్రవేశపెట్టి విమోచన సాధించిన హీరోలయ్యారు. తిరిగి 1971లో బంగ్లాదేశ్ యుద్ధంలో "ముక్తి ఫవుజ్"తో ప్రవేశించి ఇందిరాగాంధీ కూడా జాతీయ విముక్తి పోరాటం తుదకంటాసాగి నూతన ప్రజాస్వామిక విప్లవ విజయాలు సాధించకుండా చేసే జాగ్రత్త తీసుకొని నాటి నెహ్రూ వలెనే నేడు తన సామ్రాజ్యవాద విధేయతను ప్రకటించుకున్నది.

చరిత్రలో ఎన్ని అంశాలు ఎన్ని ఘట్టాలు ప్రజల అనుభవంలో ఎంత సాదృశ్యంగా పునరావృత మవుతాయో ఇవాళ అదే భూమి కొరకు అనాడు కొమురయ్య తెంచలేక మరణించిన నేలతల్లి సంకెళ్ళను ఛేదించడానికి పోరాడుతున్న విప్లవకారులు తమ గాయాలనూ, విజయాలనూ నెమరేసు కుంటున్నారు. రివిజనిస్టులూ నెమరేసుకుంటున్నారు. కానీ అది పశువు వేసే నెమరులాంటిది. విప్లవకారులు చరిత్రను ఒక జ్ఞాపకంగా ఒక అనుభవంగా మాత్రమేకాక ఒక ఆచరణగా ఒక గుణపాఠంగా నెమరేసుకుంటారు.

బైరాన్‌పల్లిలో 1948 ఆగస్టు 27న అంటే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నైజాం రాష్ట్రంలో పోలీసు చర్య జరపడానికి కేవలం రెండువారాల ముందు అప్పటికే నాల్గుసార్లు ప్రజల చేతుల్లో ఓడిపోయి కాలికి బుద్ధి చెప్పిన రజాకార్లు మిల్ట్రీ

సహాయంతో దాడిచేశారు. కమ్యూనిస్టు పార్టీ గెరిల్లా దళాల నిర్మాణం చేసి ధర్మాపురం మొదలయిన గ్రామాల్లో వీరోచితమైన పోరాటాలు చేపట్టిన దశ అది. బైరాన్ పల్లిలో మిల్ట్రీని ఎదిరించి రెండు మూడు రోజులు ప్రజలు సంకుల సమరం చేశారు. రజాకార్లు పోలీసు మిల్ట్రీ బలగాల్లో కూడా కొందరు హతులయ్యారు. 88 మంది ప్రజలు మరణించారు. ఇంత చరిత్రాత్మక పోరాటాన్నీ, త్యాగాన్నీ, సంస్మరించుకొనే ప్రయత్నమైనా ఈ ముప్పై నాలుగేళ్ళుగా ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీగానీ, సిపిఐ, సిపిఎంలు కానీ చేయలేదు. అంటే పోరాట విరమణ తర్వాత పార్టీ ఆ గ్రామంలో ఓట్ల కొరకు తప్ప ఎన్నడూ ప్రవేశించలేదనే అర్థం.

ఇవ్వాళ తిరిగి 'గ్రామాలకు తరలండి' కాంపెయిన్ తీసుకొని 'దున్నే వానికి భూమి' నినాదంతో వ్యవసాయ విప్లవాన్ని ప్రచారం చేస్తూ రాడికల్స్, రైతుకూలీ సంఘం గ్రామాల్లో ప్రవేశించినపుడుగానీ కడివెండి, బైరాన్‌పల్లి గ్రామాలు మళ్ళా మేల్కొనలేదు. మేల్కొని తమ గాయాలను, విజయాలను 'మధుర విషాద గీతాలు'గా మాత్రమే కాదు మళ్ళీ పోరాట ప్రేరణలుగా ఆలపించలేదు. బైరాన్‌పల్లి రైతాంగం రాడికల్స్ చొరవతో తన వీరులకు స్మృతి చిహ్నాన్ని నిలుపుకున్నది. కడివెండి దొడ్డి కొమురయ్య చిందిన రక్తం ప్రారంభించిన దొడ్డ పోరాటాన్ని వీరోచితంగా సంస్మరించు కుంటున్నది.

కరీంనగర్‌లో రగిలిన నక్సల్బరీ ఆదిలాబాదు, వరంగల్, ఖమ్మం జిల్లాలకు విస్తరించి తెలంగాణ రైతాంగం మళ్ళీ ఒకసారి నాగేటి చాళ్ళలో కర్రులకు పదను పెడుతున్న వేళ, నాగళ్ళ వెంట సాగుతూ కొడవళ్ళకు కక్కు కొడుతున్న వేళ, దొడ్డి కొమురయ్య సంస్మరణ ఒక వేడుక కాదు, ఒక వ్యాస రచన కాదు ఒక ఆచరణ, ఒక గుణపాఠం.

దొడ్డి కొమురయ్య చిందించిన రక్తంలో తెలంగాణ రైతాంగం సాయుధ చైతన్యాన్ని పొందింది. కోరన్న మంగన్న చిందించిన రక్తంలో శ్రీకాకుళ రైతాంగం సాయుధ సత్యాన్ని ఆవిష్కరించింది. ఆ ప్రేరణతో జులై 4, 1970న విప్లవ రచయితల సంఘం అవతరించింది. కొడవళ్ళకు కక్కు కొట్టిన వేళ, కర్రులు పదను పెట్టిన వేళ, నాగేటి చాళ్ళలో విప్లవం రగిలిన వేళ కలాలకు పదను పెట్టిన సాంస్కృతిక సైనికులుగా నూతన ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలను నిర్వహించే బాధ్యతను భుజాన వేసుకున్నది. విరసం ఇతర విప్లవ రచయితలు దొడ్డి కొమురయ్య అమరత్వాన్ని గానంగాచేసే విప్లవ సాంస్కృతిక సంప్రదాయానికి అర్హమైన వారసత్వాన్ని స్వీకరించాలి

25 జూన్ 82 — సంపాదకుడు

సందేశం

విమల

కామ్రేడ్,
నువ్వు అవతలి
బ్యారక్ నుండి పంపిన
'రొట్టెముక్క'
ఇప్పుడే అందింది.
దాన్ని తిని మెదడు
జీర్ణించుకుంటుంది.
చీకటిపడింది-
నువ్వు నా జవాబు కోసం
కాచుకునుంటావని తెల్సు
అంచెలంచెలుగా
ఈ ఉత్తరం నిన్ను చేరేలోగా
"కళ్ళు తెరిచే"
ఉంటావో లేదో తెలీదు.
ఇక్కడ ఇప్పుడంతా నిశ్శబ్దంగా వుంది
గోడ పలుగులో దాచుకున్న
పెన్సిల్‌ముక్క, నలిగిపోయిన కాగితం_
నా తలలో ఎగిసిపడే భావతరంగాలు
నా సెల్లో కొంచెం వెలుగు....
ఆలోచనల్ని బద్దలు కొడుతూ సెంట్రీ
ఇనప బూట్ల చప్పుడు
అయినా
సందేశం అందించాలనే
నా ప్రయత్నం

o o o

నీకు గుర్తుందా!
నువ్వూ_నేనూ
చీకటి వ్యానులో
పోలీసుల కత్తుల

కావలా మధ్య
క్రితంసారి జైలుకొచ్చినవేళ
వాళ్ళ టార్చర్ తరువాత
లాఠీతో నీ తలపైకెత్తి
టార్చి కళ్ళలోకి వేసి
చీఫ్ అడిగాడు.
"ఇంకా ఏమన్నా కావాలా" అంటూ
నువ్వన్నావ్
"కాగితం, కలం" అని -
"వేళ్ళు చితక్కొట్టండి
అక్షరాలాగి పోతాయ్"
అని వాడెళ్ళిపోయాడు.

o o o

నేను అదే మొదటిసారి
జైలుకు రావడం
ఈ నాలుగురోజుల
'ట్రీట్ మెంట్'
తరువాత
నారక్తం చల్లబడి
భయం.... భయం
దిగులు
గాయాల సలుపు....
ఇంకా కళ్ళన్నా తెరవని
నా పిల్లలు
నన్ను ప్రేమించే భార్య
నా చక్కటి చిన్న ఇల్లు
అయ్యో! నేనింక
రాయనుగాక రాయను!
మెదడు మూలల్లో

ఇరుక్కున్న అక్షరాల్ని
విదిలించేసుకుంటాను.
బాబ్బాబు
నన్నొదిలేయండి!
నేనింక రాయనుగాక రాయను.

దుఃఖాన్ని కప్పుకుని
నా నీడలో నేనే
ముడుచుకుని
గుండె గాలంలో
చిక్కడి నట్లు
ఓ మూల వొదిగి కూర్చున్న
సమయాన—
వాళ్ళు ఓ నెత్తుటి ముద్దని
"దబ్" మని క్రింద
ఎత్తేసి వెళ్ళారు.
భయంతో నా కళ్ళు
వెడల్పయ్యాయి.
కొంచెం కదిలి....
నువ్వు—
నువ్వు మెల్లిగా
తలెత్తి చూసి
అతి కష్టం మీద
నా దగ్గరికి ప్రాకావు.
చితికిన వేళ్ళనుంచి
కారుతున్న రక్తంతో
జైలు గోడపై
మన ఆలోచనల బలాన్ని
అక్షరాల ఆకృతుల్ని
బిగియించిన పిడికిట్లో
చిత్రించావ్!

o o o

జైలు గోడ
చల్లగా తాకుతోంది.
చీకటిగోపురంపై నిలబడి
మేడలకి జోలపాట లాంటి
సెంట్రీ "సబ్ ఠీక్ హై"
అరుపు—
ఒంటరిగా
ఒంటినిండా దెబ్బలతో
నేను పడి వున్నాను.
'మెలుకువగా!'
మేలుకునే వున్నాను
నేను దుఃఖించటం లేదు
భయపడటం లేదు
దిగులసలే లేదు
నారక్తం వేడెక్కింది
కామ్రేడ్—
నేను మెలకువగానే వున్నా!
ఆ రోజు
నా కన్నీళ్ళు తుడిచి
జూలియస్ ఫ్యూజిక్
కథ చెప్పావ్.
పాల్ రాబ్సన్ లా
పాటాలన్నావు.
పాణిగ్రాహినీ
పరిటాలనీ
గుర్తుచేసావ్.

అన్నా!
నువ్వు రాయకుండా
వేళ్ళు విరగ్గొట్టారు.

పాడకుండా చేయాలని
గొంతు మీద ఇనపబూట్లతో
తొక్కారు.
ఆ రోజు సరిగ్గా
ఇలాంటి చలిరాత్రే
మనిద్దరం గడిపాం!
ఇవ్వాళ్టి చీకటి రాత్రి
నే నొంటరిగా
ఈ సెల్లో బందీగా వున్నా!
అయినా,
జైల్లో
ఏ గది గోడ మీదో
నువ్వు చిత్రించిన
సంకల్పం స్పర్శ
వెచ్చగా తాకుతోంది.
శత్రువుపై పోరాటంలో
భర్త మరణించాడని విని
కన్నీటిని కళ్ళలోనే ఆపేసి
అమరవీరుల గాథల్ని
పాడుతున్న
పాలస్తీనా యువతి గానం
అలలుగా వీస్తోంది.
ఆ నిశ్శబ్దపు రాత్రి
బొంగురు పడ్డ గొంతుతో
చెబుతున్నప్పుడు
నీ కంఠం మీద
ఇనప నాడా చేసిన
గాయం కదలిక
కళ్ళ ముందు కదలాడుతూ

సన్నుద్రిక్తుడ్ని చేస్తోంది.
ఈ వొణికించే చలిలో
దుఃఖాన్ని కప్పుకుని
లేను లేను.
ఆ రోజు నీకు—
కాదు నా ప్రజలకి
వాగ్దానం చేసినట్లే....
నా వేళ్ళు చితక్కొట్టినా
నా కంఠం నులిమేసినా
'స్పృహ' వున్నంత వరకూ
నన్నెవ్వరూ ఆపలేరు!
నేను నా వీలునామా
రాస్తున్నాను.
సెల్ గోడ పై
వెచ్చటి నెత్తుటితో
బిగి పిడికిలి
చిత్రిస్తున్నాను.
"భావాల్ని బంధించలేరనీ
కలాలకు సంకెళ్ళు లేవనీ"
మళ్ళి, మళ్ళీ
చాటుతూ
పాణిగ్రాహి
వారసత్వాన్ని
అందిస్తున్నాను.

గమనిక

రచనలు వ్యక్తులపేర గాకుండా 'ఎడిటర్'కు గానీ, 'సాహితీ మిత్రుల'కు గానీ పంపించాలి. ఎవరి సిఫారసులూ అక్కరలేదు. రచన దానంతటదిగానే ప్రచురణార్హత శక్తి కలిగిందయితే ఎన్నికవుతుంది. 'సాహితీ మిత్రులు' చర్చించి తిరిగి సమాధానం రాస్తారు. జవాబుకోరేవారు తగిన పోస్టేజీ పెట్టడం అవసరం. — సాహితీమిత్రులు

రిపోర్ట్ :

విరసం తొమ్మిదవ మహాసభలు

సంఘటిత పోరాటాల 'వెల్లువ' అని పిలవదగ్గది దేశంలో లేకున్నా, అన్ని ప్రాంతాల ప్రజలూ 'చట్టబద్ధ' పద్ధతులకు స్వస్తి చెప్పి మంచివో చెడ్డవో తమకున్న కోర్కెల సాధన కోసం వీధిలోకి వచ్చి ఎంతటి సాయుధ రాజ్యశక్తి నయినా ఎదుర్కోవడానికి సిద్ధంగా వున్న తరుణంలో విరసం తన 9వ సభను మాచెర్ల పట్టణంలో జూన్ 4, 5, 6 తేదీలలో జరుపుకుంది. విరసం సభ్యులే కాకుండ జన నాట్యమండలి, అరుణోదయ వంటి సాంస్కృతిక సంస్థల నుండి, ఆర్. వై. ఎల్ నుండి, ఆర్.ఎస్.యు, పి.డి.ఎస్. యు ల నుండి, మొత్తం 250 మంది ప్రతినిధులు, సౌహార్ద ప్రతినిధులు, హాజరయ్యారు. బయటి రాష్ట్రాల నుండి వచ్చినవారు, విరసంకు పాత మిత్రుడయిన బెంగాలీ విప్లవ రచయిత దేవవ్రతపాండ, బెనారస్ వదిలి ఇప్పుడు ఢిల్లీలో వుంటున్న హిందీ రచయిత కంచన్‌కుమార్, బెంగాలీ విప్లవ గాయకుడు విద్యుత్ భౌమిక్, తమిళనాడులో విప్లవ రచనా కార్య క్రమాన్నే కాక పౌరహక్కుల ఉద్యమాన్ని గూడ దాదాపు తన ఒక్కడి భుజాల మీదే మోస్తున్న మనోహరన్, మూడవ దినం జరిగిన బహిరంగ సభ సమయానికి కేరళకు చెందిన జనకీయ సాంస్కారిక వేది సభ్యుడు శేఖర్ వచ్చారు.మన రాష్ట్రం నుండి ఓ. పి. డి. ఆర్. తరపున బలయ్య వచ్చారు. పల్నాటి నాపరాళ్ళ వేడికి భయపడ్డారో లేక అది తెలంగాణా కాకపోవడం వల్లనో పోలీసులు మాత్రం ఉండ వలసిన సంఖ్యలో లేరు.

4 వ తారీకు ఉదయం సౌహార్ద ప్రతినిధులు తమ సందేశాలు ఇచ్చారు. ఇతర రాష్ట్రాలలో విప్లవ సాహిత్య ఉద్యమానికి అక్కడి భౌతిక పరిస్థితులే కారణ మయినా, విరసం ఉత్తేజాన్ని ఇచ్చిన మాట వాస్తవం. ఆ విషయం మరొకసారి విరసం సభ్యులకు బయటి రాష్ట్రాల నుండి వచ్చిన సౌహార్ద ప్రతినిధులు గుర్తు చేశారు. ఇవ్వాళ వివిధ ప్రాంతాల విప్లవ రచయితల మధ్య వున్న సౌహార్ద సంబంధా లకు సంస్థారూపం ఇవ్వడం కోసం ఒక అఖిల భారత స్థాయిలోని విప్లవ రచయితల సమాఖ్యను ఏర్పరచాలనీ, ఆ సమాఖ్య తీరుతెన్నులు నిర్ణయించడంలోను, దాన్ని ఏర్పరచడంలోను, విరసం ముందుండాలనీ గూడ వాళ్ళు అన్నారు. వాళ్ళ మాటలు విరసం సభ్యులకు ఎంత ఆనందం కలిగించి వుంటాయో అంతభయంగూడ కలిగించి వుండాలి. శత్రువుతో పోరాడడంలోను, మిత్రులతో ఐక్యంగా నిలవడంలోను, ఇతరు లకు మార్గదర్శకులుగా వుండడం బరువయిన బాధ్యత. ఆ బాధ్యతను విజయవంతంగా

నిర్వహించడం కోసం విరసం తన గతితార్కిక దృష్టిని పదును పెట్టుకుని, శత్రు వైరుధ్యాల నుండి మిత్ర వైరుధ్యాలను వేరుచేసి, తెలుగుదేశంలోనూ, బయటావున్న విప్లవ రచయితలనందరినీ ఒకే సంస్థలోకి కాకున్నా ఒకే సమాఖ్య క్రిందికి తేగలుగుతుందని ఆశిద్దాం.

సౌహార్ద ప్రతినిధుల సందేశాల అనంతరం పుస్తక ఆవిష్కరణ జరిగింది. హైదరాబాద్ విరసం యూనిట్ చెరబండరాజు పై ప్రచురించిన 'మృత్యుశిఖరం మీద యుద్ధ ఫిరంగి' కవితా సంకలనాన్ని చలసాని ప్రసాద్, పీపుల్స్‌బుక్స్, విజయవాడవాళ్ళు ప్రచురించిన చెరబండరాజు కవితలు, పాటలు సంపుటిని కాశీపతి, ఢిల్లీ జవహర్‌లాల్‌నెహ్రూ విశ్వవిద్యాలయం ప్రగతి సాహితివారు టంకశాల అశోక్ సంపాదకత్వాన కొడవటిగంటి కుటుంబరావుపై ప్రచురించిన వ్యాస సంకలనాన్ని ('భావ విప్లవకారుడు కొడవటిగంటి కుటుంబరావు') హెచ్చార్కె, కరీంనగర్ బుక్ ట్రస్ట్ ప్రచురించిన అల్లం రాజయ్య 'భూమి' కథా సంకలనాన్ని కె. వి. ఆర్, బి. ఎస్. రాములు నవల 'బ్రతుకుపోరు'ను బాలగోపాల్ ఆవిష్కరించారు. విద్యుత్ భౌమిక్ హిందీలోను బెంగాలీలోను పాటలు పాడాడు. చెరబండరాజు హాజరుకాని మొదటి విరసం మహాసభలో ఆ లోటును మరిపింపజేస్తూ భౌమిక్ చెరబండరాజు కొలిమంటుకున్నాది పాటనే పాడాడు.

ఆనాటి మధ్యాహ్నం పల్నాటి పోరాటాలపై, అందులో ముఖ్యంగా కన్నెగంటి హనుమంతు పుల్లరిపోరాటం, చీరాల, పేరాల సత్యాగ్రహం, పెదసందిపాడు రైతుల పోరాటంపై సిరా ప్రసంగించాడు. రైతువారీ ప్రాంతమయిన పల్నాడులో రైతుకు ప్రత్యక్ష శత్రువు సామ్రాజ్యవాద ప్రభుత్వమే. ఆ ప్రభుత్వం తన రెవిన్యూ అవసరాలకోసం పన్నులు పెంచినా, లేక పల్నాటి వంటి 'రసికుడు పోవని' బండరాళ్ల ప్రాంతంలో రెండేళ్ళకొకసారి పంటలు పండక పోయినప్పటికీ పన్నుల వాయిదాను ఒప్పుకోకపోయినా, పంట పండలేదంటే శ్వేతజాతి దురహంకారంతో ఈ నల్లవాళ్ళు అబద్ధాలకోరులని వాళ్ళ విన్నపాన్ని తోసిపుచ్చినా, రైతులకు తిరగబడక తప్పదు. అటువంటి ఒక తిరుగుబాటుకు నాయకత్వం వహించి పోలీసుల కాల్పులకు గురయి మరణించాడు, కన్నెగంటి హనుమంతు. ఆ పోరాటం ఎంత విస్తృతమయినదో మనకు తెలీదు. చేత తుపాకీ పడితేనేతప్ప అది పోరాటం కాదని నమ్మేవాళ్ళను వేధించడానికి, కన్నెగంటి హనుమంతు చేత తుపాకీ పట్టాడో లేదో మనకు తెలీదు. అయితే సభకు అధ్యక్షత వహించిన కె. వి. ఆర్ అన్నట్టు అంతకంటె ముఖ్య

మయిన విషయం, ఆ పోరాటాన్ని దేశవ్యాప్తంగా జరుగుతూ వస్తూన్న రైతాంగ పోరాటాల్లో భాగంగా చూడడం. అట్లా చూసినప్పుడు వచ్చే ఒక ప్రశ్న గూడ చర్చకు వచ్చింది. సిరా ప్రసంగంలో, హనుమంతు బ్రిటిష్ వారితో రాజీకి వచ్చినట్టు, పోలీసులను తొలగిస్తే తాము పుల్లరిపై పన్నును అంగీకరిస్తామన్నట్టు, చెప్పడం జరిగింది. దీన్నిబట్టి ఆ పోరాటం సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం కాదేమో, కన్నెగంటి హనుమంతు బ్రిటిష్ సామ్రాజ్యవాదపు ఏజెంటేమో, అన్న ప్రశ్నలు కొందరులేవదీసారు. దీనికి సమాధానంగా, హనుమంతు చనిపోయిన తరువాత ఆప్రాంతానికి వెళ్ళిన ఉన్నవ లక్ష్మీనారాయణ వంటి కాంగ్రెస్ నాయకులకు కనబడ్డ తీవ్రమయిన బ్రిటిష్ వ్యతిరేకతను కె. వి. ఆర్ సోదాహరణంగా వివరించారు. పోరాటంలో తాత్కాలిక రాజీలు తప్పవనీ, తప్పుకాదనీ గుర్తుంచుకుంటే ఆనాటి పల్నాటిపోరాటాన్ని మౌలికంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంగా నిర్మాణించడం తప్పుకాదని తేలింది.

ఆ సాయంత్రం జరిగిన బహిరంగ సభలో త్రిపురనేని మధుసూదనరావు, కాశీపతి, ఆహ్వాన సంఘ కార్యదర్శి, విరసం సభ్యుడు చంద్రశేఖర్, విరసం గురించి ప్రజలకు వివరించారు. గద్దర్ నిర్వహణలో జననాట్యమండలి, అరుణోదయ, విరసం సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.

5వ తారీకున మూడు సెషన్లు జరిగాయి. మొదటిదీ, అతి దీర్ఘమయిన చర్చకు దారితీసినదీ, 'మౌఖిక సాహిత్యం' పై వరవరరావు ప్రసంగం. సాహిత్యం మొదట్లో మౌఖికం. మౌఖిక సాహిత్యపు సహజరూపం పాట. ఆదిమ సమాజంలో శ్రమకు అనుబంధంగా పుట్టిన పాట, సామూహికంగా సాగే శ్రమ తాలూకు లయను తనలో లీనం చేసుకుంది. లిఖిత సాహిత్యం వర్గ సమాజంలో పుట్టింది. అయితే వర్గ సమాజంలో గూడ, బలమయిన సాంఘిక ఉద్యమాలు వచ్చినప్పుడు, ఆ ఉద్యమాలకు శ్రామికజనాన్ని తమ వయిపు తిప్పుకునే అవసరం ఏర్పడ్డప్పుడు, అవి సాహిత్యపరంగా, లిఖిత సాహిత్యాన్ని సైద్ధాంతికంగా వ్యతిరేకించకున్నా, లిఖిత సాహిత్యపు కృత్రిమత్వాన్ని కొంతవరకు వ్యతిరేకించి, ప్రచారార్థం మౌఖికానికి సన్నిహితమయిన సాహిత్యాన్ని ఆశ్రయించాయి. ఇందుకు శైవ ఉద్యమకవి అయిన పాల్కురికి సోమనాథుడ్ని వరవరరావు ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. మధ్యయుగాల నాటి భక్తి ఉద్యమాల్లోను సంఘ సంస్కరణ ఉద్యమాల్లోను, సర్వత్రా ఈ లక్షణం కనిపిస్తుంది.

తులసీ రామాయణమయినా, సిక్కుల పవిత్ర గ్రంథమయిన 'గ్రంథ్ సాహిబ్' అయినా చదివించుకుని వినవలసినవేగాని ఒంటరిగా కూర్చుని చదువుకునేవి కావు. ఆధునిక కాలంలోనయితే విప్లవ సాహిత్యం సైద్ధాంతికంగానే లిఖిత సాహిత్యపు పరిమిత ప్రయోజనాన్ని గుర్తించి ప్రజల్ని కదిలించడానికి పాటను చేపట్టింది.

అయితే పాలకవర్గాలు మౌఖిక సాహిత్యాన్ని ఒక ప్రక్క అల్పమని ప్రచారం చేస్తూనే (ఉదాహరణకు, అధ్యక్షుడు చలసాని ప్రసాద్ అన్నట్టు, పాట కవిత్వం కాదనే వాదన), వేరొక ప్రక్క దాన్ని స్వంతం చేసుకునే ప్రయత్నం చేస్తారనీ, ఈ క్రమంలో విప్లవ మౌఖిక సాహిత్యాన్నేకాక, విప్లవ సాహిత్యకారులను గూడ వ్యాపారానికీ రాజ్య సంరక్షణకూ వాడుకోజూస్తారనీ, ఈ ప్రమాదాన్ని నివారించడం చాల ముఖ్యమైన కర్తవ్యమనీ వరవరరావు అన్నారు. 'విప్లవ సినిమా' పేరిట ప్రజలలోని తిరుగుబాటు తత్వాన్ని వ్యాపారం చేసుకునే వాళ్ళు ప్రబలుతూన్న ఈ రోజుల్లో అటువంటి హెచ్చరిక చాలా అవసరం. ఈ హెచ్చరిక గురించి అసంపూర్ణమయిన చర్చ జరిగింది. చాలా శక్తివంతమయిన ప్రసార సాధనమయిన సినిమాను మనం విస్మరించగూడదని సినిమారంగంతో సంపర్కమున్నవాళ్ళు వాదిస్తే, ప్రతివాదులు బూర్జువా సినిమాను మనం ఉపయోగించుకోవడం భ్రమ అనీ అదే మనల్ని తన వ్యాపారానికి ఉపయోగించుకుంటుందనీ అన్నారు. డిస్ట్రిబ్యూటర్లనుండి సినిమా టాకీసు యజమాన్ల వరకు అందరికీ లాభాలు సంపాదించి పెట్టాల్సిన సినిమా, దాన్ని తీసే వాళ్ళకు ఎన్ని సదుద్దేశ్యాలున్నా, తన 'విప్లవ' లక్షణాన్ని త్వరలో కోల్పోక తప్పదు.

చర్చలో భాగంగా విప్లవ సాహిత్యంలో ఫ్యూడల్ అంశాల ప్రస్తావన వచ్చింది. ప్రజలలో వున్న పాటల బాణీలను తీసుకునే క్రమంలో కొన్ని వాక్యాలను, భావాలను, గూడ పాటలలోకి తీసుకోవడం జరుగుతోందని, దానివల్ల ఫ్యూడల్ భావాలు, ఫ్యూడల్ సంస్కృతికి చెందిన మాటలు, ప్రయోగించడం జరుగుతోందని, సి. వి. సుబ్బారావు అన్నాడు. బూతును ఒక ఉదాహరణగా చూపాడు. చర్చకు వచ్చిన మరొక అంశం, కమ్యూనిస్టు సమాజంలో సాహిత్యం ఏ రూపంలో వుంటుందన్నది. అది తిరిగి పాటరూపం తీసుకుంటుందని వరవరరావు అన్నారు. కమ్యూనిస్టు సమాజంలో శ్రమఫలం పరాయీకరణ చెందదు కాబట్టి ఆ పరాయీకరణనుండి పుట్టిన లిఖిత సాహిత్యం నశించి మళ్ళీ మౌఖికసాహిత్యం పునరావృతం అవుతుందని ఆయన అభిప్రాయం. వరవరరావుతో విభేదించిన హెచ్చార్కె, సమాజం అభివృద్ధి

చెందే కొద్దీ మనిషి తన మనస్సుతోకాక మేధస్సుతో స్పందించడం మొదలు పెడతాడనీ, కాబట్టి మళ్ళీ పాటను చేపట్టే అవకాశం లేదనీ, అన్నారు.

తరువాతి సెషన్‌లో శిల్పి 'సాహిత్యంలో శాస్త్రీయ దృక్పథం' అనే అంశం మీద ప్రసంగించారు. మార్క్సిజం సమాజాన్ని ఒక అవయవి గాను సాహిత్యాన్ని అందులో ఒక అవయవంగాను పరిగణిస్తుందని చెప్పి, మార్క్సిస్టు దృక్పథంతో ఆధునిక తెలుగు సాహిత్య పరిణామాన్ని వివరించారు. అకడెమిక్ సెమినార్లలో పేపర్ చదివినట్టు చదవడం వల్ల కాబోలు, వినేవాళ్ళ ఆసక్తిని పూర్తిగా ఆకర్షించలేకపోయారు. సెషన్‌కు హెచ్చార్కె అధ్యక్షత వహించారు. ప్రసంగం తరువాత, అభ్యుదయ సాహిత్యం ఎంత అభ్యుదయ పాత్రను నిర్వహించింది అన్నవిషయాన్ని గురించి కొంత ఘాటయిన వివాదం జరిగింది. అభ్యుదయ సాహిత్యం ఆనాడు తన పాత్రను సరిగ్గా నిర్వహించివుంటే ఇవ్వాళ మన పని కొంత సులువుగా వుండేదని కానూరి వెంకటేశ్వరరావు అన్నారు.

ఆనాటి చివరి సెషన్‌లో నమ్ముక 'సాహిత్యంలో పునరుద్ధరణ వాదం' అనే అంశంపై మాట్లాడారు. త్రిపురనేని మధుసూదనరావు అధ్యక్షత వహించారు. మామూలుగా 'పునరుద్ధరణ' అనే మాటను మతపరమయిన పునరుద్ధరణ అనే అర్థంలో వాడడం జరుగుతోంది. అయితే ఆనాటి వక్త, అధ్యక్షుడు,చర్చలో పాల్గొన్నవారు, అంతా గూడ 'పునరుద్ధరణవాదం' అనే మాటకు చాలా విస్తృతమయిన అర్థం ఇచ్చి, దాదాపుగా విప్లవవాదం కానిదంతా పునరుద్ధరణవాదం అన్నట్లు మాట్లాడారు. బహుశా ఉపన్యాసం శీర్షిక 'సాహిత్యంలో పెడధోరణులు'అనివుంటే బాగుండేదేమో. నమ్ముక అటువంటి వివిధ పెడధోరణుల గురించి చెప్పారు.విశ్వనాథ సత్యనారాయణతో మొదలుపెట్టి ఇస్మాయిల్ వరకు చాలమంది రచయితలను ఉదహరించారు గాని వాదన ఉండవలసినంత వివరంగా లేదనిపించింది. నగ్నముని రాసిన 'కొయ్యగుర్రం' అనే కావ్యాన్ని గూడ పెడధోరణుల కోవలోకి చేర్చడాన్ని గురించి చలసాని ప్రసాద్ అభ్యంతరం తెలిపారు. కొద్దిసంవత్సరాల క్రితం కోస్తా జిల్లాలలో భీభత్సం రేపిన తుపాను గురించి రాసిన ఆ కావ్యంలో నగ్నముని వ్యవస్థనూ ప్రభుత్వాన్నీ తీవ్రంగానే విమర్శించాడని ప్రసాద్ అన్నారు. అది వాస్తవమే గాని, ప్రజలను నిస్సహాయులుగా వర్ణించాడనీ, తుపానుకు వ్యతిరేకంగా ప్రజలు జరిపిన పోరాటాన్ని గుర్తించలేదనీ వాదించి వరవరరావు నమ్ముకను సమర్థించారు.

ఆరో తేదీ ఉదయం 'ఆంధ్రప్రదేశ్‌లో భూ సంబంధాలు' అనే అంశంపై

బాలగోపాల్ మాట్లాడారు. సామ్రాజ్యవాద యుగంలో గతంలో వలసలుగా ఉన్న దేశాలలో బూర్జునా విప్లవం కూడా పరిపూర్తికాదు గనుక ఆయా ప్రాంతాల్లోని వ్యవసాయ సంబంధాలను గురించి పరిశీలించడమంటే, ఆ ప్రాంతాల్లో ఉన్న అర్థ భూస్వామ్య సంబంధాల స్వభావాన్ని పరిశీలించడమేనని అయనన్నారు. సరుకుల ఉత్పత్తి, వాణిజ్యపంటల ఉత్పత్తి, పెద్ద కమతాలలో భూమి కేంద్రీకరణ, రైతాంగపు దారిద్ర్యం, ట్రాక్టర్లు, పంపుసెట్లు లాంటి ఆధునిక పరికరాల వాడకం, కౌలుదార్ల స్థానంలో 'స్వతంత్రులైన' కూలీల ప్రవేశం మొదలైన అంశాలకు సంబంధించిన గణాంకాల సాయంతో ఆయన నీటిపారుదల సౌకర్యాలు తక్కువగా ఉన్నప్రాంతాల్లో కన్న ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సాపేక్షికంగా పెట్టుబడిదారీ సంబంధాల అభివృద్ధి జరిగిందని చూపించారు. ఆ తర్వాత ఆసక్తికరమైన చర్చ జరిగింది. అధ్యక్షత వహించిన సి. వి. సుబ్బారావు రైతాంగ విభజనలో పెట్టుబడి ప్రవేశం పాత్ర ఎంత ఉందో వివరంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. దాదాపు వందప్రశ్నలు-సమాధానాలు, చర్చలతో ఈ అంశంపై చాల ప్రయోజనకరమైన ఆలోచనలు సభకు నిండుదనాన్ని తెచ్చాయి.

ఆ మధ్యాహ్నమంతా వంగపండు ప్రసాదరావు, గద్దర్, చలసానిప్రసాద్, కానూరి మొదలైన వారి సాంస్కృతిక ప్రదర్శనలు, పాటలతో గడిచింది.

మాచెర్ల పట్టణంలో సభా ప్రాంగణంలో నిర్మాణం చేసిన ప్రవేశద్వారం (కన్నెగంటి హనుమంతునగర్) మహాసభ స్థలంలో నిర్మాణం చేసిన ద్వారం, (కామ్రేడ్ బిక్కురాసులు నగర్) ఎంతో కళాత్మకంగా శ్రమజీవన సౌందర్యానికి నిదర్శనంగా వున్నాయి. పట్టణ వీధులగుండా ఉత్సాహకరమైన ఊరేగింపు సాయంత్రం సాగింది. బహిరంగ సభను తిరిగి కార్యదర్శిగా ఎన్నికయిన త్రిపురనేని మధుసూదనరావుగారు అధ్యక్షత వహించి ప్రస్తుత రాజకీయ పరిస్థితి, నూతన ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలు-విరసం పాత్ర గురించి వివరించారు. కాశీపతిగారు అంతర్జాతీయ రాజకీయాల గురించి, సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం తెస్తున్న యుద్ధ ప్రమాదం గురించి వివరించారు. రాంప్రసాద్‌గారు పౌరహక్కులపై ప్రభుత్వ దమనకాండను వివరించారు. సౌహార్ద్ర ప్రతినిధులు,వరవరరావు కూడ ప్రసంగించారు. విరసం సభ్యుడు, ఆహ్వానసంఘ కార్యదర్శి చంద్రశేఖర్ సభకు స్వాగతం చెప్పాడు. ఉపన్యాసాల తర్వాత జననాట్యమండలి, అరుణోదయ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

— పరిశీలక్

డియర్ కామ్రేడ్స్

జుగాష్విలి

డియ కామ్రేడ్స్! నన్నొదిలేయకండి!
మీరంత తొందరగానూ, మీతో సమంగానూ
నడవలేక పోతున్నందుకు నన్నొదిలేయకండి!
దోవమళ్ళినవారి దోవపట్టి
తలవంచుకొని (కూడా ధీమాగా)
తప్పుడడుగుల జాడలో నడచీ....నడచీ....
తల ఎత్తి....కళ్ళు తెరిస్తే....కళ్ళముందు ఆశాభంగం....
ఉద్యమం దారితప్పి
ఈజీ ఛైర్‌లో కబుర్లాడటం చూచి....చూచీ....
ముసురుకున్న నిర్లిప్తతతోపాటు
కుదురులేని సొంతబతుకు
నిర్దేశించిన బలహీనతలు తోడై....
ఆందోళన....భయం....తరిమి తరిమి వెంటాడబడిన వాణ్ని నేను.
కామ్రేడ్స్!
నా తలను నా మోకాళ్ళ మధ్యకు తన్నేసిన నిరాశా నిస్పృహలనుండి
నా ఆలోచననీ,ఆచరణనీ స్తంభింపచేసిన అపరాధ భావనా ఊబి నుండి
తెప్పరిల్లనివ్వండి! ఊపిరి పీల్చుకోనివ్వండి!
బలహీనతల అవరోధాలు దాటి
నిటారుగా నిలబడనివ్వండి
తప్పుటడుగుల నొదిలి
తప్పటడుగులు వేస్తున్న నాకు ఆసరా యివ్వండి!
ప్రపంచాన్ని మీ వెనుక నడిపించుకు పోతున్న ధీరులు మీరు
మీ వెంట నన్నూ నడవనీయండి
కామ్రేడ్స్! నన్నొదిలేయకండి
మీరంత తొందరగానూ, మీతో సమంగానూ
నడవలేక పోతున్నందుకు నన్నొదిలేయకండి.

ఊడ్పుల పాట

రుద్రజ్వాల

ఓయి బామల్లాల	వుయ్యాలో
బామ ల మ్మాలు య్యాలో	॥ఓయి॥
పచ్చి కన్నా ముందు	వుయ్యాలో
పక్క మీంచీ లెగిసి	,,
యింటి పను లన్నీ	,,
యీడు లాడీ చేసి....	,,
వుడక మెడకని తిండి....	,,
ముక్క నోటా గుక్క....	,,
పూడ్పులా కూలికి	వుయ్యాలో
ఉరుకుల్ల సాగేము....	పుయ్యాలో ॥ఓయి॥
ముటా మేస్త్రీ యెనక	,,
మేకల్ల సీపాయ్	,,
కట్ట పుట్టా లెక్క....	,,
కాల్వ కుంటీ ద్దాటి....	,,
గట్టు లెన్నో దిగి	వుయ్యాలో
కాలిదోవలు సుట్టి....	,,
వుస్సురు స్సూరంటు	వుయ్యాలో
పూడ్పులికి వంగేము	పుయ్యాలో ॥ఓయి॥
పొలము కేశాస్యంగ	వుయ్యాలో
పంట కుచ్చూడ్పి చ్చి*	,,
దాన్నెమ్మ పెరగమని	,,
టెంకాయ గొట్టిచ్చి	,,

కృష్ణా జిల్లాలో పూడ్పులూడుస్తూ ఎండకు తాళజాలక వానకోసం రైతు కూలీలు పాడే 'ఓయి బామల్లాల' పాటచాయలో....

* ఆకు కట్ట మూడు కుచ్చులు చేసి పసుపు కుంకుమ వేసి విఘ్నేశ్వర పూజ చేస్తారు.

ఆ సామి ఎదగమని వుయ్యాలో
దేవుడికి మొక్కొడితె ,,
పొలమోడు సిప్పసూ కుయ్యాలో
పలుకులూ నాల్గుంచె నుయ్యాలో ॥ఓయి॥

నారు కట్టలు దీసి వుయ్యాలో
సలువంక లేత్తుంటె ,,
కట్టలా ఎండ్రువా ,,
కల్లు దిప్పే సేను ,,
తరాలు తొక్తుంటె ,,
గెడ్డ తేల్లూ గుట్టె ,,
జలగ బుర్దా కొయ్య లుయ్యాలో
కొల్లు జుట్టేశాయి పుయ్యాలో ॥ఓయి॥

మిట మిటల యెండకే పుయ్యాలో
ముచ్చెమటలూ బోసె ,,
పోసినా సెమటలకే ,,
మాడు మంటెత్తినా ,,
కాల్కింది యేడ్నిల్ల కుయ్యాలో
ఒల్లు పోటెత్తినా పుయ్యాలో
కూలికై నడుమొంచి ,,
గాలీల్ల ఆకేత్తి మయ్యాలో.... ॥ఓయి॥

ఏడి మంటా లెండ వుయ్యాలో
ఏపు తగ్గాలనీ ,,
అక్కమ్మ వాన్దేపుల
కత సెప్ప వానొత్తె ,,
మైసం కాయిత మేస్కొ నుయ్యాలో
మగువ వంగుంటేను వుయ్యాలో
ఒకరొకరు తలలొంచి వుయ్యాలో
ఆమె కిందొంగుంటె మయ్యాలో ॥ఓయి॥

ముసుములూ బట్టుకొని వుయ్యాలో
ఎసకెసకి అడుగేత్తు ,,
నీల్ల బురదాలోన ,,
దిగిన కాళ్ళాకుక్కంటు ,,
నడుములూ పడిపోంగ ,,
కాళ్ళు గుంజక పోవ ,,
తీపెత్త సేతేళ్ళు వుయ్యాలో
మా గాస్లు పొడ్చితిమి వుయ్యాలో ॥ఓయి॥

మొక్క మొక్కా నాటి ,,
వేళ్ళగా నిల్పేము ,,
వేరువైనా మనకు ,,
వగవగలె మిగిలేను ,,
సేను సేనుకు మనము ,,
సిరి పంట లైనాము ,,
సిరి పంటలగు మనకు ,,
సింతల్లు తప్ప లేదుయ్యాలో ॥ఓయి॥

కూడు నిచ్చేమనల వుయ్యాలో
కూడుకు దూరంజేసి రుయ్యాలో
కలిమి నిచ్చే మనల వుయ్యాలో
కూలోల్ల జేసారు.... ,,
పురులు పెంచే మనల ,,
పరుల జేసే శారు.... ,,
సోమారి బూ సాము లుయ్యాలో
నో పానమూ లెక్క రుయ్యాలో ॥ఓయి॥

ముటా గట్టిన మేస్త్రి వుయ్యాలో
మామూళ్ళ పెరిగేను ,,
పనికి పనికే కూలి ,,
పని జెయ్యకే పట్టె నుయ్యాలో

అటు యిటూ మాటలకు — పుయ్యాలో
మాటకే దండుకొనె నుయ్యాలో
అన్ని జేసిన మనకు — పుయ్యాలో
ఆప సోపా లాయె — పుయ్యాలో ॥ఓయి॥

ఇల్లల్లో పొలముల్లో — పుయ్యాలో
మన సెరలు గడతేర.... ,,
గనులల్లో, మరలల్లో.... ,,
మన సెమలు గట్టెక్క ,,
చీగ చెంగులు జుట్టి ,,
చిరుత పులు లవ్వాలి ,,
మనల దోచేటోళ్ళ నుయ్యాలో
మట్టి గరి పిచ్చాల — పుయ్యాలో ॥ఓయి॥

కూలోల్లతో గలిసి — పుయ్యాలో
కూలి జెండెత్తాలి ,,
రైతన్నలా తోటి ,,
రగులుకొని నడవాలి ,,
పూరూరి కొడవళ్ళ నుయ్యాలో
వుసిగొల్పి లేపాల — పుయ్యాలో
పగతురా పెత్తనంబు య్యాలో
పడ గొడ్తైనే మేలు — పుయ్యాలో ॥ఓయి॥

పెట్టుబడి ప్రచురణ

"అనివార్య కారణాలవల్ల కారల్‌మార్క్స్ రచించిన 'పెట్టుబడి' తెలుగు ప్రచురణ ఆలస్యం అవుతున్నది. గతంలో ప్రకటించినట్లుగాక జూలై, ఆగస్టు నెలల్లో మాత్రమే అది వెలువడగలదని తెలియజేయడానికి చాల విచారిస్తున్నాము. అలాగే మే నెల నుండి ప్రీ పబ్లికేషన్ అడ్వాన్సు 20 రూ॥లకు పెంచామని తెలియజేస్తున్నాము. పాఠకులకు కల్గిన అసౌకర్యానికి మన్నించవల్సిందిగా కోరుతున్నాము."

—ఇంగువ మల్లికార్జున శర్మ,
కన్వీనర్, మార్క్సిస్టు అధ్యయన వేదిక
6-3-1145–114, హైదరాబాదు 500 482

సింగరేణికథలు-5

లీడర్

కార్మిక

పొద్దు బారెడెక్కింది, కడుపులు ఈడ్చుకు పోతుంటే వాడిపోయిన మొకాలతో ఎవరికోసమో ఎదిరి చూస్తాండ్లు జెండగద్దె మీద కూర్చున్నమంది. రంగెల్సిపోయిన సుత్తె కొడవలి జెండా ఇనుపరాడుకు వేలాడుతోంది.

"అన్నా ఓ బీడుంటె ఇయ్యి" ప్రక్కనే నిలబడ్డ రాజయ్యను బీడి అడిగిండు చెంద్రయ్య. రాజయ్య ఓ బీడి తీసిచ్చిండు.

"పదకొండు గొట్టబట్టె ఇంకెప్పుడత్తడో ఏమో, రాంగ కూడు గూడ తినిరాక ఆకలైతాంది. సింగలంత చాయన్నా తాగత్తాం పా" అంటూ అక్కడ కూర్చున్న మరో ఇద్దరు లేచి పోయిండ్లు.

"దూసి చూసి యాస్టరాబట్టె" ఇవ్వాల వత్తడంటవా?" బీడీ అంటించుకుంటూ అడిగిండు రాజయ్య.

"ఇవ్వాల శనివారం గదాఅందుకే ఆలశ్యమైనట్లున్నది పూజగిట్ట చేసుకొని వత్తాండుగావచ్చు సారు" మొకంమీది చమటను తూడ్చుకుంటూ చెప్పిండుచెంద్రయ్య.

"కమినిస్టోల్లకు దోపిడెక్కడిది, పూజలెక్కడివి ఏంపనుండి ఆగిండోఏమో" రాజయ్య.

"అగో! అయితే గా నెలరోజులకింద తిరుపతికిపోయి గుండు ఎందుకు కొట్టిచ్చుకచ్చుకున్నడు" ఎత్తుపండ్లు ఎల్లబెట్టి లింగయ్య ప్రశ్నించాడు. కాని ఆ ప్రశ్నకు జవాబు రాకముందే కారత్తాంది-కారత్తాందని అందరు లేచి నిలుసున్నరు.

నమస్తె సార్ అని కొందరంటే, దండం దొరా అని కొందరన్నరు. చేతులు మాత్రమే జోడించిండ్లు ఇంకొందరు.

కార్లనుండి సుతారంగా దిగిండు లీడరు. ఒక చేతిలో కాగితాల పుస్తకం, మరో చేతితో కండ్లద్దాలు పట్టుకొని చేయి లేపకుండానే నమస్తె, నమస్తె అంటు ఆఫీసు లోనికి నడిచిండు.

చేతిలోని కండ్లద్దాలు టేబుల్‌మీద ఉంచి కుర్చీలో కూలబడుతూ "మంచినీల్లు తేరా మొండిగా" అంటు ఆఫీసు బాయ్‌కి కేకేసి 'అబ్బబ్బ ఎండలు మాయిల్లమే ముదిరినయ్' అంటు మొకాన్ని తూడ్చుకున్నడు. అంతలోకే మొండోడు తెచ్చిన మంచినీల్లు గటగటతాగి గిలాసను మొండోని చేతికి తిరిగిచ్చి సిగరేటు వెలిగించిండు.

అప్పటిదాకా బయట నిలబడ్డ మంది లోనికచ్చి గోడనానుకుని ఉన్న బెంచి

మీద కొందరు కూర్చుంటే, స్థలం సరిపోక కొందరు నిలబడ్డారు. గోడకు ఒకవైపు లెనిన్ ఫొటోతోబాటు ఇంకో రెండు ఫొటోలు ఎవరివో వ్రేలాడుతున్నవి. పైన ఫ్యాను తిరుగుతోంది.

"ఏం సంగతి చెప్పండి? ఎందుకచ్చినట్లు?" సిగరేటు పొగ వదుల్తూ అడిగిండు లీడర్.

"దొరా! పని గురించి దూపాలిచ్చి మూడు నెల్లుగాబట్టె, ఇదివరకు నాలుగు సార్లు తిరిగిబోతి. ఇంతకుముందు వచ్చినప్పుడు 15 రోజుల తర్వాత కలుప మంటిరి గదా"- బెంచీపైన కూర్చున్న చెంద్రయ్య నిలబడి చెప్పిండు.

నేనిచ్చి నాలుగు నెల్లు అయితాందంటే, నేను తిరుగబట్టి ఆరు నెల్లయితాందని ఒకరు చెప్పడం కాకముందే ఇంకొకరు చొప్పున చెప్పుతున్నరు.

పైన ఫ్యాను తిరుగుతున్నా లీడర్ మొకానికి చెమటపట్టింది. ఆ మాటలు వింటూనే కుర్చీలో నుండి లేచి ప్రక్కనున్న బీరువానుండి కాగితాలకట్ట తీసి ఒక్కొక్కరి పేరు అడుగుతూ కాగితాలు తిరిగేసిండు.

యూనియన్ లీడర్ కాగితాలు వెదుకుతుంటే- పని దొరికినట్లేనని సంబర పడ్డరు కొందరు. ఇది మామూలే అనుకొన్నరు. ఆఫీసు చుట్టూ, లీడర్లచుట్టూ అనేక మార్లు తిరిగినవాల్లు.

ఆ కట్టలో వీరి పేర్లు దొరుకలేదో ఏమో,లేచి బీరువాలోనుండి మరొక ఫైలు బయటికితీసి అందులో నుండి రెండు-మూడు కాగితాలను బయటికి లాగి నింపాదిగా మరో సిగరేటును వెలిగించిండు.

ఫ్యానుగాలి చల్లగా వస్తున్నా-కడుపులో మాత్రం మంటమండుతుంటే సారేం చెప్పుతడో అని ఆశగా చూస్తాండ్లు అందరు.

"అవు రాజు మిమ్ముల్ను రమ్మన్నది ఈరోజేనా" అడిగాడు లీడరు.

"ఈ రోజే రమ్మంటిరిగదా సార్" వెంకటి

"సారు కెందుకు యాదికుంటది మనగురించి. సారుకెన్ని పనులుంటయి ఏంకతా" రాజయ్య

"మీపనితప్ప నాకింకేంపని లేదనుకుంటాండ్లా" కోపాని కచ్చిన లీడరు సిగరేటు ముక్కను బయటికి విసరేసిండు విసురుగా

"మీరే చెప్పితిరి గదా- జీతాల తెల్లారి కలువుండ్లని" చెంద్రయ్య మల్లీ జ్ఞాపకం చేసిండు.

"అవునయ్యా నాకు తెలువదా- ఇవ్వాల మీర త్తరని అందుకే మీ గురించి ఏజంటు ఆఫీసుకుపోయి మాట్లాడి వస్తున్నా" లీడర్.

"మరి ఏమైయింది సారు" అని రాజయ్య అడిగిండు.

"మీపేర్లు ఏజెంటు ఆఫీసుకు పోయినయి.కాని ఏజంటు దొర ఊరికి పోయిండట. ఇంకో వారం రోజుల వరకు రాడట. కాబట్టి మీరు ఇంకో పదిహేను రోజుల తర్వాత వస్తే ఏసంగతైన తెలుస్తది." అని చావు కబురు సల్లగా చెప్పిండు లీడరు.

అంతలోనే కండ్లలో ఊపిరితో కనుకయ్య మందిల నుంచి ముందు కచ్చిండు. "ఆరు నెల్లాయె నేను తిరుగ బట్టి రూపాయలు అప్పు తెచ్చినకాడ వడ్డీ పెరుగ వట్టే, పని దొరకకనో తిరుగుడు గాబట్టే, బండి చార్జీలకు తిప్పల కాబట్టే".

"అవునయ్యా పైసలు ఇచ్చేటప్పుడో కొసరి కొసరి ఇత్తరు. పని దొరుకుతలేదని ఎగిరిపడితే ఇదేమన్నా దుకాణం మీది సామానా- పైసలియ్యంగనే సామాను ఇయ్యడానికి"- కాగితాలు తిరిగి కట్టకడుతూ చెప్పిండు లీడర్.

"మనిషికి మూడు వేలకి త్తిమి, ఆర్నెల్లాయె తిరుగబట్టి- ఇక కొసరిందే ముంది, ఏగిరపడ్డదేముంది" అంటు కింద కూర్చొన్నోడు లేచి అన్నడు.

"అవునయ్యా నాకు మాత్రం తెలువదా. మీరిచ్చిన డబ్బు నేనేమన్న మింగు తాన్నా, నాకు మాత్రం బాదలేదా మీ గురించి. కంపినోల్లకు లంచం పెట్టుడేనాయె, ఎంప్లాయిమెంటు ఆఫీసుల లంచం లేంది పనే జరగదాయె. మన గురించి కంపినోల్ల కేమన్నా బాదుంటదా. పనుల్లేక ఆకలికి బాదపడేటోల్ల గురించి కంపినీ దొరలకు కనికరముంటదా. అంతా లంచగొండి నాడ్డి కొడుకులే అయిరి. పైసలు తిన్నా పని తొందరగ చెయ్యరు. వీళ్ళ లంచగొండి తనాన్ని గురించి మొన్ననే కరపత్రాలు పంచినా వాళ్ళకు బుద్ధి రావడం లేదు. అందుకే గదా మేం చెప్పేది ఈ దొంగ కాంగ్రె సోల్లకు ఓట్లేసి గెలిపిస్తే దోపిడి గిట్లనే జరుగుద్ది. ఇవన్ని పోయి పేదోల్లకు న్యాయం జరుగాలంటే కమ్యూనిస్టు పార్టికి ఓట్లేసి గెలిపిస్తే పార్లమెంటుల దేనైనా మార్పించచ్చు. దోపిడి లంచగొండి తనాన్ని లేకుండా చెయ్యచ్చు" లీడర్ ఇంకేదో చెప్పబోయేసరికి పట్ పట్ మంటు చప్పుడు చేసుకుంటూ ఆఫీసు ముందుకు సైకిల్ మోటార్ వచ్చి ఆగింది. మాటలు బందయి లీడర్‌తో బాటు అందరి దృష్టి మోటార్ సైకిల్ వైపు మళ్ళింది.

మోటార్ సైకిల్ దిగి వచ్చిన గడ్డం మనిషి చలువ కళ్ళద్దాలు తీసి చేతిలో పట్టుకొనివచ్చి లీడర్‌తో హిందీ భాషలో ఏదో మాట్లాడిండు.

బయటెక్కడో కొంపలు తగులబడి పోయినట్లు- నాకు అర్జంటు పనుందంటు కాగితాల పుస్తకం పట్టుకొని కండ్లద్దాలు సవరించుకుంటూ వచ్చిన మనిషితోనే లీడరు బయటికి రావడంతోనే అందరు లేచి ఆఫీసు బయటికే వచ్చిండ్లు.

"మన సంగతేటు జెప్పకపాయెగదా. మల్లెప్పుడు రమ్మన్నట్టు అడుగుదాం పద" అంటు లీడర్ వెనుకాలే కారు దగ్గరికచ్చిండ్లు కొందరు.

"బాయికాడ స్ట్రయిక్ జరుగుతాందట నేను తొందరగా పోయేదున్నది. మీరు తర్వాత కలువుండ్లి"ని కారెక్కి కూర్చున్నడు లీడరు.

"మరి మా సంగతేమైనట్లు- మల్లెప్పుడు రావాల్నో చెప్పకపోతిరి" కారు చుట్టు మూగిండ్లు మంది.

"పదిహేను రోజుల తర్వాత కంపినోల్లు మందిని బర్తీ చేసుకుంటాండ్లు. అప్పుడు మీరు సెలక్టు అయ్యేలా చేస్త కాబట్టి పదిహేను రోజుల తర్వాతచ్చి కల్సి పోండ్లంటు" కారు స్టార్టు చేసేసరికి కారు చుట్టూ గుమిగూడిన మంది పక్కకు జరిగిండ్లు. కారు దుమ్ము లేపుకుంటు ముందుకు దూసుకుపోగా- మొకాలపై పడ్డ దుమ్మును దులుపుకుంటూ ఇండ్లదారి పట్టిండ్లు.

o o o o

విశాలమైన ప్రహారిగోడ కలిగి మధ్యలో దాదాపు 30 గదులు గలిగిన పెద్ద ఆఫీసు బంగ్లా. బంగ్లా చుట్టు రకరకాల పూలచెట్లు. చెట్లకోసం నీటి సరఫరాకు నల్లాలు. పచ్చటి గడ్డీ, దొరల కార్లు, జీపులు నిలిపేందుకు షెడ్లు. ఆఫీసులో కొన్ని ఎయిర్ కూల్ గదులైతే మిగిలినవి ఫ్యాన్లు మాత్రమే ఉన్నటువంటి గదులు. రెండు వరుసలుగా గదుల వరుసలు గలిగి మధ్యన వెడల్పయిన వరండా, వరండాలో హడావిడిగా తిరుగుతున్న ప్యూన్లు. ఆఫీసు ముందు భాగానగల గేట్ ద్వారంకు ఇరువైపులా పెద్దపెద్ద బోర్డులు వేలాడుతున్నయ్. ఒకదానిపై డివిజనల్ సూపర్ రింటెండెంట్ అని వ్రాసివుంటే అడిషినల్ జనరల్ మేనేజర్ ఆఫీస్ అని ఇంకొక బోర్డుమీద వ్రాసి వుంది. గేటుముందు కాకి బట్టలేసుకుని కర్ర చేతబట్టుకున్న వాచ్ మెన్ కాపలా కాస్తున్నడు.

ఆఫీసు ముందు ప్రహారి గోడనానుకుని బయటి స్థలంలో పెద్ద పెద్ద చెట్లు. గాచెట్ల నీడ క్రింద పొద్దున్నుండి ఎవరి కోసమో పడిగాపులుకాస్తు ఎదిరిచూస్తున్న దాదాపు ముప్పయి, నలుబై మంది గుంపులు గుంపులుగా చెట్లక్రింద కూర్చున్నారు.

రాలచెట్టు క్రింద కూర్చున్న లాగులోల్లు కొందరు రాజకీయాలు మాట్లాడుకుంటాండ్లు.

"కంపిన్ల పనిచేసేటోల్లకైతే వేజ్‌బోర్డు వచ్చినప్పుడల్లా జీతాలు పెరుగ వట్టె, జీతాలు పెరుగుతానయ్, పెరుగుతానయట అనుకోంగనే జీతాల కంటె ముందే బజార్ల ధరలు పెరుగవట్టె, జీతాలు పెరిగినా "ఎక్కడేసిన గొంగలి అక్కన్నే" ఉన్నట్లు మల్ల పైస గూడ మిగుల్త లేవుగదా-మరి జీతాలంటె కార్మికులకే పెరిగినయ్. మరి దరలో- దేశమంతట పెరిగెనా! గిసోంటప్పుడు జీతాలు పెరిగినోల్లకే ఎల్లకుంటుంటె ఏ జీతం పెరుగని ఊళ్ళల్ల కూలి, కైకిలి చేసుకోని బతికెటోళ్ళ సంగతేంది" కట్టెపుల్ల తోటి భూమి మీద గీతలు గీసుకుంట రాలచెట్టు కింద మందిల కూర్చున్న యాదగిరి అడిగిండు.

"అయితే కంపెండ్లల్ల పని చేసేటోల్లకు జీతాలు పెరుగుతాంటె దరలు పెరుగుకుంట కడుమోల్లకు తిప్పలైతాందంటవ్? మరి జీతాలు పెరగాల్నాని లేబర్లు ఎందుకు సమ్మెలు చేస్తాండ్లంటవ్" యాదగిరికి ఎదురు ప్రశ్న వేసిండు సుధాకర్.

"దరలు పెరుగుతానయి గాబట్టి" జవాబు.

"జీతాలు పెంచుతే మల్ల దరలు పెర్గుతయిగదా" ప్రశ్న

"ఆ....అందుకే- పెంచవలసింది జీతాలను గాదు. ధరలను తగ్గించాలె. అంటే దోపిడి తగ్గాలె" జవాబు చెప్పిండు యాదగిరి.

మంచినీల్లు తాగేందుకు గేటుదాటి పూల తోటలో ఉన్న నల్ల దగ్గరకు పోయిన కొద్ది మందిని అధిరించుతూ బయటకు తరుము కస్తుండు వాచ్‌మెన్.

వేపచెట్టుక్రింద కూర్చొన్నోళ్ళు చిన్న చిన్న రాల్లుపెట్టి పులి-మేకలు ఆటను ఆడుతున్నారు.

మర్రిచెట్టు క్రింద కూర్చున్న గుంపులోల్లు వాళ్ళ వాళ్ళ బతుకుదెరువు సంగతులు, ఇంటి సంగతులు మాట్లాడు కొంటాండ్లు.

అప్పుడే ఓ నలుగురు గా మర్రిచెట్టు క్రిందికి వచ్చి నిలబడంగనే- అంత క్రితమే అక్కడ కూర్చున్న మంది అడిగిండ్లు.

"మీరు కూడ ట్రేనింగ్ అయినోల్లేనానే అన్నా"

"కాదు లాంగుటర్మినేషన్ చేసిండ్లు మమ్ములను "నలుగురిలో నుండి ఓ వ్యక్తి చెప్పిండు.

"మీరు ట్రేనింగ్ అయినోల్లా?" అప్పుడే వచ్చిన నలుగురిలో నుండి ఒకతను ప్రశ్నించిండు.

"ఆ....లీడర్లకు లంచాలు పెట్టి పని గురించని ఆరునెల్లు కాల్లు అరిగెతట్టు

తిరిగినం. డాక్టరోడు ఫిట్ చేసెకాడ ఆడగూడ లంచం పెట్టినం. డాక్టర్ ఫిట్ అయినంక నెలరోజుల దాక తింపుకోని ట్రేనింగ్‌కు పంపిండ్లు. ట్రేనింగు అయ్యి మూడునెలలైతాంది ఇంత వరకు ఏబాయిలకు కూడ పంపుతలేరు. ఇవ్వాల రేపను కుంట మూడు నెలలు జరుగు కచ్చిండ్లు" పాటం చెప్పినట్లే చెప్పుకచ్చిండు మర్రి చెట్టు క్రింద కూర్చున్న మందిల నుండి ఒకతను.

"మరి ఇంకెప్పుడు తీసుకుంటరట''?

"ఏమో....పని కన్న పంపు మంటం, లేకుంటే మా రూపాలు మాకన్న సారేయి మంటం. ఈ రోజు లీడరోడు వచ్చినంక ఇటో అటో తేల్చుకోవాలె. నీయవ్వ గాడ్డి కొడుకులు పైసలు దొబ్బి మిడ్డిపట్టు తిప్పుకొంటాండ్లు ఇంటికాడ కూలిచేసు కున్నట్లు గాదాయె. ఇక్కడ బాయిల పని దొరికినట్లు లేదాయె'' బావపడుతూ చెప్పిండు దోతి కట్టుకుని గుంపుల కూర్చున్నతను.

''పులి_మేకల ఆటలో నేను మూడుసార్లు పులులను కట్టేసిన" అంటూ విజయ గర్వంతో చెప్పకుండ యాదగిరిదగ్గరకచ్చి కూర్చున్నడు రజాకు.

''చూడు సుధాకరన్నా దోపిడోల్లు ఓడిపోరంటివిగదా! మేకలు కట్టుగా వుంటి ఆడెటోల్లు గట్టోలు అయితే తప్పకుండా పులులు కట్టుపడుతయి. మేకలు కట్టుగున్నా ఆడెటోల్లు తెలివి కల్లోలు గాకుంటే మేకలు ఓడుతయిగదా....అగో....గట్లనే మంది సంగతి, సర్కారు సంగతి కూడ. మంది కట్టుగుంటే నాయకులు మంచోల్లయితే ఎవ్వనైనా ఓడించచ్చు."

సుధాకర్ ఇంకేదో అడుగుదామనుకొనెటాల్లకే లీడర్ కారు వస్తాందని అందరు లేచిండ్లు.

దూరాన్నే చెట్టుక్రింద కారు ఆపుకొని దిగి వస్తున్న లీడర్‌కు ఎదురుగా ఎండ లోకే పోయిండ్లు చెట్లక్రింద కూర్చున్న మందందరు.

లీడర్‌కు ఎదురుగా పోయినోళ్ళు-లీడర్‌తోబాటు వెనక్కి తిరిగివచ్చి చెట్టు క్రింద జమయిండ్లు.

"ఏమయింది డి. ఏ. ఓ. సారేమన్నడు?'' నడుచుకుంటనే అడిగిండు లీడరు.

"ఓ సారు___ఇగమేం ఎవల్ని ఏం అడుగ దల్చుకోలేదు. మాపైసలు మాకియ్యుండి. పనిలేకుంటె మాయె" ఎవలో కోపాని కచ్చి అడిగిండు.

"ఇంకెన్ని రోజులు చెట్లక్రింద కూర్చుండి పొమ్మంటరు. ఏమి తినుకుంట తిరుగు మంటాండ్లు" ఎవలకు తోచినట్లు వాల్లు ఎగబడ్డట్లు నిలదీసి అడిగిండ్లులీడర్‌ను.

"పనులల్లకు ఎక్కక ముందే గాడ్డి కొడుకులకింత గమండి ఉంది ఇక రేపటి కాల బాయిల మీద నామాలే మింటరు వీల్లు". అని మనసులోనే అనుకొని మీగురించి గాకపోతే నేను ఎందుకు తిరుగుతాన్నను కొంటాండ్లు నేను డి. పి. ఓ. దగ్గరకు పోయి సంగతేందో తెల్సుకొని వత్తా'' అంటూ యుద్ధానికి బయలు దేరిన తీర్గ ఆఫీసు వైపుదారి తీసిండు లీడర్.

"ఈ మాటలు, ఈ ఇరుకులాట ఎప్పుడూ ఉండేదేనాయే. ఇయ్యాల తెల్సుకోనేదేంది లొట్ట పీసు" చెట్టు కింద మందిల నిలబడ్డ సాయిలు గునిగిండు.

కోపంతో బయలు దేరిన లీడర్‌కు ఆఫీసు మెట్లు ఎక్కేవరకే సగం కోపం చల్లబడ్డది.

డివిజనల్ సూపరెంటెండెంట్ అని బోర్డు వ్రాసివున్న గదిముందు నిలబడ్డ ప్యూను నమస్తె పెడుతూ డోర్‌ను తెరవడంతో లీడర్ ఆ గదిలోకి అడుగుపెడుతూ నమస్తే శాస్త్రిగారంటూ ఎదురుగా ఉన్న స్ప్రింగ్ కుర్చీవైపు దారితీసిండు.

ట్యూబ్‌లైట్ల కాంతిలో నున్నగామెరుస్తున్న బట్టతలను పైకెత్తి కళ్ళద్దాల కొసల్నుంచి పరీక్షగా చూస్తు "రండి స్వామిగారు రండి" అంటూ ఎదురుగా ఉన్న కుర్చీ చూయించిండు.

చూయించిన కుర్చిలో కుర్చుంటు స్వామిగారు, గది యొక్క ఎయిర్ కూల్డ్ వాతావరణానికి ఒక నిముషము మైమరచి కాస్త సేద తీర్చుకొని ''ఏమండి శాస్త్రిగారు ఈ మధ్యనే మళ్ళీ లీవులో వెళ్ళుతున్నారంట ఏమిటి సంగతి" అంటు పిచ్చాపాటికి దిగాడు లీడరు

అంతలోకె సూపరిన్‌డెంట్ శాస్త్రిగారు ప్యూన్‌నుపిలిచి కూల్‌డ్రింక్స్ ఆర్డరిచ్చాడు.

"ఏముందండి మొన్న నాలుగు రోజులు మా పెద్దమ్మాయి వాళ్ళకు ఊటీకి ట్రాన్స్‌ఫర్ అయిందంటె చూసివస్తామని వెళ్ళానండి."

"అవునిక్కడ ఎండలు మండిపోతున్నాయండి అసలు ఈ ఎండలు తట్టుకునేటట్టుగా లేవు, మళ్ళీ మీ ప్రయాణము ఉందని విన్నాను. మళ్ళీ ఈ సారి ఎటు వెల్తున్నారు."

"చిన్నమ్మాయి పెళ్ళిసంబంధము గురించి విశాఖపట్నము పోవల్సిఉండె కాని ఎక్స్‌ప్రెస్‌కు రిజర్వేషన్ దొరకకపోవడంతో ప్రయాణం రద్దయింది. ప్యాసింజర్‌కు పోదామంటే ప్రయాణం లేటయితది. లేటే కాకుండా అందులో ప్రయాణము చేయా

లంటే ఇబ్బంది కూడ. బ్రైన్ కన్వీనెంట్ ఏమంతగా బాగా లేవండి" సిగరెట్టు ముట్టించాడు శాస్త్రిగారు.

"ఆ ప్యాసింజర్ల పోయేదానికంటే నడిచిపోవడమే మేలు అందులో ప్రయాణం చేసేది మనుష్యులు కారండి పశువులు, అవునుగని అబ్బాయిగారు ఏం పని చేస్తున్నరు' తనో సిగిరెట్టు అంటించుకుంటు కుతూహలంగా అడిగిండు లీడరు.

షిప్‌యార్డులో ఇంజనీరుగా చేస్తున్నడు,కాని సమస్యఒకటి వచ్చిపడిందండి.... అదే కట్నం విషయంలో...." శాస్త్రిగారు కొస్త నీళ్ళు నమిలాడు.

'ఎంతేమిటి'

'లక్షయాబయివేలు'

'అబ్బా మాకంటే మీరెసయమండి'

'ఏదో నౌకరిగాల్లం అంత ఏం యిచ్చుకోగలమండి'

"మీరు అలాగే అంటారు....కానున్న కార్యము గందర్వులే నిర్వహిస్తరు, మీరేమి బెంగపెట్టుకోకండి, పిల్లైతే యివ్వాలె మా సెక్రటరిని మీఇంటికి పంపిస్తా" లీడరామాట అని శాస్త్రిగారికేసి చూసిండు కళ్ళు పెద్దయి చేసుకుని.

"అందరి సహకారముండాలి .... అది సరెగాని 2 ఇంజెన్ సంగతేంటి నాకిదేమి అర్థము కావటములేదు, మాటిమాటికి స్ట్రయిక్‌లకు దిగుతారు....వీళ్ళు చేయబట్టి మొత్తం డివిజన్‌కే చెడ్డపేరొచ్చేట్టుంది." శాస్త్రిగారి మాటలినేసరికి లీడర్‌కు మత్తు వొదిలింది.

"మేము ఇదివరకె చెప్పితిమిగదా రాడికల్స్ చేయబట్టే ఆ బాయి సరిగా నడవదని"

'మీమ్ముల్ని కాదని సమ్మెలెట్లా జరుగుతాసయి' శాస్త్రిగారి రాజకీయం అర్థముకాలె.

"ఇదిగో శాస్త్రిగారు వాళ్ళను పనిలో ఉండనిచ్చినంతకాలం మేముకాదు కదా ఇంకెవరు వచ్చినా కార్మికులు వినరు....బాయింకా పూర్తిగా చెడిపోకముందే రాడికల్ పోరగాండ్లను పనిలనుండి డిస్‌మిస్ చేయండి ఆ తర్వాత బాయి అదే బాగుపడుద్ది" లీడర్ ఆవేశానికి వచ్చి చెప్పిండు.

ప్యూన్ లోనికొచ్చి కూల్‌డ్రింక్స్ యిచ్చిండు.

కూల్‌డ్రింక్స్‌దాగి నెమ్మదికొచ్చిండ్లు ఇద్దరు. లీడర్‌సామి మళ్ళీ అన్నడు

"ఇదివరకు మెడికల్ పిట్ అయిన వార్ని పనిగల్పించక పోతిరి....వాళ్ళు నాపీకలు పడుతున్నరు.... బయట చెట్లక్రింద కూచున్నరు లోనికి రావడమే కష్టమై పోతాంది ట్రైనింగ్ ఇచ్చి మూడు నెలలు కాబట్టె, ఇంత వరకు పనిలకు పంపించక పోతిరి"

"చూడండి స్వామిగారు అన్ని తెలిసి మీరె యిలా అంటే అటు అపాయింట్ మెంట్, ఇటు ట్రైనింగ్‌కు పంపడం ఇంకోవైపు పిట్‌లోకి పంపడము అన్ని ఒక్క సారి జరగాలంటే ఎలా?" ముందున్న ఫైలును తిరిగేస్తు చెప్పుకొచ్చిండు శాస్త్రి.

"అదికాదండి....యిప్పుడు రెండు వైపుల నుండి సమస్య ఎదురౌతాంది.... అటు డబ్బిచ్చినోళ్ళు పని గురించి ఎగిరపడబట్టిరి, ఇటు ట్రైనింగ్ చేసినొళ్ళు అగుత లేరు" స్వామి ఇబ్బంది పడుతు చెప్పిండు.

చేతిలో ఫైలును మళ్ళిమూసిండు....మెల్లగా చెవులో చెప్పేసట్టు ముందుకు వంగి "ఇంకో పదిహేను రోజులు ఆగుకరాండి ఇప్పుడు ట్రైనింగ్ చెస్తున్న బ్యాచ్ అయిపో.గానే కొత్తవాళ్ళను అపాయింట్ చేసుకొని ట్రైనింగ్‌కి పంపిస్తాము. ఇకపోతే ఇదివరకు లాంగ్ టర్మినెషన్ డిసమిస్ జరిగిన బాపతు వెకన్సిలున్నవి కదా.... మొన్నటి స్ట్రయిక్ బాపతు యింకొందరిని తీసెయవచ్చు.... ఇంత యిబ్బంది ఉండక పోను అపాయింట్‌మెంట్‌లో అవకతవకలని జనం గగ్గోలు పెడుతాండ్లు కాస్త గుట్టుగా జరిగేట్టు చూడాలి." మళ్ళో సిగరెట్టు అంటించిండు.

ఆపీసర్‌గారి ప్లాన్‌కు లీడర్‌కు కొంచెము ఊరట కలిగింది. ప్యూన్‌తో చల్లటి నీళ్ళు తెప్పించుకొని గటగట త్రాగి గడియారం చూసుకున్నాడు 'సరె అలాగే కానీయండి....నేను బాయికాడికి పోయివస్తా' లీడరు లేచి బయిటకి నడిచిండు.

"సారు లోపటికి పోయి చాలసేపయితాంది కదా ఇంకేమి జేత్తాండో" చూసి వద్దామని లోపలికి పోనీకి ప్రయత్నించిండ్లు చెట్ల కింద ఉన్నమంది. కాని వాచ్‌మన్ వాళ్ళను గేటుదాటనియ్యలె.

"వాడికేం బాధ-కడుపునిండా మెక్క వచ్చిండ్లు ఫ్యాన్లక్రింద కూర్చొని ఏం బాతఖాని గొడుతాండ్లో ఏమో?" టర్మినేషన్ చేయబడ్డ ఎంకటి అన్నడు.

'అగో! వత్తాండుగదా' అని ఎవరో అనెటప్పటికి అందరు లేచి ఒక కాడ జమ యిండ్లు. మంది ఎల్లిపోయి ఉండవచ్చుననుకొన్న లీడర్‌కు గుంపును చూడగానే కలవర మెత్తింది. లేని కోపాన్ని తెచ్చుకొని 'చూడండి కామ్రేడ్స్ మంచి మాటలతోని మనకు పనులు జరిగేట్టు లేదు. ఇంతకాలం ఓపిక పట్టినం ఇక సహించేది లేదు. 'కడుపు కాలేవాని బాధ కక్కతిన్నోనికేమెరుకన్నట్టు' ఇంతకాలము మంచిమాటతోనే చెప్పినా

మేనేజ్ మెంట్ మనుసుల కెక్కుతలేదు. కాబట్టి మేనేజ్ మెంట్ మొండి వైఖరికి వ్యతిరేకంగా మనం పోరాటం జరుపాలె, అంతకు మించి వేరె మార్గము అగుపిస్త లేదు కాబట్టి కామ్రేడ్స్, ఎల్లుండి నుండి మెడికల్ ఫిట్ అయిన వాళ్ళ పనిలోకి తీసుకోవాలని ఈ ఆఫీసు ముందే నిరాహార దీక్ష బూనాలె మనం పోరాటం చేయాలె' ఆవేశంగా అని లీడర్ 'నేను తొందర పనిమీద బాయి మీదికి పోతున్నా మీరంత రేపు యూనియన్ ఆఫీసుకు వచ్చి కలువుండ్లని' చెప్పి కారెక్కి ప్రయాణమయిండు.

o o o

జీతాలు చెల్లించే నాటికి ఒక రోజుముందు ఎప్పటి లాగే కార్మికులందరికి జీతాల వివరాలు తెలిపే చీటీలు ఎవరివి వాల్లకు పంచిండు క్లర్కు.

నెలంత కష్టపడి పనిచేసినందుకు రేపు తాము పొందబోయే జీతాల మొత్తాన్ని చూసుకోవటములో ఉబలాట పడుతుండ్లు కార్మికులు.

'నా జీతమెంతుందో చూడు, లాడీసులెన్ని ఏసిండ్లో? సిక్ లీవు బరాబరి కట్టిండా' ఇలాంటి వివరాలన్ని చదువురాని కార్మికులందరు తమ జీతపు చిట్టీలను చదువచ్చినోళ్ళకు చూపించుకొంటున్నరు.

కిరాణం దుకాణం కాతా, బట్టల దుకాణపువాడి అప్పు చిల్లర బాకీలు అన్ని కట్టుకోంగ ఈసారి గుడిసెను రిపేరు చేయాలను కున్నోల్లకు, జీతాలు దొరికినంక ఎక్కడివి అక్కడపోను ఇంటికిన్ని రూపాయలు పంపించాలను కున్నోళ్ళకు, ఈ నెలన్నా పోరగాండ్లకు బట్టలు కుట్టించాలను కున్నోల్లకు, ఇలా ఏవోవో వారి వారి అవసరాలను తీర్చుకోవాలని లెక్క లేసుకొని కుతూహలంగా ఉన్న కార్మికులకు వారి జీతాల చిట్టీలపై ఉన్న జీతం తెల్వంగనే ఒక్కసారిగా వాళ్ళ ఆశలు నిరాశలై పాలి పోయిన మొఖాలతో ఎవరికి వాళ్ళ గునుస్తున్నరు.

జీతాల రోజు బాయికాడనే బాకీలోల్లు వసూల్ల కత్తరు ఎవలకు బొంకాలె, ఎవలకు పంచాలె ఈ జీతాన్ని అని లెక్కలు వేసుకుంటు; ఇంకెన్నడొత్తయో జీతాలని ఎదురు చూసిన వాళ్ళకు ఎందుకు వచ్చెరా ఇప్పుడె జీతాలని పగారు చిట్టి చూడంగనే బెంగటిల్లు తాండ్లు.

ఉన్నట్టుండి కార్మికులల్ల కలకలం బయలుదేరింది బదిలీ పిల్లరోల్లకు జీతం సరిగ కట్టక తక్కువ దొరికిందని 'నాకు తక్కువ కట్టిండ్లంటే' నాకు తక్కువ ఉన్నదంటు' ఇరువైమంది దాక బదిలీ పిల్లర్స్ కల్సి సంగతేందో తెల్సుకొని వస్తాం పదంటు ఆఫీసువైపు దారి తీసిండ్లుగా మందిలెవడో కంపినోల్ని తిడుతాండు.

అట్ల కదిలిన కార్మికులు పేషీటురైటర్‌ను అడిగిండ్లు జీతమెందుకు తక్కువొచ్చిందని దాంతో బదిలి పిల్లర్స్‌కు క్యాజువల్ లీవ్ కట్టలేదని తేలింది.

పర్మినెంటు లాడిస్ కార్మికులు, మిగితా క్యాటగిరి కార్మికులందరు పనుల్లోకి వెలుతుంటే, బదిలీ పిల్లర్ జమయి క్యాజువల్ లీవెందుకు కట్టలేదో పోయి మేనేజర్ను అడుగుతాం పదండి' దాంతో అందరు మేనేజరు దగ్గరకెళ్ళి అడుగుతే పర్మినెంట్ గాని వారికి క్యాజువల్ దొరకదని చెప్పిండు. దాంతో కార్మికులు నిరసన తెలుపుతు బదిలి పిల్లర్స్ అంతా పనులు బందుచేస్తూ ఇంటిదారి పట్టిండ్లు.

తిరిగి రెండవ షిఫ్టు, మూడవ షిఫ్టు బదిలీ పిల్లర్సు రెండవ రోజు బాయి మీద కార్మికులంత జమ కావడంతో బావి పరిసర ప్రాంతమంతా కార్మికులతో కిక్కిరిసి పోయింది.

కంపిని లారీమీద వచ్చిన పోలీసులు తుపాకులు పట్టుకొని, లాఠీలు ఊపు కుంటూ మర్రిచెట్టుకింద నిలబడ్డరు.

అంతవరకు గుంపులు గుంపులుగా చేరి చర్చించుకుంటున్న కార్మికులు లీడరు కారు రావడముతోనే కారుచుట్టు గుమిగూడిండ్లు.

లీడరు చుట్టు గుమికూడినోల్లు ఏం మాట్లాడుతున్నది దూరంగ నిలబడ్డోల్లకు అర్థమైతలేదు.

అక్కడక్కడ నిలబడ్డ కొందరికి అండర్ మేనేజర్లు, ఓవర్‌మెన్‌లు 'బాయి లకు దిగుండ్లని' నచ్చచెప్పుతున్నరు.

చుట్టు గుమికూడిన కార్మికుల నుద్దేశించి 'జీతాలు తక్కువ గడితే తర్వాత తిరిగి లెక్కలు చేయించి సరిచేయించక పోయినమా ? దగ్గుతే పెత్తుతే స్టయికెనా' లీడరు చీకాకుగా అన్నడు.

"లెక్కలు తప్పేదెంది సార్ క్యాజువల్ లీవు బదిలి పిల్లర్సుకు కట్టరని మేనేజర్ చెప్పబట్టె, ఇంకేమి లెక్కలు చూత్తరు' లోపి సంకలపెట్టుకొన్న వీరాస్వామి మందిలనుంచే లీడర్ను అడిగిండు.

"లీవు ఉనోళ్ళకు ఇవ్వనసటానికి వాడెవడు మన ఎర్ర జండా యూనియన్ పోరాడి సాధించింది, ఈ క్యాజువల్ లీవు దొరకదు అనటానికి ఎవ్వనికి హక్కు లేదు, మేనెజరు అట్ల ఎట్ల అన్నడో పోయి కనుక్కొని వస్తా" అంటూనే మేనేజర్ గదివైపు కదిలిండు.

"తుపాకి రాముడొచ్చిండు....యింకేమి....పని అయినట్టె" ఎవడో కార్మికు డంటాడు గొణిగినట్టు ఎల్లబెట్టి.

యింకెవడో ఆపీసునుండి బయటికి వచ్చినంక లీడరేమి చెపుతడో మున్దె చెపుతాండు అనుభవం మీద.

మేనేజర్ గదిలోకి పోయిన లీడరు పావుగంటలోనే బయటికి వచ్చిండు—నవుకుంటు. ఆపీసు ముందున్న గద్దెమీది కొచ్చి 'కా(మేడ్స్, వేజిబోర్డులో మేనేజిమెంటుకు మన యూనియన్‌కు జరిగిన ఒప్పందం ప్రకారము కార్మికులందరికి క్యాజువల్ లీవు రావాలె, కానింకా పై ఆపీసునుంచి సర్క్యులర్సు రాలేదట. మేము మాత్రం లీవు అందరికి వర్తించాలని బల్లగుద్దినట్టు వాదించినం. ఆలస్యం పనికి రాదన్నం.... కంపెనికి మన యూనియన్‌కు కొత్తగూడెంలో చర్చలు జరుగుతున్నయి రేపు వచ్చే వారంల మల్లి చర్చలున్నాయి.....ఇప్పుడు పర్మినెంటు వాళ్ళంతా లీవులు పెట్టుకో వచ్చు....సర్క్యులర్స్ వచ్చిన తరువాత బదిలీవోల్లకు ఎరియర్స్ కట్టిస్తరు.''

మాటల మధ్యలనె బదిలిపిల్లగాడు ఒకడు ''ఇంకా ఎన్నెల్లకు వస్తయి సార్ సర్క్యులర్సు. ఒప్పందమై ఏండ్లు గడిచినా యింకా వస్తనె ఉంటయా? అసలింతకు ఈ బదిలి పిల్లర్సును పర్మినెంటు చేసెదున్నదా లేదా? 190 హాజర్లు ఉంటే పర్మినెంటు చేయాలని ఖానూన్ల ఉందని చెప్పితిరి.....నేను వస్లకెక్కి మూడేండ్లాయే. మూన్నెల్ల కోసారి టర్మినేషన్ ఆయె....యింక పర్మినెంటు ఎప్పుడు?''. బక్కపలచని, ఎర్రటి మొఖం జేవురించగా పొంగ అడిగిండు.

దాంతో అక్కడ పర్మనెంట్ కాని బదిలి పిల్లర్సుకు లీవు గురించి సాగుతున్న సమస్యకి కొత్త పర్మినెంటు సంగతి కూడ చేరింది.

అంతలోకె లబ్బ పెదవులోడు 'ఓ మిషన్ ఖాయం లేదు. స్పేర్ స్పేర్ అని అడ్డమైన పని జేయిస్తాండు, ముసలోల్ల మయ్యేదాక యింక పర్మినెంటే కాదా?'

"సర్వీసు దొరకదు, యాక్టింగ్‌కు తగ్గట్టు క్యాటగిరి కట్టియ్యరు. ఎల్.టి.సి. బాపతు పైసలు ఎగ్గొడుతాండ్లు'' ఆవేశంగా అంటాండు వీరాస్వామి.

సమస్య చేయిదాటి పోతుందని లీడరుకు కలవరం పుట్టింది. కార్మికుల్లో అలజడి ఎక్కువైంది. 'పర్మినెంటు చేసెదాక పనులకు పోయేదిలేదు' కొంద రంటుంటే వెల్‌ఫేర్ ఆపీసర్‌తో వాదులాడుతాండ్లు మరికొందరు.

కార్మికుల వ్యవహారం చూస్తుంటే లీడర్‌కు కోపమొచ్చింది. మనసులోనే తిట్టుకొని బయటికి మాత్రం ''మీ పర్మినెంట్ గురించి కన్సిలేషన్ల పెట్టినం. అందరికి పర్మినెంటు చేయించే బాధ్యత మాది''

అందరి దృష్టి లీడర్‌వైపు మరిలింది.

"అన్నిటికి కన్సిలేషనే, కన్సిలేషన్ల కెట్టి ఇదివరకేమి సాధించి తెచ్చిండ్లు ఈ మూడు నాలుగేల్లనుండి మేము నష్టపోయింది సాదించు కొస్తావా" మందిలనుండి మాట్లాడిండెవడో.

'ఈ చదువుకున్న పొరగాండ్లు జాయిలపని చెయ్య చాతగాక చీటికి మాటికి సమ్మెలు చేపిస్తాండ్లు, కార్మికులనందరిని రెచ్చగొట్టు కుంటున్నరు. ఈ రాడికలోల్లు వచ్చి నాల్గురోజులైతలేదు. మా ఎర్రజెండా యూనియన్ నాయకత్వాన సాదించిన హక్కులు వీళ్ళకేమెరుక, మేం గూడ ఒకప్పుడు తుపాకి పట్టి పోరాడినం, నిన్న మొన్న కండ్లు తెరిచినోల్లకేమెరుక మా ఎర్రజెండా యూనియన్ గురించి పాత కార్మికుల నడుగుండ్లీ తెలుస్తది' అంటు 'ఏరి మా పాత కార్మికులంటు' వెనక్కి తిరిగిండు లీడరు.

'మా తాత నేతులు తాగిండ్లు మా మూతులు వాసన సూడుండ్లీ' అన్నడట ఎనకటికి ఎవడో, నువు ఎప్పుడేంజేసినవో మాకు మాగెరుకే బొక్కనోరు కొమురయ్యా నుద్దేశించి 'ఓ పాత కార్మికుడా ఈయన మీకేమి సాదించి పెట్టిండో చెప్పరాదు.'

మందుగుటక డబ్బాలకాడ నిలుచున్న కోల్‌కట్టర్ కొమురయ్యా 'అఁ మాజేసిండు. మాకు క్యాటగిరి పెంచుతామని చెప్పి మిషిన్‌కు ఆరుగురు పన్జేసేకాడ నల్గుర్ని చేసిండు మందు గుటుకలు పెంచిండ్లు, 4 పీట్ల మిషన్ రాడును ఆరు పీట్ల పొడుపుకు పెంచిండ్లని' బొక్క నోట్లో ఉన్న పొగాకు ఉంచిండు తుపుక్కున.

వీరస్వామి మళ్ళి అందుకున్నాడు 'మాసిండ్లా లీడర్లు చేసిన ఘనవిజయం క్యాటగిరి పెంచి పిచ్చినమని ఆరుగురు చేసే పనిని నలుగురు చేసెతట్టుచేసి కంపనో నికి ఇద్దరు కార్మికుల జీతాలు మిగిలెటట్టు చేసిండ్లు, దాంతోపాటు మందు గుటకలు మోసుడు పెరిగింది, అంటే వీల్లు సాధించిన ఘనవిజయం కార్మికుల కంటే కంపినికె లాభించింది. అట్లున్నయి వీల్ల పనులు'

లీడర్ కోపం తారస్థాయి నందుకుంది, కాని ఈ పరిస్థితిలో శాంతమే ఎంతో అవసరమనుకొని లేని శాంతాన్ని మొఖంలోకి తెచ్చుకొని 'మాశండి కామ్రేడ్స్ వీళ్ళు యువకులు ఆవేశం ఎక్కువ ఆలోచన తక్కువ, కార్మికుల చేత సమ్మె చేపిస్తైనే కాదు, సమస్యను ఎట్లా పరిష్కరించాలో ఆలోచించరు. మేనేజ్‌మెంట్ అన్యాయం చేస్తలేదని నేను అనటం లేదు, అన్యాయాన్ని కట్టుగుండి మనమంత ఎదురించాలి. దేనికైనా ఓ పద్దతుంటది. ఖానూను ప్రకారం మనం కొట్లాడాలె, మన సమస్యలేమిటో వ్రాసి యిచ్చి ఒప్పుకొకపోతే సమ్మె చేస్తమని పద్నాల్గు రోజుల

ముందు సమ్మె నోటీస్ ఇవ్వాలె. మనం చేసె పద్ధతి ప్రకారం చేసినా కంపినోల్లు మొండిగానే ఉన్నరనుకో అప్పుడు తప్పకుండా చేయాల్సి ఉంటుంది. అన్ని అవకాశాలు చూసినంక మనకున్న ఆఖరి ఆయుధము సమ్మె ఉండనే ఉన్నది." లీడరు కాస్త ముందుకు జరిగి వీరస్వామి బుజంమీద చేయ్యేసి చెప్పుకొచ్చిండు.

"నీయవ్వ దొంగలు పడ్డంక అర్నెల్లకు కుక్కలు మొరిగినయట.... ఆకరిది లేదు మొదటిదిలేదు, ఎప్పుడొచ్చినా రెండు అడుగులు వెనుకకే అనిరి, నోటీసు పెట్టిన మనిరి, నువు నోటీసులిచ్చి సాదించి కొచ్చిందెన్నడు?....నోటీసులె ఇచ్చుకో నోట్లనే పెట్టుకో పాండ్లిర పాండ్లీ" అంటు బక్క ఎంకులు ల్యాంపు రూమ్‌కేసి నడిచిండు.... మిగత కార్మికులంతా అతనెంట నడిచిండ్లు.

కార్మికులంతా అక్కడినుండి ఎల్లిపోయారని నిర్ధారించుకున్నంక 'చీఁ చీఁ దినం దినం లాడీసొల్లు గొర్ల లెక్క తయారై తాండ్లుసారు, వాళ్ళకు ఒగలు చెప్పితె యినరు' లీడర్ మనిషి ఒకడు లీడరుతో అంటాండు.

"గిదానయ్య లీడర్ గిరంటే నాలుగు రోజుల కోసారి అయిందానికి కానిదానికి సమ్మెలు చేయించడం" ఎవరికి తోచినట్టు వాళ్ళు అంటాండ్లు లీడర్ చుట్టు జమయిన ట్రాపర్లు టింబర్ మెన్‌లు.

'నా ఇరవై ఏండ్ల సర్వీసులో మరీ ఇంతటి మూర్ఖత్వాన్ని ఎన్నడు చూడలేదండి' అంటు లీడరు దగ్గరికొచ్చిండు వెల్‌ఫేర్ అఫీసరు.

"వెనుకొచ్చిన కొమ్ములు ముందు పుట్టిన చెవులను ఎక్కిరించినట్లు....పిల్ల కాకి కేం యెరుక ఉండేలు దెబ్బ.... ఎంత గనము ఎగురుతరో ఎగరనియి అదిగూడ చూస్త" వెళ్ళిపోతున్న కార్మికులవైపు చూస్తు అక్కసుగా అంటుండు లీడరు.

'ఆఁ ఎంతదూరమండి తొంత పరుగు ఎనుగుల్దాకన్నట్టు మూడు రోజులైతే చచ్చినట్టు వాళ్ళె దిగుతరు' హెడ్ ఒవర్ మెన్ నర్సింహ మంటాడు.

గేటు బయిట కొందరు యువకులు పాటలు పాడుతూవుంటే గేటు దాటుతున్న కార్మికులందరు తిరిగి అక్కడ గుంపు గూడిండ్లు.

ఊరిదొరా బావిదొరా
లీడరోడు సర్కారోడు
దోసుకునే దొంగలంత
ఏడ ఉన్న ఒక్కటేను
దోపిడోల్ల రాజ్యమాయెరో ఓలాడిసన్నా
దోపిడోల్ల తోడురారురో ఓ కార్మికన్న

గా పాటలు విసరాంగనే లీడరు చుట్టు నిలబడివున్న మస్టర్ వర్కర్లందరు లాఠీలు కార్మికుల గుంపు దిక్కు దారితీసిండ్లు.

పాట పాడుతున్నాల్లు ఉన్నట్లుండి "కార్మికుల ఐక్యత" అని ఒక్కరు గట్టిగ అరువంగనే "వర్ధిల్లాలి" అని అందరన్నరు. 'బదిలీ పిల్లర్లందరిని-వెంటనే పర్మినెంటు చేయాలి' 'క్యాజువల్ లీవులు చెల్లించాలి' కార్మికుల గుంపు కదలింది.

పోలీసోల్లు లారీ ఎక్కిండ్లు

మేనేజరు గదివైపు దారి తీసిండు లీడర్.

○ ○ ○

మూడు రోజుల వరకు సమ్మెను కొనసాగించిన కార్మికులు ఇతర బావులకు సమ్మెను విస్తరింప చేయడానికి సిద్ధమైండ్లు.

మాటలు చెప్పి నమ్మించి సమ్మెను విరమింప చేయాలని ప్రయత్నించి విఫల మైన యూనియనోల్లు కొంతమందికి త్రాగించి దింపించేందుకు సిద్ధమైయిండు.

కల్లు బట్టీలో కల్లు పెట్టెలు కాళీ అయినయి. 'డెయించోత్ ఇవ్వాల ఎవ్వడాపు తడో సూత్తం సెకండ్ సిఫ్టుల బాయిని నడుపుదే.... సారుమీకెందుకు....మేం చెప్పు తానం గదా ఎవ్వలు దిగినా దిగకున్నా మా గ్యాంగులను దింపిత్తం' సొలుక్కుంట లీడరుకు మాటిచ్చి బాయివైపు నడిచిండ్లు.

కార్మికులలో లొల్లిపెరిగింది 'లంజ కొడుకులు ఎవడు దిగుతడో దిగనీ.... డైయించోత్ చెమ్మసులతో నరుకుతం' అని కోపంతో కొందరంటె 'బూట్లు మెడకేసి తిప్పుదామని' ఇంకొందరన్నరు.

కార్మికులలొల్లికి కల్లుదాగి నోల్లకు నిషదిగింది' నీ యవ్వ అందరు దిగుతే అందరితోబాటు నేను దిగుతానని ఎవరికి వాల్లు మనసులో అనుకున్నరు.

కల్లు నిషాలగ్గినా 'ఎవ్వడేం పీకు తడో సూత్తనంటు తట్టా చమ్మాసు బుజా నేసుకొని బాయి వైపు నడిచిండు మొండిలింగయ్య.

వీడెంత దూరం పోతడో పోనీ అనుకునోల్లు నిజంగా బాయిలకు అడుగు పెట్టెసరికి ఓపిక నశించింది.

'గాడ్డి కొడుకును గుంజుకరాండ్లని' ఎవ్వలో మందిలనుంచి అనంగనే ఒక్క రెనుక అందరు ముందు కురికిండ్లు.

మందిని చూసిన లింగయ్య తట్ట చమ్మాసు పారేసి ఎనుగు దాటి ఉరుక దగిలిండు-కాని కార్మికులు విడిచిపెట్టలే. లింగయ్యను పట్టుకొని గేటువైపు గుంజుక

పోయిండ్లు. లింగయ్య ఎంత గింజులాడుకున్నా విడిచి పెట్టలేదు. అక్కడే ఏనుగు తీగకు కట్టిన పాత బూట్లదండ మెడల పడ్డది లింగయ్యకు.

బూట్లు మెడలేసిండ్లే తప్ప ఎవ్వలు కొట్టలేదు లింగయ్యకు ఈ శిక్ష సాలను కున్నరు. తిరిగి ఊరేగింపు బయలు దేరింది ఏజంట్ ఆఫీసువైపు.

ఏజంట్ ఆఫీసు ముందున్న చెట్ల క్రింద తడుకలుగట్టి పందిరేసి, నాలుగు దిక్కుల నాలుగు ఎర్రజెండలు కట్టి ఉన్నాయి. ముందు బాగా ఎర్రగుడ్డమీద "ట్రెయినింగ్ అయినవారికి వెంటనే పని కల్పించాలి", "A I T U C జిందాబాద్" అని తెల్లక్షరాలలో వ్రాసి కట్టి ఉన్నది. పందిరికింద కొందరు బొట్టు పెట్టుకొని మెడను దండలేసుకొని కూర్చున్నారు. ప్రక్క పొంటె బెంచీమీద లీడర్‌తోపాటు ఇంకొంత మందికూర్చుని మాట్లాడుతాండ్లు.

ఊరేగింపు ఏజంట్ ఆఫీసువైపు మరలడంతో లీడరు అక్కడనుంచి లేచి ఆఫీసులోకి దారితీసెండు.

ఆఫీసు గేటుముందాగిన కార్మికులు ఆఫీసు దనించేలా నినాదాలు పలికిండ్లు.

కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి
మేనేజిమెంటు దౌర్జన్యం నశించాలి
బదిలీ పిల్లర్లను పర్మినెంటు చేయాలి
క్యాజువల్ లీవులు కట్టివ్వాలి
దొంగ లీడర్లు నశించాలి
పోరాడేవానిదే ఎర్ర జెండా

రాయమల్లు అంతలోనే పాటందుకున్నాడు—

పల్లెపల్లెన పోరుబాటలు ఎర్రనీ శ్రీకాకుళము
నాడు అక్కడ రగిలి రగిలి నేడు ఇక్కడ మండుతంది
పోరుబాటలో పోదామా బావయ్యో బంగారయో
ఎర్రతోవలో మనం పోదామా వీరుడో గని కార్మికా

గీపాటలు వినస్తాంటే తడకలక్రింద కూర్చొని నిరాహారదీక్ష పట్టినోల్లకు ఉండబుద్ధికాక లేచి మందిల కచ్చిండ్లు.

ఏజంట్ ఆఫీసులున్న గుమస్తాలు బయటకి రాలేక కిటికిల్లనుంచె బయటికి చూస్తాండ్లు.

పోలీసోల్లు తుపాకులు పట్టుకొని గేటుకాడ నిలబడ్డరు. పాటలు బందు కాంగనే వీరాస్వామి మందిల నిలబడి ఉపన్యాస మిచ్చిండు.

వీరాస్వామి ఉపన్యాసమయిపోయినంక ఎన్ని రోజులైనా మంచిదే. బాయిల రోల్లకు చిలుం పట్టినా సమస్య తీరేదాక దిగేదిలేదని అనుకుంటు ఇండ్ల దారిపట్టిండ్లు కార్మికులు.

లోపల సూపరిన్‌టెండెంట్ గదిలో "మీరు చేయబట్టి వ్యవహారము ఎంత దూరం వచ్చిందో చూడండి" అన్నాడు లీడరు విచారంగ మొఖం పెట్టి.

"మేం చేసిందేముంది. ఏమైనా అడిషనల్ జనరల్ మేనేజర్ను కల్సి మాట్లాడుదాం పదండి" అటు సూపర్‌డెంట్ శాస్త్రి, లీడరు ఎ.జి.యం. రూములో కెళ్ళారు. వెళ్ళినోళ్ళు గంటవరకుగాని తిర్గిరాలేదు.

మరునాడు మొదటి షిఫ్టులో బావికాడ మూడు షిఫ్టుల కార్మికులు జమయిండ్లు. అంతలోనే వెల్‌ఫేర్ ఆఫీసరు బొంగురు గొంతుకతోని మైకుల మాట్లాడుతాండు కార్మికుల నుద్దేశించి.

"ఇందు మూలంగా కార్మికులకు తెలియజేయునది ఏమనగా బదిలీ పిల్లర్లకు ఒక్కొక్కరికి '7' రోజుల క్యాజువల్ లీవు ఇచ్చేందుకు మేనేజుమెంటు వారు ఒప్పుకున్నారు. కాబట్టి కార్మికులందరు పనిలోకి పోవాలని మనవి చేస్తున్నాము." మళ్ళీ "ఇందుమూలంగా........అరిగిపోయిన రికార్డులా వెల్ఫేర్ ఆఫీసరు మళ్ళీ మళ్ళీ చెప్పుతూనే ఉన్నాడు.

కార్మికులకు ఉత్సాహం వచ్చింది. మాటలు బందుజేసి ఇంటాండ్లు. 'కొందరంటాండ్లు, 'మరి బదిలీ పిల్లర్ల పర్మినెంటు సంగతేం తేలింది.'

"బదిలీ పిల్లర్ల పర్మినెంటు గురించి లిస్టు తయారైతాంది. రేపో మాపో అది కూడ అయితది." యూనియన్ల తిరిగె అలీ అన్నడు.

ఇంకేంది.... పాండ్లీ పాండ్లీ బాయిల ఓవర్‌మెన్ హెడ్ వచ్చి వర్క్‌డిస్ట్రిబ్యూషన్ చేసేందుకు తొందరపడుతు అన్నడు.

కార్మికులు పనుల్లోకి వెళ్లేందుకు నిశ్చయించుకొని బావివైపు కదిలిండ్లు. అంతలోనే లీడరు కారులో వచ్చి 'బావివైపు పోతున్న కార్మికుల ముందుకొచ్చి 'కామ్రేడ్స్ బదిలీ పిల్లర్లకు గూడ '7' రోజుల క్యాజువల్ లీవు ఇచ్చేందుకు మేనేజుమెంటును ఒప్పించినం.... పర్మినెంటు అయినంక అందరిలాగే పదకొండు రోజులు క్యాజువల్

లీవు దొరుకుద్ది. ఇకపోతే పర్మినెంటు గురించి నిన్ననే కన్సిలేషన్ పెట్టినం త్వరలోనె పర్మినెంటు లెటర్లు వస్తయి' విజయ గర్వంగా చెప్పుకొచ్చిండు లీడరు.

"వీన్నెవ్వడు పిల్చిండ్రా"

"ఏమేమి వచ్చినయో మాకెరుకలేదా"

"ఎక్కడా నువు కొట్లాడింది" మంది మాట్లాడుతాండ్లు.

'నువ్వు బాయి మీదినుండి ఎల్లిపోతేనే మేం బాయిల దిగుతం' సన్నగడ్డపోడు లీడరు మొఖం మీదన్నడు.

'ఏయ్! ఎం మాట్లాడుతానవ్' లీడర్ గరాని కొచ్చిండు.

అంతలోకె వెల్ఫేర్ ఆఫీసరొచ్చి లీడర్‌ను సముదాయించి బయిటికి పంపిండు. కార్మికులు బావిలోకి దిగిండ్లు.

సమ్మె విరమణ జర్గి పదిహేను రోజులైంది.

ఆ రోజు మొదటి షిఫ్టులో డ్యూటికొచ్చిన వీరస్వామితో పాటు మరో యిద్దరికి బదిలీ పిల్లర్లకు వేలి ముద్రలేయించు కొని తలా ఒక్క లెటర్ చేతికిచ్చిండు మ్యాన్‌వే క్లర్క్. మిగితా రెండు షిఫ్టులల్ల నుండి కూడ నల్గురు బదిలీ పిల్లర్లకు కూడ అలాంటి లెటర్స్ ఇచ్చిండ్లు.

అందులో 'కార్మికులు సమ్మెలు చేయడం వలన ఉత్పత్తికి నష్టమొచ్చిందని. కార్మికులను రెచ్చగొట్టి చట్టవిరుద్ధమైన సమ్మెలు చేపించినందుకు గాను, సమ్మెకు మీరే కారకులంటు' వీరస్వామికి చార్జిషీటు మాత్రమే యిచ్చి మిగితా ఆర్గురు బదిలీ పిల్లర్స్‌కు లాంగ్ టర్మినేషన్ లెటర్ ఇవ్వడం జరిగింది.

ం ం ం

కాళీ అయిన బదిలీ పిల్లర్స్ స్థానంలో నిరాహారదీక్ష బూనుతున్న వాల్లకు పిలుపులొచ్చినయి.... లంచాలిచ్చినోల్లకు ఇంటర్వ్యూలొచ్చినయి.... యింటర్వ్యూ అయినోల్లకు డాక్టర్ ఫిట్‌కు పంపించిండ్లు.

మానవతా విలువలు :

వ్యవస్థతో, కరువుతో పోరాడుతున్న ఆదిలాబాదు ఆదివాసులు

కె. బాలగోపాల్

ఇందిరమ్మ సోషలిజం ఎందాకొచ్చిందిరో
ఇంద్రవెల్లిలోన వందమందిని మింగిందిరో

ఇందిరమ్మ తండ్రి సోషలిజం తెలంగాణాలో కొన్నివేలమందిని మింగింది. ఇందిరమ్మ సోషలిజం ఇంద్రవెల్లిలోను గువాలోను ఇంకా మనకు పేర్లుగూడా విన బడని ఎన్నో మారుమూల గ్రామాలలో, గూడాలలో గిరిజనులను అసంఖ్యాకంగా మింగింది, మింగుతోంది. కాంగ్రెస్ సోషలిజపు ఆకలి గిరిజనులతో సంతృప్తి చెందేది కాదుగాని, ఎ. కె. రాయ్ అన్నట్టు అది గిరిజనులను మింగినంత సులువుగా ఇతరులను మింగలేదు. సాధారణ మధ్య తరగతి దృక్పథంలో గిరిజనులు తాగు బోతులు, 'డబ్బు విలువ' తెలీని వాళ్ళు. బ్రతికి స్తే అమ్ముకుంటారు. గొర్రెలిస్తే వండుకుతింటారు. ఏమంటే ఈ రెలు, బరిసెలు తీసుక మీదపడతారు. గిరిజన స్త్రీలకు 'శీలం' ఉండదు. వాళ్ళ శరీరాలమీద పై కులాల మగవాళ్ళకు సహజ అధికారం వుంది. భోగ వస్తువులుగా వాడబడడం వాళ్ళకు బాధగాని, అవమానంగాని కలిగించదు. ఎందుకంటె వాళ్ళసలు మనలాంటి "సంస్కారవంతులు" కారు. ఒరిస్సాలోను, బీహార్‌లోను బస్తర్‌లోను ఫారెస్టు అధికార్లుకాంట్రాక్టర్లు తమఊళ్ళలో పతివ్రతలయిన పెళ్ళాలనుంచుకొని, వాళ్ళపాతివ్రత్యాన్ని కాపాడడానికికావలసిన సాంస్కృతికమయిన కట్టుబెట్టాలు చేసి, గిరిజన ప్రాంతాలలో తమ భౌతిక అవసరాలు తీర్చడంకోసం గిరి జన స్త్రీలను వంచించి 'పెళ్ళి' చేసుకుని, బదిలీ అయినప్పుడో వేరేచోట కాంట్రా క్టులు చిక్కినప్పుడో ఆ స్త్రీని, ఆమెకు పుట్టిన పిల్లలను, వాళ్ళ పాట్లకు వాళ్ళను వదిలి వెళ్ళిపోయిన కేసులు అసంఖ్యాకం. భౌతిక అవసరాలకే కాదు, ఆస్తికిగూడ గిరిజన స్త్రీలు పనికివచ్చారు. చాలా గిరిజన ప్రాంతాలలో గిరిజనేతరులకు చట్టరీత్యా భూమి కొనుక్కునే హక్కు లేదు. అయితే చాలా గిరిజన తెగల్లో మాతృస్వామికపు అవ శేషంగా స్త్రీలకు ఆస్తిహక్కు ఉండడం చేత, గిరిజన స్త్రీలను 'పెళ్ళి' చేసుకుని గిరి జనుల భూములను ఆక్రమించుకున్న కేసులూ ఉన్నాయి.

ఇదంతా కొత్తేం కాదు. అర్జునుడు, భీముడు మొదలయిన పురాణ హీరోలు 'నాగరాజ కుమార్తెల'ను, 'గంధర్వస్త్రీ'లను పెళ్ళి చేసుకుని నాలుగేళ్ళపాటు 'నాగ లోకం'లోనో 'గంధర్వలోకం'లోనో నివసించి తిరిగి వచ్చారని చిన్నతనం నుండీ చదువుకున్నాం. ఆ 'గంధర్వులూ' 'నాగజాతులూ' గిరిజనులు. నాగరిక వర్గ సమాజానికి చెందిన ఆర్యులు ఆర్యేతరులను బలవంతంగా నాగరీకరించిన క్రమంలో ఇదొక భాగం. ఆ బలవంతపు నాగరీకరణ ఈనాడూ సాగుతోంది. ఆనాటి పురాణ హీరోల వారసత్వం ఈనాటి ఠాకూర్ భూమిహార్ బ్రాహ్మణ హీరోలకు సంక్రమించింది. తేడాఅల్లా, ఈనాటి గిరిజనులు రెండువందల సంవత్సరాల సామ్రాజ్యవాద దోపిడీవల్ల ఆనాటికంటె నికృష్టమయిన జీవితం గడుపుతున్నారు; అంతేకాకుండ ఈనాటి నాగరీకరణ ఫ్యూడల్ రూపంలో కాక పెట్టుబడిదార్ల రూపంలో రావడంవల్ల మరింత దౌర్జన్యంగాను హింసాత్మకంగాను సాగుతోంది.

ఈ వాతావరణంలో గిరిజనేతర ప్రపంచం, గిరిజనులపై జరిగే దౌర్జన్యాలను, కసాయివాడి చేతిలో పశువులపై జరిగే హింసను చూసినంత నిర్లక్ష్యంగా చూడగలుగుతుంది; అందుకే ఈ వాతావరణంలో గిరిజనులపై దౌర్జన్యాలు చాలా సులువుగా సాగించగలరు—సాగించేవారు కాంట్రాక్టరుగాని, వడ్డీవ్యాపారస్తులుగాని, ఫారెస్టు అధికారులుకానీ, భూస్వాములు గాని, వీళ్ళందరి సాయుధ సేవకులయిన పోలీసులు గానీ.

మార్కెట్ల విస్తరణకోసం, ముడిసరుకుల కోసం, జరిగే బలవంతపు నాగరీకరణను సాధించడానికేగాదు, ఆ బలాత్కారానికి వ్యతిరేకంగా గిరిజనులుచేసే తిరుగుబాటును అణచడానికి గూడ పాలకవర్గాలకు ఈ దౌర్జన్యాలు అవసరం. అడవులను కాంట్రాక్టర్లకోసం, వాళ్ళనుండి వెదురుబొంగు కొనుక్కునే బిర్లాల పేపరుమిల్లుకోసం, సురక్షితం చేసినప్పుడు, ఆ అడవుల రక్షణార్థం 15000 మంది గోండ్లను తమ భూములనుండి తరిమేసినప్పుడు, వాళ్ళకు విపరీతపు వడ్డీకి అప్పులిచ్చి ఆ అప్పులు వాళ్ళు తీర్చలేకపోగా వాళ్ళ భూమిని గిరిజనేతరులు కాజేసినా Tribal Land Alienation Act లు కళ్ళు మూసుకున్నప్పుడు, ఆదిలాబాద్ గిరిజనులు తిరగబడ్డారు. వాళ్ళు తిరగబడ్డప్పుడు పోలీసులు వచ్చారు. చెట్లమీద కూర్చుని కాల్పులు జరిపి, వందమందినో ఎందరినో (దేవుడుంటే దేవుడెరుగుగాని, వాడు లేడు కాబట్టి గోండ్లయినా ఎరుగుదురో లేదో) చంపారు.

అది గత ఏప్రిల్ 20 న. అటు తరువాత, వ్యవస్థ దౌర్జన్యానికి ప్రకృతి దౌర్జన్యం గూడ తోడయింది. గత కొద్ది మాసాలుగా ఆదిలాబాద్ అడవి ప్రాంతాలలో ఎన్నడూ లేనంతటి కరువు తాండవమాడుతోంది. వర్షాలు లేక రబీ పంట, ఖరీఫ్ పంట, రెండూ నాశనమయ్యాయి. మామూలుగానే నికృష్టమయిన గిరిజనుల తిండి మరింత నికృష్టమయింది. పరిస్థితిని ప్రత్యక్షంగా చూసిన వారి రిపోర్టుల ప్రకారం అక్కడి గిరిజనులు ఈ కరువు కాలంలో తినని పదార్థం లేదు. ఇప్పపూలు, రేగుపళ్ళు, పరికిపళ్ళు, కంకబెనాలు, మేకలు తినే దొండ్రకాయలు, తింటున్నారు. తినలేని గింజలను ఉడికించి గంజికాచుకుని తాగుతున్నారు. కరువు ఫలితంగా జొన్నపంట పూర్తిగా దెబ్బతినిపోగా జొన్న బెరడు నమిలి రసం మింగి బెరడు ఉమ్మేస్తున్నారు. వట్టిఏ తింటే ప్రమాదకరమైన మాటి గడ్డలను మూడు నాలుగు సార్లు చింతాకుతో ఉడికించి చల్లార్చి తింటున్నారు. అడవిచెట్ల ఆకులు సహితం తింటున్నారు.

తినడానిక ఏమీ దొరక్కపోతే ఆకులయినా తినొచ్చుగాని, తాగడానికి నీళ్ళు లేకపోతే యమయాతనే. ఈ కరువు కాలంలో ఆదిలాబాద్ అడవి ప్రాంతాలలో గుక్కెడు మంచినీళ్ళ కోసం మైళ్ళు నడవాలట. మంచినీళ్ళు దొరికే గూడేలు ఎక్కడో గాని కనిపించవట.

పరిపాలనావ్యవస్థ రాక్షసత్వాన్ని ఈ కరువు అపూర్వంగా బయటపెట్టింది. ఒకపక్క స్థానిక అధికార్లు ఈ కరువుకాటకాన్ని అదను చేసుకొని గిరిజనులనుండి లంచాలు మింగుతూంటే వేరొకప్రక్క ఇందిరాకాంగ్రెస్ నాయకులు కరువును తమ ముఠా తగాదాలలో ఒక ఆయుధంగా వాడుకున్నారు. గోండ్లకోసం ప్రభుత్వం ఏమీ చేయలేదని, మన నిర్వ్యాపక పాత్రికేయులచేత 'అసమ్మతి వర్గీయుల'ని పిలవబడే వాళ్ళు ఆరోపిస్తే, ప్రభుత్వం చేసిందంతా లంబాడాలకే పోయిందన్న ధ్వని ఆ ఆరోపణలో వినిపించి కాంగ్రెస్ లంబాడా నాయకులు లేదులేదు ప్రభుత్వం చాలా చేసిందంటే, వెనుకటి ముఖ్యమంత్రికి ఆఆరోపణలో విదేశీహస్తం సహితం కనిపించింది.

అయినా, 4శాతం మాత్రం నీటి పారుదల సౌకర్యాలకు నోచుకున్న ఆదిలాబాద్ భూమి వర్షం లేక బీళ్ళు పడిపోయినా, పత్తిచేలూ, జొన్నచేలూ, బహుశా రేప ఇప్పచెట్లుగూడ ఎండిపోయినా, వాస్తవానికి ఆ బాధ్యత కేవలం ప్రకృతిది కాదు. ఆదిలాబాద్‌కు గోదావరి చేరువలో వుంది. ఆ గోదావరమ్మ పుణ్యానే తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలు 50శాతంపైగా నీటిపారుదల సౌకర్యాలు కలిగివున్నాయి. నదికి దగ్గరగావున్న ఆదిలాబాద్‌లో భూగర్భజలాలు పుష్కలంగానే వుండివుండాలి.

అయినా రిగ్గులు లేవు. బోర్‌వెల్సు లేవు—అందుకే భూమివున్న గిరిజనులు సహితం ఆకలికి మాడుతున్నారు. మాడుతారుగాని, వాళ్ళు ఆకలికి చావరు. వాళ్ళను ప్రకృతీ వ్యవస్థా కలిసి తిండికి మాడ్చి, దాహానికి ఎండించినా వాళ్ళు బ్రతికే వుంటారు—ప్రతీకారం కోసం బ్రతికే వుంటారు. బ్రిటిష్‌వాడు ఈ దేశానికి వచ్చినప్పటి నుండి వాళ్ళను వాళ్ళ అడవుల నుండి బయటికో లేక అడవి గర్భానికో తరుముతూనే వున్నారు. సంరక్షిత అడవులన్నారు, పరిశ్రమల కోసం అడవులన్నారు, ఏదన్నా దాని అర్థం గిరిజనుల అడవులను వాళ్ళకు కాకుండ చేయడమే. గిరిజన పోరాటానికి ప్రసిద్ధమయిన వైనాడు (కేరళ)లో ముప్పయి ఏళ్ళ క్రితం గిరిజనులలో 20శాతం మాత్రమే భూమిలేనివాళ్ళు. ఇవ్వాళ అక్కడ 80 శాతం భూమి లేనివాళ్ళు. అయినా అక్కడి గిరిజనులు ఆకలికి చావ లేదు, కొందరు పోరాటం చేసి చచ్చారు, బ్రతికి వున్నవాళ్ళు ఇంకా పోరాటాలు చేస్తారు.

1976లో (అంటే ఎమర్జెన్సీ కాలంలో, అంటే వోట్లకోసం దొంగనాటకాలు ఆడాల్సిన అవసరంలేని రోజుల్లో) నేషనల్ అగ్రికల్చరల్ కమిషన్ తన నివేదికలో, అడవులు ప్రధానంగా (కాగితం, కలప, ఇత్యాది) పరిశ్రమలకు ముడి సరుకులు సరఫరా చేయడం కోసం వుద్దేశించబడాలనీ, అందుకోసం అడవి ప్రాంతాల ప్రజలపై (వాళ్ళు గిరిజనులు కానీ గిరిజనేతరులు కానీ) అవసరమయిన ఆంక్షలు విధించాలనీ, అడవుల్ని ప్రజలే నాశనం చేస్తున్నారనీ, కాబట్టి పారిశ్రామిక పెట్టుబడిదార్ల లాభాల కోసం దేశంలోని 7.5 కోట్ల హెక్టార్ల అటవీ భూభాగంలో కనీసం 4.8 కోట్ల హెక్టార్ల భూభాగాన్ని (అంటే 65 శాతాన్ని) ప్రజల నుండి రక్షించి 'ఉత్పత్తి వనాలు' (Production forests)గా ప్రకటించి కలపపై ఆధారపడే పరిశ్రమల కోసం వాటిని వినియోగించాలనీ, చెప్పినమాట చాలామందికి తెలీదు.

దోపిడీ వ్యవస్థ జరిపే ఈ అమానుషమయిన వేటకు ప్రకృతి వైపరీత్యం తోడయినప్పుడే క్షామం ఏర్పడిందిగాని, కేవలం వర్షాలు పడక పోవడం వల్ల కాదు. చైనా విప్లవానికి పూర్వం విశాలమయిన ఆ దేశంలో ప్రతీ ఏడూ ఎక్కడో ఒకచోట క్షామాలు రావడం, జనం వందలలో వేలల్లో చావడం జరిగేది. విప్లవం వచ్చిన తరువాతి సంవత్సరంనుండి వర్షాభావం ఏర్పడ్డా క్షామాలు లేవు, క్షామపు చావులు లేవు. చైనా విప్లవ విజయాలలో అతి గొప్పది ఇదేనని ఎడ్గార్ స్నో అంటాడు.

అటువంటి విప్లవాన్ని ఈ దేశంలో రానీయకుండ చేయడం కోసమే ఇంద్రవెల్లి జరిగింది. ఆ ఎరుకతోనే ఈ ఏప్రిల్ 20న, ఇంద్రవెల్లిలో గత సంవత్సరం చనిపోయిన గిరిజన మృతవీరుల స్మృతికి స్థూపాన్ని నిర్మించి ఆవిష్కరించాలనీ, సంస్మరణ సభ జరపాలనీ, నిర్ణయించుకోవడం జరిగింది. ఈ సారి పోలీసులు వేరే ఎత్తుగడ వేసుకున్నారు. సభకు పర్మిషన్ ఇవ్వననలేదు. స్థూపం నిర్మించ వద్దనలేదు, 144 సెక్షన్ ప్రకటించ లేదు. స్థూపానికి భూమి కొనుక్కోనిచ్చారు. సభకూ ఏర్పాట్లు చేసుకోనిచ్చారు. అయితే స్థూప నిర్మాణానికి ఎవ్వరూ ముందుకు రాకుండ, సభకు గిరిజనులు రాకుండ చేయవలసింది చేసారు. స్థూపానికి సిమెంటు తెస్తే సిమెంటును, తెచ్చిన లారీని, 'కస్టడీ'లోకి తీసుకున్నారు. సభకు వారం రోజుల ముందు గూడెం గూడెం తిరిగి, క్యాంపులుపెట్టి, తుపాకీల ప్రదర్శనతో భయపెట్టి, గత సంవత్సరం గిరిజన రైతు కూలీ సంఘం సభకు హాజరయిన వేలాది గిరిజనులలో ఒక్కరు సైతం రాకుండ చేసారు. గిరిజనులలో సభను గురించి ప్రచారం చేయడానికి తిరిగిన యువకుల దళాలను మూడింటిని సిరికొండలో, ఆదిలాబాద్‌లో అరెస్టు చేసారు. రెండు దళాలను సెక్షన్ 506 కింద బుక్ చేసి మూడవదళాన్నిమాత్రం నిజామాబాద్ తరలించారు. మరికొందరిని ఇంద్రవెల్లిలో బస్సు దిగుతుండగా అరెస్టు చేసారు. అరెస్టయిన వారిలో ఒకరు రామగుండంకు చెందిన మొండయ్య అనే డ్రైవరు, అతనితో బాటు ఇద్దరు స్త్రీలు. మొత్తం అరెస్టయిన వారి సంఖ్య 38. ఇంకొందరిని బస్సు దిగగానే నిలిపి గదమాయించి 'ఎవడు పంపాడు మిమ్మల్ని? మా మీద పాటలు పాడడానికి వచ్చారా?' అని అడిగారు.

ఆనాడు ఇంద్రవెల్లిలో గ్రామ జనం కంటె పోలీసులే ఎక్కువ ఉన్నారు. కలెక్టరు, డిప్టికలెక్టరు, డి. ఐ. జి, ఎస్. పి ల నుండి సర్కిళ్ళు అమీన్ సాబ్‌లు మామూలు కానిస్టేబుళ్ళ వరకు ఆ వారం దినాలలో ఇంద్రవెల్లిని దర్శించని వాడు లేడు. 20 పొద్దున 200 మంది పోలీసులు గ్రామంలో మార్చ్ చేశారు—ప్రజల్ని భయపెట్టడానికి. ఇటూ అటూ ఉన్న గ్రామాలలో (పిట్టబొంగరం, గుడిహత్నూర్ వంటివి) పోలీసు క్యాంపులు పెట్టారు. హోటళ్ళలో పోలీసులు, చాయ దుకాణాల్లో పోలీసులు, రోడ్ సైడు కట్టలమీద పోలీసులు, చెట్లక్రింద పోలీసులు, ఆనాడు ఆ ప్రాంతం పోలీసుల మయం. ఫలితంగా అక్కడి గ్రామాల నుండి, కొంత ఆర్థిక స్తోమత గలవాళ్ళంతా ఆదిలాబాద్ పోగా మిగిలిన వాళ్ళు తలుపులు బిగించుకు కూర్చున్నారు. దూరప్రాంతాల నుండి సభకని పరిచయస్తులు వచ్చినా ఇండ్లో ఉండనీయలేదు.

పోతన పంచశతి ఉత్సవాలు :

'పశుపు కాదు'

వరంగల్‌లో మార్చిలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక, అధికార సహకారంతో జరిగిన పోతనపంచశతి ఉత్సవాలకు ఒక నిర్దిష్టమైన ఆశయముంఉన్నది. రాజులను, రాజరికాన్ని 500 సం॥లనాడే వ్యతిరేకించిన అభ్యుదయ కవిగా పోతనను గొప్ప చేసి అతని భాగవతంలోని భావాలను, సంస్కృతిని ప్రజల్లో ప్రచారం చేయడం వారి లక్ష్యం. పాలకవర్గ సంస్కృతిలో వచ్చిన సంక్షోభాన్ని నివారించేందుకు, ప్రజల్లో కలుగుతున్న చైతన్యాన్ని తట్టుకోవడానికి వారు చేసిన ప్రయత్నం ఇది.

తమకు ఇబ్బంది కలిగించి, సమాధానం చెప్పుకోవలసివచ్చే అంశాలను, రాజకీయాలను ప్రస్తావన లోనికి రానివ్వడం నిర్వాహకులకు యిష్టం కాదు. పోతనను అభ్యుదయ కవిగా గొప్ప చేయుడంకోసం, రాజులను, రాజరికాన్ని వ్యతిరేకించాడనే ప్రస్తావన నామమాత్రంగా వచ్చిందే కాని రాజరికమంటే ఏమిటి ? దాని స్వభావ

నిజానికి దూరప్రాంతాల నుండి ఎక్కువ మందిని రానీయలేదుగూడ. అనాడు మధ్యాహ్నం నుండి ఇంద్రవెల్లి మీదుగా వెళ్లే బస్సులను అటు ఉట్నూరు దగ్గర ఇటు అదిలాబాద్ దగ్గర ఆపేయించారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆదిలాబాద్ రావలసిన మంచిర్యాల ఎక్స్‌ప్రెస్ ఇంద్రవెల్లికి అవతల ఉట్నూరు దగ్గరే ఆగిపోయింది. సాయంత్రం అదిలాబాద్ నుండి బయలుదేరి ఇంద్రవెల్లి మీదుగా భీంపూర్ వెళ్లే 'అర్డినరీ' ఆదిలాబాద్‌లో బయలుదేరుతుండగా డిపో కంట్రోలరు ఆదరాబాదరా వచ్చి తానుపెద్దంటున్నా వినకుండ బస్సును బయటకు తెచ్చినందుకు డ్రైవర్ని నూలనాడి ఆపేయించాడు. సంక్షోభంలో 'ప్రభుత్వరంగం'పోలీసు రంగమవుతుందనడానికి ఇదొక చక్కటి నిదర్శనం.

అయినా సభ జరిగింది. హాజరయింది వందమంది లోపు కావచ్చు. ఒక్క గిరిజనుడూ లేకుండవచ్చు. కాని గిరిజనులు తమ కామ్రేడ్ల సంస్మరణ సభకు రాకపోవడానికి కారణం వాళ్ళకు 'పౌరకల పార్టీ' పట్ల ఏర్పడ్డ విముఖతా కాదు, ఈ దోపిడీ వ్యవస్థ పట్ల ఏర్పడ్డ సుముఖతా కాదు. 'మేము ఏ పోరాటానికయినా సిద్ధమే, కాని మీటింగుకు మాత్రం రాము' అని గిరిజన స్త్రీలు ప్రచారానికి వెళ్ళిన వరంగల్ కామ్రేడ్లతో అన్నారు. ఆ పోరాట ఉత్సాహాన్నీ ఆ పోరాటాన్నీ పోలీసులూ ఆపలేరు, పోలీసుల ప్రభువులూ ఆపలేరు.

మేమిటి? పోతన రాజరికాన్ని ఏ విధంగా వ్యతిరేకించాడు? మొదలైన ప్రశ్నలను ప్రస్తావిస్తే ఇబ్బందుల్లో పడక తప్పదు కాబట్టి ఆ ప్రస్తావన ఎక్కడా కనిపించదు. గుంటూరు శేషేంద్రశర్మగారు తమ ప్రసంగంలో తమదైన ధోరణిలో రాజకీయాలను తడిమినప్పుడు ఒక బాధ్యతాయుతమైన నిర్వాహకుడు అనుకూల, ప్రతికూల రాజకీయాలను చెప్పడంకోసం ఈ వేదిక లేదని చెప్పవలసి వచ్చింది. రాజకీయాలను ఇంత దూరంగా ఉంచాలనుకున్న నిర్వాహకులు రాజకీయ నాయకులను మాత్రం దూరంగా ఉంచలేదు. ఎందుకు ? ప్రజలకు చెప్పడానికి రాజకీయాలు ఉండకూడదు. వారికి అప్పటికే ఏదయినా రాజకీయ చైతన్యం ఏర్పడితే దానిని ఆధ్యాత్మిక బోధనల మత్తులో ముంచివేయాలి. మరి తమకున్న అనేకానేక ప్రయోజనాల కోసం ఒక (పాలక) వర్గం రాజకీయాలు, రాజకీయ నాయకులు అవసరమే. దానికోసం మరొక (పాలిత) వర్గం రాజకీయాలను ఈసడించకతప్పదు. ఎక్కడ తమ గుట్టు బయట పడుతుందోనని భుజాలు తడుముకోక తప్పదు. అందువలననే రాజకీయాలను ప్రస్తావించడానికి పోతన పంచశతి ఉత్సవాల వేదికను వాడుకోగూడదని ఏ నిర్వాహకుడు అన్నాడో ఆయనే ఉత్సవాలకు ముందు ఉపాధ్యాయ చర్చావేదిక, వరంగల్, పోతన మీద ఏర్పాటు చేసిన సమావేశంలో పోతన భాగవతం మీదకాక మార్క్సిజంగురించి, దానికున్నపరిమితులగురించి, పోతనభాగవతాన్ని మార్క్సిస్టు దృక్పథంతో పరిశీలించే అవకాశం లేకపోవడం గురించి తమకున్న మేధోనైపుణ్యంతో మార్క్సిజాన్ని పక్రీకరించి, దానిగురించి సాక్షికమైన సత్యాలను చెప్పి ప్రసంగ సమయాన్నంతా వినియోగించవలసి వచ్చింది. ఈ ధోరణిని గమనిస్తే ఉత్సవనిర్వాహకుల, సానుభూతిపరుల అంతర్గత ప్రయోజనమేమిటో అర్థమవుతుంది.

ఈనాడు సమాజం నిండా సంక్షోభం ఆవరించి ఉందని, దానినుంచి విముక్తి పొందడానికి పోతనను స్మరించడం తప్ప ఇంకొక మార్గం లేదనుకోవడం ఉందని ఈ నిర్వాహకుడే వేదికమీద ప్రసంగిస్తూ అన్నాడు. కాని అయిదు రోజులపాటు నిర్వహింపబడిన ఉత్సవాలలో సమర్పించబడిన సెమినార్ పేపర్లలో, ఇతర ఉపన్యాసాలలో, చర్చలలో ఆధునిక సమాజంలో పరివ్యాప్తమై ఉన్న సంక్షోభాన్ని విశ్లేషణ చేయడంగాని, ఆ సంక్షోభాన్ని తొలగించడానికి భాగవత సంప్రదాయం, సంస్కృతి, విలువలు ఎలా దోహదం చేస్తాయో ఏమీ చెప్పబడలేదు. పోతన రాజరిక వ్యవస్థను వ్యతిరేకించడం, సామాజిక సంక్షోభాన్ని నివారించడానికి పోతన పనికిరావడం –

ఇటువంటి అభ్యుదయంగా కనిపించే భావ ప్రకటన వెనక పాలకవర్గ భావాలను ప్రజ ల్లోకి తీసుకువెళ్లే తాపత్రయం తప్ప మరొకటి లేదు.

ఉత్సవాలను ప్రారంభం చేస్తూ ఎం. హిదయతుల్లాగారు "తెలుగు భాషలో విలువలను నిలిపిన మహాగ్రంథం పోతన భాగవతం" అన్నారు గాని అవి ఏ విలువలో చెప్పలేదు. ప్రక్షిప్తాలుగా చెప్పబడుతున్న పద్యాలు మాత్రమే ఆధారంగా రాజులను వ్యతిరేకించాడని చెప్పబడుతున్న పోతన భాగవతం తెలుగు దేశంలో రాజరిక వ్యవస్థ విలువలను నిలపడానికి ఉపయోగపడింది. ఈ విలువలతో కూడిన సంస్కృతికోసమే విశ్వనాథ సత్యనారాయణగారు సాంస్కృతిక సామ్రాజ్య వాదాన్ని వ్యతిరేకించారు. ఒక వక్త ఉద్దేశించినట్లుగా ప్రజా సంస్కృతిని రక్షించడానికి సామ్రాజ్యవాద సంస్కృతి పెత్తనాన్ని ఆయన వ్యతిరేకించలేదు.

భారత దేశంలో జాతీయ భావసమైక్యత కొరకు భాగవతం కృషిచేసిందని పి. వి. నరసింహారావుగారు అన్నారు. ఇది పాక్షికమైన సత్యం మాత్రమే. రాజరిక వ్యవస్థకు అనుకూలమైన ఆర్య సంస్కృతిని భారత దేశంలో వ్యాపింపజేయడంలో భాగవతం వంటి గ్రంథాలు ఆ కాలంలో బాగా పనికివచ్చాయి. ఈ ఆర్య సంస్కృతి భారతదేశ సంస్కృతిగా కనిపిస్తున్నదేగాని ఇది మాత్రమే భారతీయసంస్కృతికాదు. ఏదో ఒక స్థాయిలో ప్రజాసంస్కృతి ఎప్పుడూ ఉంటూ వచ్చిందే. బ్రిటిష్ వారికి ముందుగాని, బ్రిటిష్ పాలనలోగాని భారతదేశంలో సాంస్కృతికంగా సంపూర్ణంగా జాతీయ సమైక్యతలేదు. భారత దేశంలో ఈనాడు జరుగుతున్న నాగా, మిజో, జార్ఖండ్ జాతిపోరాటాలు ఇందుకు నిదర్శనం. రాజులమీద అంత పెద్ద తిరుగుబాటు చేసిన రష్యన్లకు చరిత్ర చైతన్యం ఉన్నదని, వారు 'పీటర్ ది గ్రేట్' గురించి తెలుసుకుంటారని, కాని మన దేశంలో ప్రాచీన చరిత్ర చదవడం ప్రమాదమని, మళ్ళీ 'నిజాం పాలన' వస్తుందని కమ్యూనిస్టులు భయపడతారని నరసింహారావుగారు అన్నారు. ప్రాచీన సాహిత్యాన్ని చదవడాన్ని, ప్రాచీన కవులను స్మరించడాన్ని కమ్యూనిస్టులు వ్యతిరేకిస్తారనే అపోహతో ఈ మాటలు అన్నట్లుగా కనబడు తున్నది, ప్రాచీన సాహిత్యాన్ని శాస్త్రీయ దృక్పథంతో సరియైన విధంగా అంచనా వేయాలనే కమ్యూనిస్టులు అంటారు. చరిత్రపట్లకూడ వారికి అదే దృక్పథం ఉంది. ప్రాచీన చరిత్రను అధ్యయనం చేసినంత మాత్రాన 'నిజాం పాలన' వస్తుందనుకునే

అవివేకం కమ్యూనిస్టులకు లేదు. కాని పోతన పంచశతి ఉత్సవాల పంటివాటిని జరిపి 'నిజాం పాలన' తేవాలనుకోవడం మాత్రం అజ్ఞానమే.

ఉత్సవాలలో ప్రదర్శింపబడిన 'మహాకవి పోతన' నాటకం సినిమాలలోని కట్టుకథలతోకూడిన చరిత్రను చూస్తే నిర్వాహకుల చారిత్రిక దృక్పథం తెలుస్తుంది. పోతన రాజులను వ్యతిరేకించాడనటానికి ఆధారాలుగా చూపుతున్న మూడు పద్యాలు పోతనవి కావని తనపరిశోధనద్వారా తెలుసుకున్నానని సి. నారాయణరెడ్డిగారు అనగా దాశరథిగారు తమకు అభిప్రాయభేదం ఉంటే దాన్ని వివరించక, ఇటువంటి పరిశోధన మా కవసరం లేదని గుడ్డిగా త్రోసివేయడంలో ఆయన పరిశోధనకు చూపిన గౌరవాన్ని గమనించ వలసి ఉన్నది.

"అన్నీ మన వేదాల్లోనే ఉన్నాయిష" అనే దృక్పథం ఈ ఉత్సవాల్లో ప్రసంగించినవారిలో కొందరిలో కనిపిస్తుంది. తనవలెనే అందరినీ చూసుకోవాలని అంటున్న హిందూమతమే సోషలిజమని ఒక వక్త అన్నారు. "అందరూ సమానమే. ఎక్కువ తక్కువలు లే"వంటూ భాగవతంలో ప్రజాస్వామ్యం చెప్పబడిందని ముగింపు ఉత్సవంలో ఉపన్యసిస్తూ స్వామి రంగనాథానందగారు అన్నారు. ఈప్రపంచాన్ని చక్కగా, లోతుగా పరిశీలన చేయాలని భాగవతంలో కృష్ణుడు ఉద్ధవునికి చెప్పిన విషయాలను తెలుసుకొని విదేశీ శాస్త్రజ్ఞులు ప్రగతిని సాధించారని, తెలుసుకోనందువల్ల మనం వెనుకబడి పోయామని వారు సెలవిచ్చారు. విదేశాల్లో శాస్త్రవిజ్ఞానం ఎంతగా పెరిగినా వారు మానసిక బాధలను పొందుతూ శాస్త్రవిజ్ఞానం కంటే ఉన్నతమైనదానికోసంఅన్వేషిస్తున్నారని, అదే ఆధ్యాత్మిక విజ్ఞానం అని, అది మన దగ్గర ఉన్నదని అంటూనే వారు శాస్త్రవిజ్ఞానానికి, ఆధ్యాత్మిక విజ్ఞానానికి; మతానికి—మతానికి భేదంలేదని, మనం విదేశీవిద్యను నేర్చుకున్నందుకే భేదం కనిపిస్తున్నదని కూడా అన్నారు.

మన దేశంలో ప్రజాస్వామ్యం ఉందనడానికి నిదర్శనం ఇందిరాగాంధీకి, కూలివానికి ఒక్కొక్క ఓటు ఉండడమని వారు అన్నారు. నిజమే. ఇందిరాగాంధీకి, కూలివానికి ఒక్కొక్క ఓటు ఉండడం వరకుమాత్రమే మనదేశంలో ప్రజాస్వామ్యం ఉంది.

ఆ ఓటు కూలివాని కొడుకు కూలివాడుగానే బతకడానికి ఇందిరాగాంధీకొడుకు శాసనాతీత నాయకుడు కావడానికి మార్గం సుగమం చేస్తున్నది! — ఎం. జి.

పుస్తక సమీక్ష : కుటుంబరావు సాహిత్యం

యుద్ధసంస్కృతికి అద్దంపట్టిన కథలు

గొప్ప రచన అంటే ఏమిటి అన్న ప్రశ్నకు ఎవరి చాపల్యాన్ని అనుసరించి వారు ఎన్ని సమాధానాలయినా ఇయ్యవచ్చును గాని, చరిత్రలో ఆ ప్రశ్నకు ఒకే సమాధానం ఉంది. సమకాలీన సమాజంలో వస్తూన్న మార్పులను, చరిత్రాత్మకమయిన పరిణామాలను, ఆ వర్తమానంలో గోచరించే భవిష్యత్తును, ఆ తరంవారికీ తరువాతి తరాలవారికీ కళ్ళకు కట్టినట్టు చూపించే రచన గొప్ప రచన. ఇట్లా చూపించడం అనుకున్నంత సులభం కాదు. ఎందుచేతనంటే మనచుట్టూ కనిపించే మార్పులలో ఏవి చరిత్రాత్మకమయినవో తెలుసుకోవడానికి చాలా నిశితమయిన పరిశీలన కావాలి. చూడడానికి ప్రధానంగా కనిపించేవి నిజానికి చరిత్ర దృష్టిలో ప్రధానం కాకపోవచ్చు. 'మాలపల్లి' నాటికి ఫ్యూడలిజం పతనం ముఖ్యమయిన పరిణామమన్న విషయం ఇవ్వాళ మనం సులభంగా గుర్తిస్తాం గాని, శాస్త్రీయ సామాజిక దృక్పథం లేని ఉన్నవ ఆ విషయాన్ని ఆనాడే గుర్తించి, ఆ పతనాన్ని—తన పరిమితుల పరిధిలోనే-చిత్రీకరించడం ఆయన గొప్పతనం.

అటువంటి మరొక గొప్ప రచయిత కుటుంబరావు. పెట్టుబడిదారీ పారిశ్రామిక విప్లవం పందొమ్మిదవ శతాబ్దపు లండన్ నగరంలో సృష్టించిన అధో ప్రపంచాన్నీ, ఆ ప్రపంచపు సంస్కృతినీ,డికెన్స్ తన నవలల్లో ఎంత శాశ్వతంగా పొందుపరిచాడో, ఈ శతాబ్దపు మూడవ, నాల్గవ, దశాబ్దపు పట్టణ మధ్యతరగతి జీవితంలోని మార్పును కుటుంబరావు అంత శాశ్వతంగాను తన కథల్లో పొందుపరిచాడు. ఆనాటి లండన్ గురించి తెలుసుకోవాలన్నా ఈనాటి కోస్తా ఆంధ్ర గురించి తెలుసుకోవాలన్నా చరిత్ర కారులను ఆశ్రయించవలసిన అవసరం లేదనిపించగలిగినంతటి చక్కటి రచయితలు ఇద్దరూ.

అటువంటి కుటుంబరావు రచనలను సంకలనం చేసి ప్రచురించాలన్న ఆలోచన చాలా మంచిది. అందుకు 'విశాలాంధ్ర'ను, సంపాదకులు కేతు విశ్వనాథరెడ్డి గారిని అభినందించాలి. అయితే సంకలనం చేసిన పద్ధతితో విభేదించాల్సి వుంది. సంకలనాల వుద్దేశ్యం కేవలం రచయిత రచనలన్నీ ఒకచోట దొరికేలా చేయడం మాత్రమేకాదు. రచయిత ఆలోచనలోని క్రమపరిణతిని ప్రతిబింబించడం మాత్రమే గూడ కాదు. మంచి రచయిత రచనల్లో ప్రతిఫలించే సమాజ పరిణతిని చూపించడం గూడ ముఖ్యమయిన అవసరం. అందుకోసం సంకలనం కాలక్రమానుసార ప్రాతిపదిక మీద

చేయడం సరయిన పని. ఇతర రచయితల మాట ఎట్లాగున్నా, కుటుంబరావు వంటి రచయితకు ఇది చాల అవసరం. అట్లాకాకుండ, ఈ సంపుటిలో 1946 నుండి 1978 వరకు రాసిన రచనలున్నాయి. కొన్నింటికి మొదట ముద్రించిన తేదీ తెలీదు, కేవలం ఏదో ఒక సంకలనంలో ప్రచురించిన తేదీ మాత్రమే వుంది. ఆరు కథలకు ఆ తేదీ గూడ లేదు. ఇది ఎంత వరకు సంపాదకుని అసహాయతను సూచిస్తుందో ఎంత వరకు ఆయన పరిశ్రమలోని లోపాన్ని సూచిస్తుందో వారే చెప్పాలి.

కుటుంబరావు కథలన్నిటిలోనికీ 1940 లలో రాసినవి ఉత్తమమయినవంటే బహుశా ఎవ్వరూ అభ్యంతరం చెప్పకపోవచ్చు. ఆ కథలకు ప్రేరణనిచ్చింది, 1930 లలో అంతర్జాతీయంగా ఏర్పడ్డ పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభం ఫలితంగా మనదేశపు మధ్యతరగతి ప్రజలకు కలిగిన ఇక్కట్లని గూడ ఇప్పటికి చాలా మంది గుర్తించారు. అయితే నా దృష్టిలో కుటుంబరావు కథలకు అంతకంటె సన్నిహితమయిన మరొక ప్రేరణ వుంది. ఆర్థిక సంక్షోభం ఈ ప్రేరణకు నేపథ్యం మాత్రమే.

1940ల నాటి కుటుంబరావు కథల్లో మనకు చాలా తరచుగా తారసపడే పాత్ర ఒకటి వుంది. ఇతను మొదట్లో మధ్యతరగతి మనిషి. చుట్టూ వున్న మధ్యతరగతి మనుషుల్లాగా తానుగూడ ఆర్థిక సంక్షోభం ఫలితంగా ఇబ్బందులకు గురవుతాడు. అప్పులను పైరవీలను ఆశ్రయిస్తాడు. ఇంతలో రెండవ ప్రపంచ యుద్ధం వస్తుంది. యుద్ధకాలంలో ఇతను ఏవో పర్మిట్లు కోటాలు లైసెన్సులు కాంట్రాక్టులు చేపట్టి ధనికుడవుతాడు. యుద్ధం తరువాత బహుశా మధ్యతరగతిని విడిచిపెట్టి ఒక మోస్తరు పెట్టుబడిదారుగా స్థిరపడతాడు.

ఇతనొక వ్యక్తికాదు, ఒకవర్గం. ఇంకా సరిగ్గా చెప్పాలంటే ఒక వర్గం గూడ కాదు, మనదేశ పెట్టుబడిదారీ వర్గ అభివృద్ధిలో ఒక దశ. ఇతను యుద్ధకాలంలో పుట్టాడు. మొదటి ప్రపంచయుద్ధ మప్పుడూ పుట్టాడు, రెండవ ప్రపంచ యుద్ధమప్పుడూ పుట్టాడు. యుద్ధ కాలంలో సరుకుల డిమాండ్ విపరీతంగా పెరిగిపోతుంది. నిరుద్యోగులుగా వున్నవాళ్ళు సైన్యంలో చేరి ఉద్యోగాలు సంపాదించుకోవడం వల్ల, సంవత్సరానికి ఆరునెలలే పనిదొరికే పేదరైతులు సైనికులై పూర్తి సంవత్సరకాలం జీతం సంపాదించుకోవడం వల్ల, యుద్ధం నడపడం కోసం అవసరమయ్యే పరికరాల వల్ల, డిమాండు పెరుగుతుంది. బలమయిన ఆర్థిక పునాదిగల పెట్టుబడి దారీ వ్యవస్థ ఈ డిమాండును వాడుకొని ఇతోధికంగా బలపడుతుంది

గాని, వలసదేశాలలో మాత్రం వక్రపరిణామాలకు దారి తీస్తుంది. ఉత్పత్తిని పెంచే పారిశ్రామిక పెట్టుబడిదార్ల బదులు, నల్లవ్యాపారం, పర్మిట్లలోను కాంట్రాక్టులలోను బ్రోకర్‌పనీ, చేసే పెట్టుబడిదార్లు పుట్టుకొస్తారు. మనదేశంలో మొదటి, రెండవ, ప్రపంచ యుద్ధాల కాలంలో ఇలాంటి వాళ్ళు కొల్లలుగా పుట్టుకొచ్చి, తరువాతి కాలంలో ఆధునిక భారత పాలక వర్గంలో ఒక భాగంగా మారారు.

ఈ నల్లబజారు పెట్టుబడిదార్లకు లంపెన్ బూర్జువా వర్గమని పేరెవరు పెట్టారో తెలీదుగాని అది చాలా చక్కగా అతికేపేరు. ఉత్పాదక శ్రమ (productive labour) చేయకుండ, ఉత్పాదక శ్రామికులను ఆపరించి జీవించే అధో ప్రపంచ నివాసులు లంపెన్ కార్మికులయితే, ఆ ఉత్పాదక శ్రామికులను దోచుకునే పారిశ్రామిక పెట్టుబడిదార్ల ప్రపంచాన్ని ఆపరించి జీవించే వీళ్ళు లంపెన్ పెట్టుబడి దార్లు. స్మగ్లర్లు, నల్లబజారువ్యాపారస్తులు, లైసెన్సులను పర్మిట్లను కాంట్రాక్టులను తిరగనమ్ముకునే బ్రోకర్లు, ఘరానా డాఫర్లు, ఈ వర్గానికి చెందుతారు. వీళ్ళ సంస్కృతికి లంపెన్ కార్మికుల సంస్కృతికీ తేడా లేదు. అమానుషత్వం ఈ సంస్కృతి చాలాకు ముఖ్యలక్షణం. మనదేశంలో ఈ లంపెన్ అంశలేని పెట్టుబడి దార్లెవ్వరూలేరు కాబట్టి (దొంగవ్యాపారం చేయడంలో అత్యాధునిక పరిశ్రమల యజమాన్లు కాంట్రాక్టర్లకు ఏమాత్రం తీసిపోరు), మనదేశ బూర్జువా సంస్కృతిలో తొలినాటి ఉదారవాదం కంటే లంపెన్ లక్షణాలే ఎక్కువ. నాగార్జునసాగర్ ప్రాజెక్టు సిమెంటును దొంగవ్యాపారంచేసి పట్టుబడ్డ దొంగ కాంట్రాక్టరు సుబ్బరామిరెడ్డి హైదరాబాద్ నగర సాంస్కృతిక రంగానికి రెండేళ్ళపాటు ఏకచ్ఛత్రాధిపతి కావడం యాదృచ్ఛికంకాదు. ఆ సంస్కృతి అతనిదే కాబట్టి దానికి అతనే అధ్యక్షత వహించడం సబబు.

తన చుట్టూ వున్న మధ్య తరగతి జనంలోంచి యుద్ధకాలంలో ఈ వర్గం పుట్టి పైకి రావడం గమనించడంతోనే కుటుంబరావుకు ప్రపంచం అర్థమయిందని నా అనుమానం. కుటుంబరావు 'కాపిటల్' 1942లో చదవడం గూడ కాకతాళీయంకాదు. 1942 నాటికి సరిగ్గా యుద్ధం తీవ్రదశనందుకుంది. అప్పటికే కాంట్రాక్టులమీద కోటాలమీద పర్మిట్ల మీద నల్లబజారులోను చేసుకోవలసిన వాళ్లు చేసుకోవలసినంత లాభం చేసుకున్నారు.

తనకు తన సమాజవాస్తవ స్వరూపాన్ని ఏ పరిణామం తెలియబరిచిందో,

దాన్ని కుటుంబరావు తన కథల్లో చక్కగా పొందుపరిచాడు. 1940 లలో ఆయన రాసిన చాలా కథల్లో ఈ లంపెన్ బూర్జువా వర్గానికి చెందిన వ్యక్తులు ప్రధానంగా కనిపిస్తారు. ఈ సంపుటిలో అటువంటి కథలు ఆరు వరకు ఉన్నాయి.'సద్యోగం' లో సూర్యనారాయణ, 'అట్టడుగు'లో గణపతి, :'కలిసిరావాలి'లో : రంగయ్య, 'షావుకారు సుబ్బయ్య'లో సుబ్బయ్య, 'పైకివచ్చినవాడు'లో సీతరామరావు, 'శీలపరిశీలన' లో కథకుడు, ఈ వర్గానికి ప్రతినిధులు. అయితే వీళ్ళు ఆయా కథల్లో ముఖ్యమయిన పాత్రలేగాని కథానాయకులు కారు. కథానాయకుడు ఎప్పుడూ గూడ మామూలు మధ్య తరగతి మనిషి. యుద్ధం పూర్వం కుటుంబరావుకుమల్లే అతను గూడ అమాయకుడు, అంటే ప్రపంచ స్వరూపం తెలీనివాడు. యుద్ధం జరుగుతూండగా, తిండికి గతిలేని గణపతి, చిల్లర వ్యాపారస్తుడు సుబ్బయ్య కాంట్రాక్టులు చేపట్టి, పర్మిట్లు తిరగనమ్మి' రాత్రికి రాత్రే ధనికులు కావడం చూస్తాడు. చూసి ప్రపంచ స్వరూపాన్ని అర్థం చేసుకుంటాడు.

అర్థమయితే చేసుకుంటాడు గాని తిరగబడడు. సాహిత్యం ప్రజల సమస్యలకు పరిష్కారాన్ని చూపాలని కొందరుచేసే వాదనను కుటుంబరావు ఆమోదించారో లేదోగాని, తనతొలినాటి రచనలలో ఆచరించలేదు. మధ్యతరగతి నుండి పైకి వెళ్ళిన లంపెన్‌బూర్జువా వర్గాన్ని మధ్యతరగతి 'మంచివాళ్ళ' కళ్ళతోనే చూపించడం వల్ల ఇక్కడ నిజానికి తిరుగుబాటుకు ఆస్కారంలేదు. 'పైకివచ్చినవాడు' లో రాఘవులుకు,తన తమ్ముడు సీతారామారావు సప్లయిశాఖలో లంచాలు సంపాదించి కోటాలు తిరగనమ్మి ధనవంతుడయి వుండవచ్చుగాని, 'డాకుచేసే బాదుషావు' కాదు, ఎంత చెడ్డా తనతమ్ముడే. అతనితో నవ్వుతూనే మాట్లాడతాడు. ఇంటికి రమ్మని ఆహ్వానిస్తాడు గూడ. చివరికి మనకుదొరికే 'పరిష్కారం', కమ్యూనిస్టయిన రాఘవులు అల్లుడు, సీతారామారావు మామగారిమీద ఎలెక్షనులో పోటీచేసి ఓడించడమే.

మరొక ఉదాహరణ 'సద్యోగం'లో కథకుడు. ఒకప్పుడు పేదవాడిగావున్న తనమిత్రుడు సూర్యనారాయణ ఘరానా స్త్రీలకు డాఫర్ పనిచేసి ధనికుడయ్యాడని తెలుస్తుంది. అసహ్యించుకుంటాడు. కాని అంతలో మధ్యతరగతి 'మంచివాడి' మొగమాటం అడ్డువస్తుంది. దేశంలో తన మిత్రుడిలాంటి వారు ఎంతమందిలేరు? వాళ్ళను తాను ఏమనగలిగాడు, ఏంచేయగలిగాడు? అన్నీ అమ్మకపు సరుకులైన తరువాత మనిషి మాంసం అమ్మకపు సరుకయితే వచ్చిందా? ఇత్యాది. చివరికి, మధ్యతరగతి మనస్తత్వానికి ప్రతీక అయిన ప్రశ్నతో తన ఆలోచన ముగించుకుంటాడు'నాకెందుకు మధ్యపేచీ?'

'కలిసిరావాలి'లో రంగయ్య మరీ అన్యాయమయిన మనిషి. యుద్ధకాలంలోనే కాదు,అంతకు పూర్వంగూడ కాటకం వచ్చినప్పుడు వడ్డీవ్యాపారం చేసి లక్షలు కూడ బెడతాడు. అయినా కథకుడిలో అతని పట్ల ద్వేషం కనిపించదు. విషప్పురుగును జీవశాస్త్రజ్ఞుడు ప్రయోగశాలలో చూసినట్లు నిర్లిప్తంగా చూస్తూ, అతనిలో 'తాత్విక క్షీణత'ను మాత్రం గమనిస్తాడు. అధికారమార్పిడి అనంతరం వచ్చిన మార్పులకు రంగయ్య సర్దుబాటు చేసుకోలేక తన ఆస్తిని కోల్పోతే అందులో కొంత తనకూ దక్కుతుందేమోనన్న క్షుద్రమయిన ఆశగూడ వ్యక్తపరుస్తాడు.

లంపెన్‌బూర్జువా వర్గాన్ని ఆ వర్గానికి సామాజికంగా సన్నిహితమయిన మధ్యతరగతి కళ్ళతో చూపించడం వల్ల అనివార్యంగా ఏర్పడే శైలి, వ్యంగ్యానికి ప్రాధాన్యతనిచ్చే వాళ్ళకు సంతృప్తి కలిగించవచ్చును గాని, మార్క్సిస్టు దృక్పథం నుండి ఒక తీవ్రమయిన పరిమితిగానే పరిగణించాలి. ఆ పరిమితే బూర్జువా విమర్శ కులకు కుటుంబరావు పట్ల ఉండే సద్భావానికి కారణం (ఉదాహరణకు, వాళ్ళు కుటుంబరావు పట్ల చూపుతున్న ఆదరణ అల్లంరాజయ్యకు ఎన్నటికీ చూపరని నా అనుమానం).

ఆనాడు భారతదేశంలో వర్గ పోరాటం తీవ్రంగాలేని మాట వాస్తవమే. అయినా ఈ లంపెన్‌బూర్జువా వర్గాన్ని దాని చీకటి వ్యాపారానికి బలిఅయిన పేదవాళ్ళ కళ్ళతో చూపించి వుంటే మరికొంత న్యాయంగా వుండేది. ఈ పరిమితిని కుటుంబరావు 1970 తరువాతి కాలపు వ్యాసాలలో అధిగమించాడు, కాని ఆ వ్యాసాలు 'విశాలాంధ్ర' వారిచేతిలో సంకలనానికి నోచుకుంటాయా అంటే అనుమానమే.

○ ○ ○

ఈ లంపెన్ బూర్జువా వర్గపు పుట్టుకే కాకుండా ఇతర ఇతివృత్తాలు....మన సమాజ జీవితాన్ని మరికొంత సాధారణస్థాయిలో ప్రతిబింబించేవి— గూడ వున్నాయి. క్షీణిస్తున్న ఫ్యూడల్ ఆచారాలు, అంకురిస్తున్న బూర్జువా విలువలు, వ్యాపారదృష్టి, చాలాకథలకు ఇతివృత్తాలు సమకూర్చిపెట్టాయి. 'శాస్త్రీయసంగీతం' అనబడే ఫ్యూడల్ సంగీతం మీద మోజుతో చదువుపాడుచేసుకొని ఇల్లువదిలి మద్రాసుపారిపోయి చివరికి ఇళ్ళస్థలాలు అమ్ముకునే వ్యాపారంలో స్థిరపడ్డ గోపాలం ('ద్వైవాధీనపు జీవితం'), అత్తగారి వూళ్లో అత్తగారి సాంప్రదాయికపు పెత్తనాన్ని నిరసించి,పట్టణం వచ్చాకమాత్రం అక్కడి కిరాయి ఇళ్ళ వ్యాపార సంస్కృతి

చీదరను సవ్వుతూ భరించే శారదాంబ ('అద్దెకొంప'), ఈ మార్పుకు ప్రతీకలు. మరొక ఉదాహరణ, 'నడమంత్రపుసిరి' నాటికలో శాస్త్రి. చదువు చెప్పడం పట్ల ఆసక్తితో ట్యుటోరియల్ కాలేజి పెడతాడు శాస్త్రి. మొదటి సంవత్సరం అందరూ పాసయినందుకు సంతోషిస్తాడు. మరొక టీచర్ని గూడపెట్టి ఎక్కువమంది విద్యార్థుల్ని తీసుకోవాలనుకుంటాడు. అయితే అతనిలాగ వృత్తిపట్ల శ్రద్ధతో కాకుండా వ్యాపారదృష్టితో పనిచేసే దాసు అతని తరువాత టీచరుగా చేరిన నీల,సినిమా ఛాన్సు దొరకగానే అర్థాంతరంగా ఉద్యోగం వదిలిపెట్టి వెళ్ళిపోతారు. దానితో చదువు పాడయి తరువాతి సంవత్సరం సగం మందికి పైగా ఫెయిలవుతారు. గత్యంతరం లేక శాస్త్రి స్కూలు మూసేసి, తాను తన స్వార్థానికి బుద్ధిపూర్వకంగా ఇంకొకర్ని బలిచేయలేదన్న సంతృప్తిని మాత్రం మిగుల్చుకుంటాడు.

అయితే అందరికంటే చక్కటి ఉదాహరణ, 'నువ్వులు-తెలకపిండి'లో సోమయాజులు. అడవుల్ని చెట్లనీ పూలనీ చూసి సహజంగా పొందే ఆనందం అతను పాటలు పాడడంలో పొందేవాడు, చిన్నప్పుడు. అంత సహజంగాను అతని పాటను ప్రేమించి అతన్ని పెళ్ళిచేసుకుంటుంది జయలక్ష్మి. అయితే అడవుల్ని వ్యాపారం చేసుకునే కాంట్రాక్టర్లున్నట్టే పాటను వ్యాపారం చేసుకునే నాటకాల కాంట్రాక్టర్లు, సినిమా నిర్మాతలు, వున్నారు. సోమయాజులు వాళ్ళ చేతుల్లో పడతాడు. తనపాటతో వాళ్ళకు లక్షలు సంపాదించి పెడతాడు. తాను మాత్రం డబ్బు చేసుకోడు సరికదా, పాడడంలోగల ఆనందాన్నీ, తాను పాడగా విని భార్యపొందే ఆనందాన్నీ సహితం కోల్పోతాడు. వ్యాపార గానుగనుండి వట్టి నిస్సారమయిన తెలకపిండిగా బయట పడతాడు.

ప్రపంచ వ్యాప్తంగా ఫ్యూడలిజం నశించి దాని అవశేషాల నుండి పెట్టుబడి దారీ సమాజం పుట్టే పరిణామం గత నాలుగు శతాబ్దాలుగా సాగుతోంది. అన్ని దేశాల ఆధునిక చరిత్రలోను గొప్ప రచయితలగా పేరు పొందిన వాళ్ళలో చాల మంది ఈ పరిణామాన్ని వ్యక్తీకరించిన వాళ్లే. Miguel Cervantes నుండి కుటుంబరావు వరకు ఈ జాబితా చాలా పెద్దది. అయితే మార్క్సిస్టయిన కుటుంబరావులో ఇక్కడ ఒక ప్రత్యేకత వుంది. ఈ చారిత్రక పరిణామం ఆస్తిపరులలో కలిగించిన మార్పును మాత్రమే కాకుండ, శ్రామిక జనంలో కలిగించిన మార్పును గూడ చక్కగా చూపించిన కొద్దిమంది రచయితలలో కుటుంబరావు ఒకడు. ఈ దృష్టి నుండి చూస్తే, [illegible] జీవితం' చాలా విలక్షణమయిన కథ.

విఠల్‌పాండురంగ్ రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి. అతని మాటల్లో చెప్పాలంటే, 'ఇంటిదగ్గర తన వాళ్ళు గౌరవ కుటుంబీకులు'. అంటే అర్థం, ఒకప్పుడు సుమారుగా భూమి ఉన్నవాళ్ళు. క్రమంగా భూమి కోల్పోయారో, కుటుంబం పెరిగిందో, తెలీదుగాని, అప్పులపాలయ్యారు. అప్పుతీర్చేందుకు కొంతడబ్బు సంపాదిద్దామని విఠల్ పట్టణం వచ్చి ఫాక్టరీలో హమాలీ పనిలో చేరతాడు. అన్ని దేశాలలోనూ ఈ రకంగా చితికిపోయిన రైతాంగంనుండే పారిశ్రామిక కార్మికవర్గం ఏర్పడింది.

పట్టణంలో మొదటిరోజు జరిగే సంఘటనలోనే కుటుంబరావు విఠల్ జీవితంలోని మార్పును చక్కగా చూపుతాడు. తమ అవసరాలకోసం తాము శ్రమించే మధ్యతరగతి రైతుకుటుంబానికి చెందిన విఠల్‌కు, వీలయినంత ఎక్కువగా పని చేయడం అలవాటు. గంట పనిని అరగంటకు కుదించడం వీలయితే కుదించాలని చూస్తాడు. ఫాక్టరీలో శ్రమించేది తనకోసం కాదని, యజమాన్ల లాభాలకోసమని, అర్థం కాక ఆ దృక్పథాన్నే ఇక్కడా ప్రదర్శిస్తాడు. లోహపు అచ్చుల్ని లారీ నుండి గోదాముకు చేరవేసేటప్పుడు, ఒకేసారి మూడు అచ్చుల్ని మోయవచ్చునని తోచి తోటి కూలీతో ఆమాట చెప్పి, 'చాల్లే, గొప్పపనివాడివి!' అని కసిరించుకుంటాడు.

త్వరలోనే ఫాక్టరీలో సమ్మె జరుగుతుంది. ఒక కూలీని పనినుండి తీసివేస్తే మిగిలినవాళ్ళకు వచ్చిన నష్టమేమిటో, వాళ్ళెందుకు సమ్మె చేయాలో విఠల్‌కు అర్థం కాదు. ఏ కుటుంబం అవసరాలు ఆ కుటుంబం చూసుకునే మధ్యతరగతి రైతాంగ సంస్కృతికి చెందిన విఠల్‌కు కార్మికుల జీవన పరిస్థితులే వాళ్ళను సంఘటిత పరుస్తాయని, సంఘటిత శక్తే వాళ్ళ ఆయుధమని అర్థంకావడానికి కొంత సమయం పడుతుంది. అర్థంకాక, సమ్మె విచ్ఛిన్నకారులతో కలిసి ఫాక్టరీకిపోయి, యజమాని మన్ననలు అందుకోకపోగా, సమ్మె చేసిన కార్మికులతో తిట్లుతింటాడు.

అయితే డబ్బుకు విలువయిచ్చే పెట్టుబడిదారీ సమాజ మనస్తత్వాన్ని త్వరలోనే విఠల్ అలవర్చుకుంటాడు. ఇంటిదగ్గర ఉన్న బాకీ రెండువందల యాభైరూపాయలు తీర్చడం కోసం నెలకు పదిరూపాయలపైగా మిగిలించి ఇంటికి పంపుతాడు. కొంతకాలం తరువాత తల్లికి ఒంట్లో బాగులేదని తెలిసి ఇంటికిపోతాడు. తాను పంపిన డబ్బుతో కొంతయినా అప్పుతీరి వుంటుందనుకుంటాడు. కాని ఇల్లు చేరి పరిస్థితి చూసాక బాధపడతాడు. తన తల్లి ఆ డబ్బుతో అప్పుతీర్చకపోగా, చాదస్తపు ఆచారాలకు ఖర్చుపెట్టిందని కోపగించుకుంటాడు. ఇక్కడున్నది **బూర్జువా** విలువలకు

ఫోకస్:

మృత్యు శిఖరం మీద

యుద్ధఫిరంగి

ప్రజాపోరాటాల్లో పదునెక్కి, ప్రభుత్వ నిర్బంధాల్లో రాటుదేలిన ప్రజాకవి చెరబండరాజీనాడు గాంధీ వ్యాధిగర్భగుడి (Ga dh H spital లో మృత్యు శిఖరం మీద యుద్ధ ఫిరంగిలా నిద్రోతున్నాడు, నిద్రోయే బాంబు ఎప్పుడు బ్రద్దలవుతుందో తెల్వదు. చెరబండరాజు దీర్ఘకాలికంగా ఈ దోపిడి వ్యవస్థకు మరణశాసనాన్ని రాస్తూ వస్తున్నాడు. అతని చేతులు కట్టెయ్యాలని, నోరు నొక్కెయ్యాలని, కాళ్ళు నరికెయ్యాలని, ఉద్యోగంతీసి, జైల్లోవేసి, కేసుల్లో త్రోసి, విఫల ప్రయత్నం చేసి చివరికి మెదడులో ట్యూమర్‌గా ప్రవేశించాయి ఖద్దరు క్రిముల విషపు సూదులు. శ్వాస ఆగేంతవరకు తన ప్రజారాజకీయ విశ్వాసాన్నొదులుకోనంటున్న చెరబండరాజీనాడెందుకక్కడున్నాడు ?

మీరు కళ్ళు తెరుచుకొని మీ చుట్టూ వున్న తెల్లప్రపంచాన్ని చీల్చుకొని కాస్త బయటికొచ్చి చూస్తే కార్మికుని నోళ్ళల్లో, కర్షకుల గూళ్లల్లో, విద్యార్థుల కళ్ళల్లో, విప్లవకారుల ఉపన్యాసాల్లో చెరబండరాజు కన్పిస్తాడు. కొంగునడుముకు చుట్టి, కొడ

ఫ్యూడల్ విలువలకు సంఘర్షణ అని గుర్తించలేక, తన శ్రమను వీళ్ళు గౌరవించలేదని కోపగించుకుని, ఫ్యాక్టరీలో కూలీలు సమ్మె సమయంలో చూపిన పరస్పర ఆదరాన్ని గుర్తుతెచ్చుకుని, మళ్ళీ ఇంటికి ఒక్క పైసగూడ పంపకూడదని నిర్ణయించుకుని తిరిగి పట్టణానికి వస్తాడు. కుటుంబరావు మాటల్లో చెప్పాలంటే, ఈసారి అతను 'నిజమయిన పారిశ్రామిక కార్మికుడుగా' పట్టణం ప్రవేశించాడు. బి. జి

(కుటుంబరావు సాహిత్యం- మొదటి సంపుటంలోని కథలు మాత్రమే ఇందులో సమీక్షించబడ్డాయి.)

కుటుంబరావు సాహిత్యం-మొదటి సంపుటం- సంపాదకుడు. కేతువిశ్వనాథరెడ్డి, విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్ ప్రచురణ (జనవరి 1982, పేజీలు : 422+32, వెల రు. 25-00, 1/8 డెమ్మీ, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ 520 004.

వలి చేతబట్టి పంటకోతకెళ్లే చెల్లి హృదయంలో, తలపాగాచుట్టి, ములుకోలబట్టి ఏరు వాక సాగే రైతు ఉత్సాహంలో ఇక్కడ అక్కడ అననేమి లేక గడ్డిగురేసే ప్రతి చోట చెరబండరాజు నీరు పోస్తూ కన్పిస్తాడు. దానికి కాపలా కాస్తూ గూడ కన్పి స్తాడు. అందుకే గరికమేయడమే పనిగా పెట్టుకున్న గాడ్దులకు చెరబండరాజు అడ్డొ చ్చాడు. అతన్ని ప్రపంచంనుంచి తీసెయ్యాలని తీవ్రమైన కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయవి. పొట్టమీదకొట్టి వీపుమీదదువ్వే ప్రభుత్వం అతనికి ఆర్థిక సహాయం చేయబోయింది. దాన్ని తిరస్కరించాడు. అతను మరణిస్తాడని నమ్మకం కుదిరాకే మానవత్వం పోజులో కుట్రకేసులెత్తేశారు.

అతను అశేష పీడిత జనం హృదయాలమీద భావాల్ని అచ్చొత్తిన విప్లవకవి గద్దర్, వంగపండు, అంజయ్యలాంటి ప్రజా కవులకు అన్యాపదేశ గురువు. మేల్కొంటున్న పొలాల్లో, దుక్కిదుంతున్న రైతు ఊరేగింపుల్లో మారుమ్రోగుతున్న నినాదం. అతను మన భారతమాత సంకెళ్ళు త్రెంచడానికి తను స్వయంగా సంకెళ్ళేసు కున్నాడు. లాఠీదెబ్బలు తిని, ఉద్యోగం పోగొట్టుకొని,కుట్రకేసుల్లో ఇరికించబడ్డాడు. చివరికినాడు బ్రెయిన్‌ట్యూమర్ వ్యాధితో మాట- చూపు, అన్నీ పోయిగూడా మృత్యు శయ్యపై ఇంకా మనల్నే శ్వాసిస్తున్నాడు. అతన్నీ, అతని కుటుంబాన్నీ ఆదుకోవడం మనందరి కర్తవ్యంగా భావిద్దాం.

* చెరబండరాజు చిరకాలం వర్ధిల్లాలి.
* విప్లవ రచయితపై కుట్రకేసులెత్తి వెయ్యాలి.
* నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి.

PDSU
(Arts College.)

(ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజి ముందు పి. డి. ఎస్. యు పెట్టిన బోర్డుమీది 'ఫోకస్' గోడపత్రిక నుంచి)

లే చెరా ! లేచిరా !

నారాయణరావు

జనంపాట పాడరావెరో! సెరబండరాజ
ఎరుపుపాట పాడలేవెరో!
బందూకుల పంటవేయరో! సెరబండరాజ
విప్లవాల మంటసేయరో ||జనంపాట||

'ప్రజ' బతుకులు పాడినావురో సెరబండరాజ
'ప్రజ' మనసుల నాడినావురో!
'ఎదిరి' నిన్ను 'సెనక' లేదురో! సెరబండరాజ
మెదడు 'కంతి' లొంగదీసెరో !
బతుకంతా పోరుజేస్తివో! సెరబండరాజ
'సావు'తోనె పోరుతున్నవో!
నిరుపేదల బతుకుపోరులో సెరబండరాజ
విరసానికి ఇరుసువైతివో ||జనంపాట||

జనం కతలు పాడాలని....
జనతపెతల నాడాలని....
చారుబాబు, సత్యాలకు
వారసులం కావాలని....
మూగవోయి ఉన్నవేమిరో! సెరబండరాజ
సాగి,సాగి అలసినావెరో! ....నీబతుకుబండి
లాగిలాగి అలసి నావెరో ....మన పోరుబడి
లాగిలాగిఅలసినావెరో!
అలుపులేదు సొలుపులేదు....
ఆయాసం అసలెలేదు....
కదంతొక్కి పదంపాడరో! సెరబండరాజ
సిందూరం దూపమేయరో! సువు సిందులేసి
సిందూరం దూపమేయరో! ||జనంపాట||

బడిపంతులు ప్రజకొరకు పదాలు రాయుచేపన్నరు;
బతుకుతెరువు నీ నౌకరి లేదులేదు పొమ్మన్నరు....

అరదండాలేశారు....జైళ్ళపాలు జేశారు....
గతుకులబతుకుల నిన్నే కడతేర్చగజూశారు.
దొరలతొత్తులైన కవులు 'కలా'కారులనేవాళ్ళు
కార్మిక నాయకులింకా లఫంగులూ, లుచ్చాలూ....
డబ్బుల కంగడి వస్తువ వోలె అమ్ముడై పోంగా"....
పెల్ల జల్ల పస్తయిన పోరు రాజీ లేదన్నవు....
పోరింకా ముగియలేదురో ఆకలిపోరున
నీకు సెలవు నీయబోమురో! ॥జనంపాట॥

కుళ్ళికంపుకొడుతున్న వ్యవస్థనే వెళ్ళగించి....
రాజకీయ లోఫర్లను డాఫర్లను ఎండగట్టి....
శాపాలే చాలవని.... పోరాటం కావాలని....
దొరలపీడ విరగడకై ఆరాటం చెందావు....
కలంపట్టి జనం "మనసు కొలిమి" మంట జేసినావు....
"మార్క్సిజమే" మందిబతుకు మార్చేందుకు మందన్నవు....
లేసిపోరు నడుపవేమిరో! కూలోల్ల మెతుకు
దోసెదొరల కూల్చరావెరో! ॥జనంపాట॥

కతలన్నవు వెతలన్నవు.... "పోతం"బట్ట పదమన్నవు
విప్లవాల యుగమన్నవు.... విప్లవిస్తె జయమన్నవు....
"మెతుకులేని గంజిబతుకు" బదాబదల్ జేసేందుకు
బందూకుల అడవిలోకె మందిమార్గమన్నావు....
విప్లవకవి 'గెరిల్లా' పాణిగ్రాహి సుబ్బారావ్
పెన్నుగన్ను నీకోసం పదిలంగా ఉంచినాడు....
చికాకోలు చిట్టడవుల్లో సెరబండరాజ
తుపా"కీల" మండించవెరో ॥జనంపాట॥

పల్లెపల్లె కదలాలని.... పట్నాలను చుట్టాలని....
రైతుకూలి పోరాటం రగిలి సెగలు కక్కాలని....
"మావో ఆలోచన"తో ముందడుగేవేశావు....
అంటుకున్న కొలిమియింక ఆరగూడదన్నావు....

వ్యవసాయపు విప్లవాలు ఆగగూడదన్నావు....
బందూకుల బడ్తున్నంరో!
ఈ బూమిబుక్తి
పంచాలని సూస్తున్నంరో!
బానిసబతుకుల
తుంచాలని లేస్తున్నంరో!
ఎర్రజెండ లెత్తినామురో! సెరబండరాజ
ఎర్రగుండెల త్తినాముర్రో!
కలంపిడికిలెత్తినామురో! సెరబండరాజ
లాల్‌సలామందుకోవెరో!
లాల్‌సలామందుకోవెరో!
లాల్‌సలామందుకోవెరో!

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ప్రత్యేక సంచిక
అక్టోబర్ 82

1946 జూలై 4న దొడ్డి కొమురయ్య మరణంతో ప్రారంభమైన తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం 1943 సెప్టెంబరు 13న నిజాం రాష్ట్రంలో నెహ్రూ, పటేల్ యూనియన్ సైన్యాల ప్రవేశంతో మరొక మలుపు తిరిగింది. ఇది 1951 వరకు కూడ కొనసాగింది. పోలీసు చర్య - రైతాంగ సాయుధ ప్రతిఘటన ప్రభావాలను, ఆయా వర్గాల స్వభావాన్ని, పాత్రను చిత్రించే సాహిత్యం కూడ ఈ కాలంలో చాల వెలువడింది.

కనుక 1946_51 వరకు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం రెండు దశలను సాహిత్య, సాంస్కృతిక రంగాలనుంచి విశ్లేషణాత్మకంగా పరిశీలించే ప్రత్యేక సంచికగా సృజన అక్టోబరులో వెలువడుతుంది. ఆ పోరాటంతో, ఆ సాహిత్యంతో ప్రత్యక్షంగా కాని, సాహిత్యపరంగా గానీ పరిచయం, సంబంధం, ఆసక్తి వున్నవారు తాము ఎంచుకున్న అంశంపై రచన చేసి ఆగస్టు 15 వరకు మాకు అందేలా పంపించవలసినదిగా కోరుతున్నాం.

—'సాహితీ మిత్రులు'

సృజన ఆర్థికస్థితి

గతంలో ఎన్నోసార్లు ప్రకటించినప్పటికీ రెగ్యులర్‌గా విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ ముఖ్యంగా ఏజెంట్లు డబ్బు సరిగా చెల్లించక పోవడంవల్ల సృజన ఆర్థిక స్థితి రోజు రోజుకూ దిగజారుచున్నది. ఏప్రిల్ '82 సంచికకు సంబంధించిన ఈ క్రింద ఇచ్చిన అకౌంట్ స్టేట్ మెంట్ సృజన ప్రస్తుత స్థితిని తెలుపుతుంది.

జమ		ఖర్చు	
చందాల ద్వారా	694-50	ప్రెస్, పేపర్ బిల్స్	1567-00
ఏప్రిల్ సంచిక వెలువడిన నాటినుంచి మే సంచిక వెలువడేదాకా ఏజెంట్ల నుంచి వచ్చిన డబ్బు	129-75	పోస్టేజీ	150-00
	రు. 824-25		రు. 1717-00
	లోటు : 892-75		

ఈ రకంగా సృజన నడపడం అసాధ్యమైన విషయం. ఇప్పటికైనా సృజన ఆర్థిక పరిస్థితి తీవ్రతను గ్రహించి పాత బాకీలన్నీ చెల్లించవలసిందిగా, ఇక నుంచి ఎప్పటి బాకీలు అప్పుడు చెల్లిస్తూ ఉండవలసిందిగా ఏజెంట్లకు విజ్ఞప్తి చేస్తున్నాం.

ఈ కారణాన రాష్ట్రంలో అనేక ఏజెన్సీలు రద్దుచేస్తున్నాం కనుక పాఠకులను చందాలు కట్టవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

— సాహితీ మిత్రులు

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu' Printed at Nagendra Printing Works, Vijayawada-2 for Venkataramana Mudranalayam. Warangal.
Working Editor : Varavara Rao.

SRJANA Telugu Monthly **July '82** **H/WL-10**
Regd. No. with Registrar of Newspapers 10953/67.



మాచెర్ల విరసం మహాసభల ద్వారం (టిక్కా రాములు నగర్),
ఊరేగింపులో ఒక దృశ్యం (రిపోర్టు 15 వ పేజీలో)

SRJANA
Hanamkonda-506 001

Single Copy Rs. 2-00
Yearly Subscription Rs. 20-00